బ్రహ్మర్షి పత్రీజీ దివ్య ఆశీస్సులతో...


# భగవంతుడంటే ?

## తటవర్తి వీరరాఘవరావు




**అనుబంధం :**

బ్రమ్మర్షి పత్రి గారి పిరమిడ్ జ్ఞాన నవరత్నాలు, యోగివేమన, వీరబ్రహ్మేంద్రస్వామి, నానాటి బ్రతుకు నాటకము, సంకల్ప శక్తి



బ్రహ్మర్షి పత్రీజి దివ్య ఆశీస్సులతో....

# భగవంతుడంటే ?



బ్రహ్మర్షి పత్రీజీ

రచన :

## తటవర్తి వీరరాఘవరావు,

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# భగవంతుడంటే ?


| | | |
|---|---|---|
| రచన | : | **తటవర్తి వీరరాఘవరావు** |
| మొదటి ముద్రణ | : | మే, 2008 |
| ప్రతులు | : | 2000 |
| రెండవ ముద్రణ | : | ఫిబ్రవరి, 2009 |
| ప్రతులు | : | 3000 |
| మూడవ ముద్రణ | : | నవంబరు, 2010 |
| ప్రతులు | : | 3000 |
| నాల్గవ ముద్రణ | : | నవంబరు, 2011 |
| ప్రతులు | : | 3000 |
| ఐదవ ముద్రణ | : | ఫిబ్రవరి, 2021 |
| ప్రతులు | : | 1000 |
| వెల | : | రూ. 130/–లు |



**పుస్తకముల కొరకు :**

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తి వారి వీధి,

**భీమవరం - 534 201.** ప॥గో॥జిల్లా.

సెల్ : 94901 71853, 9440309812

email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | భగవంతుని గురించి తెలుసుకోండి! | 5 |
| 2. | విగ్రహం భగవంతుడా? | 7 |
| 3. | "నిజమైన ఆరాధన" | 10 |
| 4. | "విగ్రహారాధన కాదు - నిగ్రహారాధన చెయ్యాలి!" | 11 |
| 5. | "శ్రీ మద్భగవద్గీతలో భగవానుడు తనను గూర్చి చెప్పిన సందేశం!" | 13 |
| 6. | మానవుడు చేసేది! భగవంతుడు చూసేది! | 17 |
| 7. | "భగవంతుని అవగాహన చేసుకోవాలి!" | 19 |
| 8. | "నిజమైన దేవాలయం!" | 24 |
| 9. | "భగవంతుని గుర్తించే ఒక్కగానొక్క మార్గం!" | 26 |
| 10. | "ఆత్మ దృష్టే భగవత్ దృష్టి" | 28 |
| 11. | "ఆత్మే భగవంతుడు అని నమ్మాలి !" | 30 |
| 12. | ఎవరికి కృతజ్ఞత చూపించాలి? | 32 |
| 13. | "భగవంతుడు నిరాకారుడు!" | 36 |
| 14. | "భగవంతుడు చైతన్య స్వరూపుడు!" | 38 |
| 15. | "భగవంతుని శక్తి అపారం!" | 40 |
| 16. | "భక్తి అంటే?" | 43 |
| 17. | "భక్తిలో రకాలు!" | 45 |
| 18. | "నిజమైన భక్తులు" | 47 |
| 19. | ఎవరు నిజమైన భక్తుడు? | 49 |

20. "దేవుళ్ళంతా దారి చూపించటానికే వచ్చారు!" 51

21. "ఎదగాలంటే క్రిందిస్థాయి వదలాలి" 53

22. "లోకులు మెచ్చేది భగవంతుడు మెచ్చడు!" 57

23. "పూజకంటే గుణం ముఖ్యం!" 59

24. "రూపం కాదు గుణం సరిచేసుకోవాలి!" 61

25. "అంతర్ శుద్ధే ముఖ్యం!" 64

26. "భావనే భగవంతుడు చూస్తాడు!" 66

27. "ప్రార్థన అంటే భగవంతుణ్ణి మార్చడం కాదు మనం మారడం!" 68

28. "భగవంతుడు విత్తనాలనే ఇస్తాడు ఫలాలను ఇవ్వడు!" 69

29. "ప్రేమ" అన్నది సహజ గుణం కావాలి! 71

30. "మనం చేసే అన్ని పుణ్యకర్మలు ఒకటే ఫలితాలు ఇవ్వవు!" 73

31. "భగవంతుని మెప్పు పొందాలి!" 75

32. "భక్తితో ముక్తిని పొందినవారితో పోల్చుకోకూడదు!" 78

33. భగవంతుని మీద ఇష్టం పెంచుకొనేముందు? 80

34. భగవంతుని శక్తి తగ్గించకూడదు! 82

## అనుబంధం

### బ్రహ్మర్షి పత్రీ గారి...

1) పిరమిడ్ ఫిలాసఫీ - పిరమిడ్ జ్ఞానవరత్నాలు 87

2) యోగివేమన 111

3) వీరబ్రహ్మేంద్రస్వామి 125

4) నానాటి బ్రతుకు నాటకము 157

5) సంకల్పశక్తి 167

# "భగవంతుని గురించి తెలుసుకోండి!"

1. సర్వాంతర్యామి :- సకల చరాచర సృష్టి అంతా వ్యాపించి వున్నవాడు.
2. నిరాకారుడు :- ఆకారం లేని వాడు.
3. నామరహితుడు :- పేరులేని వాడు
4. రూప రహితుడు :- రూపం లేనివాడు.
5. దర్శించనలవికానివాడు :- భౌతికమైన కళ్ళతో చూడలేనివాడు.
6. నిర్గుణుడు :- గుణములు లేనివాడు.
7. అవినాశి : నాశనం లేనివాడు
8. అనంతుడు :- ఆది అంతములు లేనివాడు.
9. సచ్చిదానంద స్వరూపుడు : ఎల్లప్పుడూ ఆనందంలో ఉండేవాడు.
10. రాగద్వేషాలు లేనివాడు : అనురాగం, ద్వేషం లేనివాడు, శత్రుమిత్రులు లేనివాడు.
11. సృష్టికర్త : సకల చరాచర సృష్టిని సృష్టించినవాడు.
12. జగన్నాటక సూత్రధారుడు :- ఈ జగత్తనే నాటకానికి సూత్రధారుడు.
13. నిశ్చలుడు :- నిశ్చలంగా ప్రకాశిస్తున్నవాడు.
14. సాక్షీభూతుడు : అన్నిటికి సాక్షియైనవాడు.
15. పరిపూర్ణుడు : పరిపూర్ణంగా నిండియున్నవాడు.
16. నిర్మలుడు :- నిర్మలమైనవాడు, మలినం లేనివాడు.
17. కాలాతీతుడు : కాలానికి అతీతుడు
18. అఖండుడు :- ఖండంగా లేక అఖండంగా ఉన్నవాడు... ఒక్కటిగా ఉన్నవాడు.
19. శాశ్వతుడు - చావు పుట్టుకలు లేనివాడు.
20. నిత్యుడు :- నశింపు లేనివాడు.
21. సత్యమైనవాడు :- మార్పు చెందనివాడు.
22. అక్షర స్వరూపుడు - నాశనం లేనివాడు.
23. స్వయం ప్రకాశ మానుడు :- ఒకరివల్ల ప్రకాశించేవాడు కాదు. స్వయముగా ప్రకాశించేవాడు.
24. పరబ్రహ్మ - అందరికీ తండ్రి అయినవాడు.
25. అప్రమేయుడు - ఏ ఉపమానాల ద్వారా తెలపటానికి వీలు లేనివాడు.

26. పరాత్పరుడు – పరం కంటే పరంగా వున్నవాడు.
27. తురీయాతీతుడు – తురీయం కంటే అతీతంగా ఉన్నవాడు.
28. అవ్యయుడు – లింగ, వచన, విభక్తులు లేనివాడు.
29. విదేహుడు :– దేహం లేనివాడు, చేతులు, పాదాలు లేనివాడు, వస్త్ర భూషణములు లేనివాడు.
30. ఇచ్ఛలేనివాడు :– కోరికలు లేనివాడు.
31. క్రియాహీనుడు :– కర్మలు చేయనివాడు
32. ఉపాధి హీనుడు – ఉపచారాలు లేనివాడు
33. నిష్క్రియుడు :– కర్మలు చేయని వాడు
34. వర్ణహీనుడు :– కులగోత్రాలు లేనివాడు.
35. అపరిమితుడు:– పరిమాణము లేనివాడు.
36. సర్వవ్యాపి :– ఒక్కచోట వుండేవాడు కాదు; స్థానవిశేషం లేనివాడు.
37. శ్రవణ హీనుడు :– చెవులు లేనివాడు, నేత్రాలు లేనివాడు, గోత్రం లేనివాడు.
38. అకల్పితుడు : ఆకారం కల్పించలేరు, సృష్టించలేరు.
39. స్వయంభువు : ప్రాణప్రతిష్ఠ చేయలేరు.
40. అణువణువు వ్యాపించి ఉన్నవాడు :– ఆవాహన, విసర్జనలు చెయ్యలేరు.
41. స్వయంసిద్ధుడు :– బాల్య, యవ్వన, వార్ధక్యాలతో సంబంధం లేనివాడు.
42. అద్వైతుడు : ద్వైతం కానివాడు, రెండుగా లేనివాడు ఒక్కటై వున్నవాడు.
43. అభోక్త : భోగిస్తూ వున్నా, భోగించని వాడు.
44. సకలచరాచర రూపుడు : ఏ పక్షమూ వహించనివాడు, అన్నిటా, అంతటా వ్యాపించి వున్నవాడు.
45. పరమాత్మ : అందరికంటే గొప్పవాడు.

# విగ్రహం భగవంతుడా?

అనాదిగా అంటే ఎన్నో తరాల నుండి భగవంతుని గురించి సరైన అవగాహన లేక, భగవంతునికి రూపం ఆపాదించి, రూపం కల్పించి రూపాన్నే పూజిస్తూ, ఆరాధిస్తూ, విగ్రహమే భగవంతుడన్నట్టుగా భ్రమిస్తూ అమూల్యమైన మానవ జన్మను, సమయాన్ని, శక్తిని వ్యర్థ పరచుకుంటున్నాం. అంతే కాదు కోరుకున్నవి కూడా పొందలేకపోతున్నాం.

కోరికలు నెరవేరకపోతే, నిరాశ చెంది, కోపగించి చివరకు ఆ భగవంతుడినే మారుస్తున్నాం. మతాలు మారుస్తున్నాం. భగవంతుని మీద నిందలు వేస్తున్నాం. మా భగవంతుడు, మీ భగవంతుడు అని కలహించుకుంటున్నాం. మా మతం, మీ మతం అని ద్వేషించుకుంటున్నాం. చివరకు అనేక రకాలుగా దుఃఖితులవుతున్నాం.

అంతేకానీ భగవంతుని నిజతత్వాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నించడం లేదు. "ఆయన గురించి తెలుసుకోకుండా, ఆయన తత్వాన్ని అర్థం చేసుకోకుండా ఆరాధిస్తే ఫలితం శూన్యం" అని గ్రహించలేకపోతున్నాం. ఆయన నిజతత్వాన్ని, నిజ స్థితిని తెలుసుకుని ఆరాధించినపుడే మనం ధన్యులవుతాం. అవగాహన కోసం భగవంతునిగా భావించే విగ్రహానికి, భగవంతునికి తేడా ఏమిటో తెలుసుకుందాం.

| భగవంతుడు | విగ్రహము |
|---|---|
| 1. సర్వాంతర్యామి :- సకల చరాచర సృష్టి అంతా వ్యాపించి ఉన్నవాడు. | 1. ఒక్కచోట మాత్రమే ఉండేది. |
| 2. నిరాకారుడు :- ఆకారము లేనివాడు | 2. ఆకారం ఉన్నది. |
| 3. నిర్గుణుడు :- గుణములు లేనివాడు | 3. నలుపు, తెలుపులాంటి గుణములు కలది. |
| 4. నామరహితుడు :- పేరు లేనివాడు. | 4. పేరు ఉన్నది. |
| 5. రూపరహితుడు :- రూపము లేనివాడు. | 5. రూపం ఉన్నది. |
| 6. విదేహుడు :- దేహము లేనివాడు. | 6. దేహము, చేతులు, పాదములు ఉన్నది. |

| భగవంతుడు | విగ్రహము |
|---|---|
| 7. అపరిమితుడు :- పరిమాణము లేనివాడు. | 7. పరిమాణము ఉన్నది. |
| 8. శ్రవణ హీనుడు :- చెవులు, నేత్రములు లేనివాడు. | 8. చెవులు, నేత్రములు ఉన్నది. |
| 9. అకల్పితుడు : కల్పించ లేనివాడు. | 9. కల్పించినది. |
| 10. స్వయం సంసిద్ధుడు :- ఆకారము సృష్టించలేనివాడు. | 10. ఆకారము సృష్టించగలిగినది. |
| 11. అభోక్త :- భోగములు కోరనివాడు. | 11. భోగములు పొందుతున్నది. |
| 12. అవినాశి :- నాశనము లేనివాడు. | 12. నాశనము కలది. |
| 13. అనంతుడు :- ఆది అంతములు లేనివాడు. | 13. ఆది అంతములు గలది. |
| 14. తేజోవంతుడు : కోటి సూర్యుల కాంతిగలవాడు. | 14. కాంతి లేనిది. |
| 15. శాశ్వతుడు:- చావు, పుట్టుక లేనివాడు. | 15. సృష్టింపబడినది, నశింపు ఉన్నది. |
| 16. పరిపూర్ణుడు :- పరిపూర్ణముగా నిండియున్నవాడు. | 16. పరిమితమైనది. |
| 17. సత్యమైనవాడు :- మార్పు చెందని వాడు. | 17. మార్పు చెందేది. |
| 18. అనంత శక్తిస్వరూపుడు :- శక్తి వూహించలేం. | 18. శక్తి లేనిది. |
| 19. దర్శింపనలవి కానివాడు:- భౌతిక కళ్ళతో చూడలేము | 19. చూడగలము. |

గమనిస్తే భగవంతుని లక్షణం ఒక్కటి కూడా విగ్రహానికి లేదు. అందుచేత విగ్రహం భగవంతుడు కాదని తెలుసుకోవాలి. విగ్రహం భగవంతుడు కానపుడు విగ్రహాన్ని ఆరాధిస్తే భగవంతుని ఆరాధించినట్టు ఎలా అవుతుంది? భగవంతుని

ఆరాధించనపుడు ఆయన అనుగ్రహం ఎలా లభిస్తుంది? కష్టాలు తీరుతాయా? కోరికలు నెరవేరుతాయా? చివరకు నిరాశే మిగులుతుంది. నిరాశతో విగ్రహాలను, ఫోటోలను మార్చినా, మతాలు మార్చినా ప్రయోజనం ఉండదు. మరి భగవంతుని ఆరాధించాలంటే ఏం చెయ్యాలి? ఏం చేస్తే భగవంతుని ఆరాధించినట్లవుతుంది?

భగవంతుడు భూమి మీద ప్రతి జీవిలోనూ, మానవునిలోను ఆత్మ స్వరూపంలో వున్నాడు. ఎవరైతే ఆత్మను ఆరాధిస్తారో, ఆత్మ మీద దృష్టి వుంచుతారో, వారే భగవంతుని ఆరాధించినట్టు. మరి అంతరంలో వున్న ఆత్మను ఆరాధించాలంటే అంతర్ముఖులు కావాలి. దానికి ఒక్కటే మార్గం అదే బ్రహ్మర్షి పత్రీగారు బోధించే "శ్వాస మీద ధ్యాస ధ్యానం". అందుచేత ధ్యానం చేస్తేనే భగవంతుని ఆరాధించినవారమవుతాం. భగవంతుని అనుగ్రహం పొందుతాం. జీవితాన్ని ధన్యం చేసుకుంటాం.

# "నిజమైన ఆరాధన"

ఆత్మ ఆరాధనే నిజమైన భగవదారాధనని "శ్రీమద్ భాగవతం"లో తెలుపబడిన విషయాన్ని "గీతాదర్శనం" అనే పుస్తకం ద్వారా శ్రీ రామకృష్ణ మఠం వారు తెలియచేశారు. సత్యాన్ని గ్రహించండి.

ooo

"నేను అన్ని జీవుల లోనూ సదా ఆత్మరూపంలో అవస్థితుడై ఉన్నాను. అలాంటి నన్ను విస్మరించి మర్త్యులు (మానవులు) నా ప్రతిమలకు అర్చనలు చేయ పూనుకుంటారు"

ooo

"సర్వ జీవులలోనూ, ఆత్మ రూపంలో, ఈశ్వరుడిగా ఉన్న నా ఉనికిని గుర్తెరగక ఎవరు నన్ను ప్రతిమల ద్వారా పూజిస్తారో అలాంటివారి అర్చన బూడిదలో పోసిన యజ్ఞ ద్రవ్యాల లాగ నిష్ప్రయోజనం"

ooo

"ఎవరు దురభిమానంతో భిన్నదర్శనులై ఇతర శరీరాలలో అంతర్యామిగా ఉన్న నన్ను ద్వేషిస్తారో జీవుల పట్ల అట్టి బద్ధవైరులు, మనశ్శాంతిని పొందజాలరు"

ooo

"తోటి జీవులను అవమానిస్తూ, విలువైన, డాంబికమైన ద్రవ్యాలతో నా ప్రతిమలను పూజించితే అలాంటి పూజలతో నేను సంతృప్తి చెందను"

ooo

"తన హృదయంలోనూ, ఇతర జీవులలోనూ ఉన్న నా ఉనికిని గ్రహించనంతవరకే స్వధర్మపరులు నన్ను ప్రతిమలలో అర్చిస్తారు.

ooo

"ఎవరైతే స్వార్థపూరిత స్వపర భేదాన్ని ప్రదర్శిస్తారో, అలాంటివారు మృత్యుభయానికి లోనౌతారు."

ooo

"సమస్త జీవుల శరీరాలను నేను ఆలయంగా చేసుకొన్నానని తెలుసుకొని, వాటిని సమదృష్టితోను మైత్రీభావంతోను, కానుకలను, గౌరవాన్ని ఇచ్చి అర్చించాలి."

**శ్రీమద్ భాగవతం (29.21-27)**

# "విగ్రహారాధన కాదు - నిగ్రహారాధన చెయ్యాలి!"

భారతదేశంలో విగ్రహారాధన విశేష ప్రాచుర్యంలో వుంది. తరతరాల నుంచి భగవంతుని  ఆరాధించే మార్గం ఇదేనని చాలా మంది భావిస్తున్నారు. భగవంతునికి రూపం లేదంటూ రూపాన్నే ఆరాధిస్తారు. విగ్రహారాధన చేసే వారిని ఎవరైనా భగవంతునికి రూపం లేనపుడు, రూపం భగవంతుడు ఎలా అవుతాడు? రూపం భగవంతుడు కానపుడు రూపాన్ని ఆరాధిస్తే భగవంతుని ఆరాధించినట్టు ఎలా అవుతుంది? కనబడే వాడు భగవంతుడెలా అవుతాడు? అని ప్రశ్నిస్తే సరైన సమాధానం రాదు.

ఆలోచిస్తే విగ్రహారాధన తరతరాల నుంచి ఆచారంగా వస్తుందని ఆరాధిస్తున్నారు. అంతే కానీ, దాని వల్ల ఫలితమేమైనా వుందా?  విగ్రహాన్ని ఆరాధిస్తే భగవంతుని ఆరాధించినట్లవుతుందా? అని ఎవరూ ఆలోచించడం లేదు. విగ్రహం భగవంతుడయితే భగవంతుని దర్శించిన వారు, అంటే విగ్రహం దగ్గరకు వెళ్ళిన వారు తిరిగి ఇంటికి ఎందుకు వస్తున్నారు? ఎవరైనా భగవంతుని దర్శించాక ఆయనను విడువగలరా? ఆయన్ను వదలి రాగలరా? ఆయన్ను వదిలి వచ్చేవారు ఆయన భక్తుడు ఎలా అవుతారు? విగ్రహాన్ని వదిలి వస్తున్నారంటే విగ్రహం భగవంతుడు కాదని భావించడం వల్లే కదా?

విగ్రహాన్ని మనమే కదా తయారు చేసాం. అసలు భగవంతుడ్ని తయారు చెయ్యగలమా? భగవంతుడ్ని తయారు చేసే శక్తి మనకు వుందా? భగవంతుడ్ని తయారు చేయగలిగినపుడు, మనమే ఎంతో గొప్పవారం కదా? భగవంతుడ్నే తయారు చేసే శక్తి ఉన్నప్పుడు మన కోరికలు ఎందుకు తీర్చుకోలేక పోతున్నాం? మన కష్టాలు ఎందుకు తొలగించుకోలేక పోతున్నాం?  మనం తయారు చేసిన విగ్రహాన్నే ఎందుకు ప్రార్థిస్తున్నాం?

భగవంతుడు అకల్పితుడు కదా? మరి కల్పించిన వాడు భగవంతుడు ఎలా అవుతాడు? భగవంతుడు కాని దాన్ని ఆరాధిస్తే భగవంతుడ్ని ఆరాధించినట్లు ఎలా అవుతుంది? ఇలా విగ్రహారాధన చేసే వారిని ఎవరైనా ప్రశ్నిస్తే వారేమంటారంటే, నువ్వు చెప్పింది నిజమే కానీ విగ్రహారాధనకి కారణం వుంది. విగ్రహం భగవంతుడు కాదు కానీ, "విగ్రహం నిగ్రహం కోసం" తప్ప మరేమీ కాదు అంటూ సమాధానం చెపుతారు.

అలా "విగ్రహం, నిగ్రహం కోసమే" అన్నవారిని నిగ్రహం అంటే ఏమిటి? విగ్రహం వల్ల మనకు ప్రయోజనమేమిటి? అని అడిగితే సరైన సమాధానం చెప్పలేరు. కానీ ఇదే విషయాన్ని ఒక సందర్భంలో "బ్రహ్మర్షి పత్రి"గారిని వివరణ కోరినప్పుడు ఆయన "నిగ్రహానికి" చక్కటి వివరణ ఇవ్వడం జరిగింది.

గ్రహం అంటే గ్రహించడం.

నిగ్రహం అంటే గ్రహించకుండా వుండటం అని చెపుతూ మనం అన్ని విషయాలు మనస్సుతో గ్రహిస్తూ వుంటాం. అలాగే మనస్సుతో ఏమీ గ్రహించకుండా వుంటే అదే "నిగ్రహం" అని వివరించడం జరిగింది అంతే కాదు నిగ్రహం రావాలంటే విగ్రహాన్ని ఆరాధిస్తే రాదు. "శ్వాసమీద ధ్యాస" ఉంచితే వస్తుంది. "శ్వాసమీద ధ్యాస ఉంచి ధ్యానం" చెయ్యడమే నిగ్రహం అని అందరి సంశయాన్ని నివృత్తి చేశారు.

అలాంటి ధ్యానం ద్వారానే సమస్త దుఃఖాలు శాశ్వతంగా దూరమవుతాయి. అంతే కానీ విగ్రహారాధన వల్ల కాదు అని పత్రిగారు వివరించారు. ఇదే విషయాన్ని 18 ఆదర్శ సూత్రాల్లో కూడా పిరమిడ్ మాష్టర్లకు తెలియచెయ్యడం జరిగింది.

# "శ్రీ మద్భగవద్గీతలో భగవానుడు తనను గూర్చి చెప్పిన సందేశం!"

భగవంతుడు ఎవరు? ఎలా వుంటాడు? ఆయనను ఎలా ఆరాధించాలి? ఏ ఆరాధన చేస్తే భగవంతుని ఆరాధించినట్లవుతుంది? సగుణోపాసన చెయ్యాలా? నిర్గుణోపాసన చెయ్యాలా?

పూర్వం నుంచి ఆచారంగా వస్తున్న సగుణోపాసనే సరైన మార్గమని ఎక్కువమంది భావిస్తూంటారు. సగుణోపాసన అంటే విగ్రహారాధన. విగ్రహారాధన చెయ్యకపోతే భగవంతునికి కోపం వస్తుందని భయపడేవారు ఎంతో మంది వున్నారు.

మరి భగవంతుడు నిజంగా కోపిస్తాడా? విగ్రహారాధన చేసే వారి గురించి భగవంతుని భావం తెలుసుకోవటానికి గీతలోని 9వ అధ్యాయం, 11వ శ్లోకంలో భగవంతుని సందేశాన్ని "జ్ఞానేశ్వరి భగవద్గీతలో" శ్రీ జ్ఞానేశ్వర్ గారు ఇచ్చిన వివరణ మన సందేహాలు, భయాలు పూర్తిగా తొలగిస్తాయి. ఆ శ్లోకం ద్వారా శ్రీ కృష్ణ భగవానుని సందేశం తెలుసు కుందాం.

శ్లో॥ అవజానన్తి మాం మూఢా మానుషీం తను మాశ్రితమ్।
పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥ (9-11)

తా॥ సర్వభూతములను నియమించు నట్టిదియును సర్వోత్తమ మైనదియు అయిన నా తత్వమును తెలియని మూఢులు నన్ను మనుష్య సంబంధమైన దేహమును మాత్రము ధరించిన వానినిగా తలచి నన్ను అవమానించుచున్నారు.

శ్రీ జ్ఞానేశ్వర్ గారి వివరణ : "అర్జునా నీకు వాస్తవముగా నా యెడ నిజమగు అనురాగము కలిగినచో, నీవీ తత్త్వ విచారణను చక్కగాను, ప్రయత్న పూర్వకముగను జ్ఞప్తియందుంచుకొనవలెను.

కామెర్ల వ్యాధి వచ్చిన వానికి స్వచ్ఛమగు వెన్నెల కూడ పసుపు వన్నెగా కనుపించు రీతిని, నా నిర్మల రూపము కూడా దోషవంతముగా కనిపించును. లేదా జ్వరము వలన నోటి రుచి మారినవానికి పాలు కూడా చేదుగా నుండు రీతిని, నేను మనుష్యుడుగా నుండకున్నను మానవులు నన్ను మనుష్యునిగానే భావించుచున్నారు. కావున ఓ అర్జునా, యీ రహస్య జ్ఞానమును మరువబోకుమని నీకు మాటి మాటికి చెప్పుచున్నాను.

ఈ రహస్య జ్ఞానము లేని స్థూల దృష్టి నిష్ప్రయోజనం. స్థూల దృష్టితో చూడటమంటే నన్ను చూడటం కాదు. ఏలనన స్వప్నమున ఎవడైనా అమృతము

త్రాగునో, అతడెన్నటికిని అమరుడు కాజాలడు. సాధారణంగా ప్రజలు నన్ను బాహ్య దృష్టితోనే చూస్తారు. మరియు బాహ్య రూపమున మాత్రమే నన్ను ఎరుగుదురు; కాని నీటి యందు పడిన నక్షత్ర ప్రతిబింబమును రత్నముగా భావించి దానిని గైకొనవలెనను తలంపుతో మోసపోయి నాశనము నొందు హంసవలె యీ బాహ్య జ్ఞానము వల్ల యదార్థజ్ఞానమును పొందలేకున్నారు.

ఎండమావిని గంగగా తలచి దానివద్దకు పోయినందువలన మనకేమి లాభించగలదు? కలువ మొక్కను కల్పవృక్షముగా భావించి చేతిలో పెట్టుకొంటే లాభమేమిటి? కాలసర్పమును రెండు పేటలు గల నీలమణిహారముగా భావించి చేత పెట్టుకొనిన, లేదా తెల్లరాతినే రత్నముగ భావించి ఏరుకొనిన, లేదా మండుచున్న చంద్రకట్టెల నిప్పు రవ్వలను గుప్త భండారము లభించినదని జోలెలో వేసికొనిన, లేదా సింహము నూతియందు తన నీడను చూచి, ఆ నీడను మరొక సింహముగా భావించి దూకిన దాని పరిణామమేమగును?

ఇదే విధముగా, పరమాత్ముడనగు నేను నిజముగ సాకారుడనై ప్రపంచమున అవతరించు దునని ధృఢ నిశ్చయము గలవారై, యీ సంసారిక ప్రపంచమున లీనమయినవారు, నీటి యందు పడెడి ప్రతిబింబమునే చంద్రునిగా భావించి దానిని గైకొనిన వారిగా భావించవచ్చు. భ్రమతో కూడి యున్న యిట్టి బుద్ధి, నిర్ణయము కేవలము వ్యర్థమైనదే. **గంజిని త్రాగి దాని నుంచి అమృత గుణమును ఆశించినట్లే యీ నశ్వరమగు నామరూపాత్మక స్థూలరూపమును మనస్సు నందు పూర్తిగా విశ్వసించి, దానియందే నా శాశ్వత రూపమును చూచుట కూడా వ్యర్థ వైనదేనని తెలిసికొనుము. ఈ విధమైన ప్రయత్నము వలన నేనెటుల కనిపించెదను?**

తూర్పు దిక్కుకు పోయెడి మార్గమున పోయి ఎవడైనా పడమటి దిక్కున గల సముద్రపు ఆవలి ఒడ్డును చేరగలడా? లేదా, **ఓ అర్జునా, పొల్లును యెంత దంచినప్పటికీ దాని నుండి బియ్యపు గింజ లభించగలదా? ఇదే రీతిని, కేవలము వికారముచే ఏర్పడిన యీ స్థూల జగదాకారమును తెలిసికొనినంత మాత్రమున నా కేవల నిరాకార, నిర్గుణ స్వరూపమును తెలిసికొననగునా?**

ఫేనమును త్రాగుటచే నీటిని త్రాగినందువలన కలిగెడి ఫలితము కలుగునా? ఇదే విధంగా మానవులు తమ మనస్సునందు మోహము జనించుటచే,

భ్రమ నొందినవారై యీ జగత్తే పరమాత్మనగు నేనుగా భావించెదరు. ఇట్టి స్థితిలో, యిచ్చట కలిగెడి జనన మరణములాదిగా గల కర్మలు నాకు కూడా కలుగునని విశ్వసిస్తారు. ఈ రీతిగా నామ రహితుడనగు నాకు నామమును, క్రియా హీనుడనగు నాకు కర్మను, మరియు విదేహుడనగు నాపై దేహ ధర్మమును ఆరోపించుచున్నారు.

నేను నిరాకారుడైనప్పటికీ కర్మలు చేయుచున్నానని, వర్ణ హీనుడైనప్పటికినీ వర్ణము గలదని, నిర్గుణుడనైనప్పటికీ గుణవంతుడనని, చేతులు, పాదములు లేనప్పటికినీ చేతులు, పాదములు మొదలైనవి గలవని, అపరిమితుడనైనప్పటికినీ పరిమాణము గలదనీ, మరియు సర్వవ్యాపినైనప్పటికినీ స్థాన విశేషము గలదని ఆరోపణ చేస్తున్నారు.

నిద్రయందున్న మనుష్యుడు స్వప్నమున తన శయ్యపైననె అరణ్యమును చూచు రీతిని అట్టివారు శ్రవణ హీనుడనగు నాకు శ్రవణములు గలవని భావిస్తారు. **నాకు నేత్రములు, గోత్రము, రూపము, ఆకారము, ఇచ్ఛ, తృప్తి, వస్త్రము, భూషణములు మరియు కారణము మొదలగునవి ఏవీ లేనప్పటికినీ, యివన్నీ నాకు గలవని భావిస్తారు.** నేను స్వయం సంసిద్ధుడనయినప్పటికీ వారు నా విగ్రహములను నిర్మిస్తారు. నేను స్వయంభువు నయినప్పటికీ నాకు ప్రాణప్రతిష్ఠ చేస్తారు.

**నేను ఎల్లప్పుడూ అంతటా అఖండ రూపముగా వ్యాపించి ఉన్నప్పటికీ, వారు ఆ వాహన, విసర్జనలు చేస్తారు.** నేను ఎల్లప్పుడు స్వయం సిద్ధుడనై ఉన్నప్పటికీ వారు తమ బుద్ధిచే నా అవికృత ఏక రూపమునకు బాల్య, యౌవన, వార్ధక్యములతో సంబంధమును కలుగ చేయుదురు. నేను ద్వైతహీనుడనైనప్పటికీ నా యందు వారు ద్వైత భావమును ఆరోపించెదరు. నేను నిష్క్రియుడనై ఉన్నప్పటికీ, నాపై క్రియారోపణ చేయుదురు; మరియు **నేను అభోక్తనైనప్పటికీ, నేను భోగములను అనుభవించుచుందునని వారు భావించెదరు.** నాకు ఏ కులగోత్రములును లేకున్నప్పటికీ వారు నా కులమును గురించి వర్ణింతురు. నేను అవినాశినైనప్పటికీ నా మృత్యుకల్పన మొనర్చి వారు దుఃఖించెదరు.

నేను అందరియందు నిండియున్నప్పటికీ  నా గురించి శత్రుమిత్రాది భావములు గల వాడనని తలంచెదరు. నేను ఆత్మానందమునకు ప్రత్యక్ష నిలయమైనప్పటికీ, వారు నేను వివిధ సుఖములను వాంఛించుచుందునని భావిస్తారు; నేను అంతటను వ్యాపించి ఉన్నప్పటికీ, వారు నన్ను ఏకదేశీయునిగా చెపుతారు. అంతేకాదు,  నేను ఫలానా చోట ఉంటానని కూడా అంగీకరిస్తారు. నేను సమస్త చరాచరములకు,  ఆత్మనైనప్పటికీ నేను ఒక పక్షము వహించి రెండవ పక్షము వారిని కోపించి చంపుతానని, వారు నా గురించి భావిస్తారు.

**మానవ ధర్మాలన్నింటిని వారు నాకు గలవని ఆరోపిస్తారు.**

ఈ విధమైన వారి జ్ఞాన స్వరూపము పూర్తిగా సత్యదూరమై ఉన్నది. వారు తమ ముందున్న ఏదైన విగ్రహాన్ని చూస్తూ దానిని దేవత అంటారు. ఆ విగ్రహము విరిగిపోయినచో యిది దేవత కాదని ఆవల పారవేస్తారు. **వారు నేను సాకార మనుష్యుడనని పెక్కు తీరు తలుస్తారు. వీరి యీ విపరీత జ్ఞానమే సత్యమగు జ్ఞానమును అంధకారమందుంచుచున్నది. మరియు సత్యమైన జ్ఞానము వారి దృష్టికి రావటం లేదు.**

అందుచేత భగవంతుని నిజతత్వము తెలుసుకోవాలి. భూమి మీద భగవంతుని గుర్తించ గలిగే ఏకైక మార్గం, అందరిలో ఉన్న ఆత్మ. ఆత్మను ఆరాధిస్తే భగవంతుని ఆరాధించినట్లే. ఆత్మను దర్శిస్తే భగవంతుని దర్శించినట్లే. ఆత్మను ఆరాధించాలంటే ఉన్న ఒక్కగానొక్క మార్గం "ఆనాపానసతి" ధ్యానం. ఈ ధ్యానం చెయ్యడమంటేనే భగవంతుని ఆరాధించడం. అందుచేత అందరూ ధ్యానం చేసి, భగవంతుని ఆరాధించి తరిద్దాం.

| మానవుడు చేసేది! | భగవంతుడు చూసేది! |
| --- | --- |
| 1. మానవుడు విగ్రహం, ఫోటోయే భగవంతుడని అక్కడే పవిత్రంగా ఉంటాడు. అక్కడే కోరికలు చెప్పకుంటాడు. | 1. మానవుడు అన్ని చోట్లా పవిత్రంగా వున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 2. మానవుడు అన్నీ కావాలని కోరుకుంటాడు. | 2. ఇచ్చింది లోకానికి పంచుతున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 3. మానవుడు తాత్కాలికమైనవి, అశాశ్వతమైనవి ఆశించి ఆరాధిస్తాడు. | 3. భగవంతుడు శాశ్వతమైనది సంపాదించు కోమంటాడు. |
| 4. మానవుడు అందరినీ ద్వేషిస్తాడు. | 4. అందరినీ ప్రేమిస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 5. మానవుడు ఇతరులకు కీడు చేస్తాడు. | 5. ఇతరులకు మేలు చేస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 6. మానవుడు పాపాలు చేస్తాడు. అంటే అందరికీ కష్టం, నష్టం కలిగిస్తాడు. | 6. అందరికీ మంచి చేస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 7. మానవుడు తన పాపకర్మలు, కష్టాలు తొలగించమని ప్రార్థిస్తాడు. | 7. స్వయం ధ్యాన సాధన ద్వారా మానవులు తమ పాప కర్మలు, కష్టాలు తొలగించుకోవాలని భగవంతుడు చూస్తాడు. |
| 8. మానవుడు ఆశిస్తాడు. | 8. కృషి చేస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 9. మానవుడు కోరుకుంటాడు. | 9. కోరుకోకపోయినా పనిచేస్తే చాలు ఫలితం ఇద్దామని భగవంతుడు చూస్తాడు. |
| 10. మానవుడు అర్థిస్తాడు. | 10. భగవంతుడు సాధించుకోవాలని చూస్తాడు. |

| మానవుడు చేసేది! | భగవంతుడు చూసేది! |
| --- | --- |
| 11. మానవుడు వేడుకుంటాడు | 11.కష్టపడాలని భగవంతుడు చూస్తాడు. |
| 12. మానవుడు కానుకలు ఇస్తాడు. | 12. ప్రేమ, సత్యం, ధర్మం పాటిస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 13. మానవుడు ఉద్ధరించమంటాడు. | 13. ఉద్ధరించుకోవాలని భగవంతుడు చూస్తాడు. |
| 14.మానవుడు పూజ చేస్తాడు. | 14. మంచి పనులు చేస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 15.మానవుడు భజనలు చేస్తాడు. | 15. లోకానికి సేవ చేస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 16.మానవుడు స్తోత్రాలు చదువుతాడు. | 16. గుణాలు ఎలా వున్నాయని భగవంతుడు చూస్తాడు. |
| 17.మానవుడు నామ జపం చేస్తాడు. | 17. పవిత్రంగా జీవిస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 18.మానవుడు మడి, ఆచారమంటూ దేహాన్ని, బట్టల్ని శుభ్రం చేస్తాడు. | 18. మనస్సులోని మలిన గుణాల్ని శుభ్రం చేసుకున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 19.మానవుడు తల బోడి (గుండు) చేస్తాడు. | 19. చెడు తలపులు బోడి చేశాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 20.మానవుడు పనులకు ప్రాముఖ్యం ఇస్తాడు. | 20. ఆ పనులు చెయ్యటానికి వాడి భావమేమిటి? అని భగవంతుడు చూస్తాడు. |
| 21.మానవుడు దేహాన్ని సౌందర్యం గా చేసుకుని ఆలయానికి వెళ్తాడు. | 21. భావం సౌందర్యంగా వుందా? అని భగవంతుడు చూస్తాడు. |
| 22.మానవుడు బాహ్యశుద్ధికి ప్రాముఖ్యం ఇస్తాడు. | 22. అంతరం శుద్ధిగా వుందా? అని భగవంతుడు చూస్తాడు. |
| 23.మానవుడు రూపాన్ని సరిచేసుకుంటాడు. | 23. గుణాలు సరిచేసుకున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |
| 24.మానవుడు అందరినీ వేరు వేరుగా చూస్తాడు. | 24. అందరినీ ఒక్కటిగా చూస్తున్నాడా? అని భగవంతుడు చూస్తాడు. |

# “భగవంతుని అవగాహన చేసుకోవాలి!”

లోకంలో రెండు రకాల వారు వున్నారు. భగవంతుని అవగాహన చేసుకున్న ‘యోగులు’. భగవంతుడంటే అవగాహన లేని ‘భోగులు’. భగవంతుని పట్ల ఎవరి ప్రవర్తన ఎలా వుంటుందో చూద్దాం.

| భగవంతుడంటే | అవగాహన లేనివాడు | అవగాహన చేసుకున్నవాడు |
|---|---|---|
| 1. భగవంతుడు నిరాకారుడు. (ఆకారము లేనివాడు) | 1. ఆకారము లేని భగవంతుడ్ని ఆరాధించడానికి అవకాశం లేదు కాబట్టి ఏదో ఒక రూపాన్ని ఆరాధిస్తాడు. | 1. నిరాకార భగవంతుడు, ఆత్మ స్వరూపుడై తనలోనే వున్నాడు కాబట్టి, ధ్యానం ద్వారా ఆత్మ మీద దృష్టి వుంచి ఆరాధిస్తాడు. |
| 2. నామరహితుడు (ఏ పేరూ లేనివాడు) | 2. పేరులేని భగవంతునికి ఏదో పేరు పెట్టి పూజిస్తూ, ప్రార్థిస్తూ, జపిస్తూ, భగవంతుని ఆరాధిస్తున్నానని అనుకుంటాడు. | 2. పేరులేని భగవత్ స్వరూపమైన ఆత్మ మీద ధ్యానం ద్వారా దృష్టి వుంచి సరైన ఆరాధన చేస్తాడు. |
| 3. సర్వాంతర్యామి (సర్వత్రా, సర్వులలో అంటే మానవులలో, సమస్త జీవులలో అంతర్యామిగా వున్నవాడు) | 3. భగవంతుడు ఆలయంలోనే వున్నాడనుకుని అక్కడ మాత్రమే పవిత్రంగా ఉంటాడు. | 3. భగవంతుడు అందరిలో, అన్ని జీవులలో వున్నాడన్న అవగాహనతో, అన్నిటినీ అందరినీ ప్రేమిస్తాడు. |
| 4. అనంత శక్తిస్వరూపుడు | 4. భగవంతుడ్ని ఆలయానికి, చర్చికి, మసీదుకు పరిమితం చేస్తాడు. | 4. భగవంతుని శక్తి అపారం అని తెలుసుకున్న వాడు కాబట్టి అన్ని చోట్లా పవిత్రంగా వుంటాడు. |

| భగవంతుడంటే | అవగాహన లేనివాడు | అవగాహన చేసుకున్నవాడు |
|---|---|---|
| 5. అఖండమైన తేజస్సు కలవాడు. | 5. దర్శించటానికి భౌతికమైన కళ్ళతో ప్రయత్నిస్తాడు. చూడలేడు. | 5. దర్శించటానికి ధ్యానం చేస్తాడు. అంతర్ నేత్రం అంటే దివ్య చక్షువుతో చూడగలుగుతాడు. |
| 6. రాగద్వేషాలు లేనివాడు. (అనురాగము, ద్వేషము లేనివాడు) | 6. భగవంతుని పూజించకపోయినా, ప్రార్థించక పోయినా, నమాజు చేయకపోయినా, భజన చేయకపోయినా కోపిస్తాడని భయపడతాడు. పూజకే ప్రాముఖ్యం ఇస్తాడు. భగవంతుడు మెచ్చే గుణాలకు ప్రాముఖ్యం ఇవ్వడు. | 6. భగవంతునికి రాగద్వేషాలు లేవు కాబట్టి పూజించిన వారిని ఒక రకంగాను, పూజించని వారిని మరో రకంగాను చూడడు అని అవగాహన చేసుకున్నవాడు కాబట్టి పూజ కంటే భగవంతుడు మెచ్చే గుణాలకు ప్రాముఖ్యం ఇస్తాడు. |
| 7. సచ్చిదానంద స్వరూపుడు (నిత్యం ఆనందంలో వుండేవాడు.) | 7. భగవంతుడు ఆనందస్వరూపుడు. తాను మానవుడు కాబట్టి దుఃఖం కలుగుతుందనుకుంటాడు. | 7. ఆ సచ్చిదానంద స్వరూపుడు తానే అన్న అవగాహనతో ధ్యానం చేస్తాడు. నిత్యం ఆనందంలో వుంటాడు. |

| | | |
|---|---|---|
| 8. దయామయుడు, కరుణా మయుడు, ప్రేమ స్వరూపుడు. | 8. భగవంతుడు దయామయుడు, కరుణామయుడు, ప్రేమ స్వరూపుడు కాబట్టి ఎన్ని పాపాలు చేసినా క్షమిస్తాడని పాపాలు చేస్తాడు. పాపాలు క్షమించమని పూజలు, ప్రార్థన, నమాజు చేస్తాడు. జీవహింస చేస్తాడు. మాంసభక్షణ చేస్తాడు. చేసిన పాపాలకు వచ్చే రోగాలతో, దుఃఖంతో జీవిస్తాడు. | 8. భగవంతుడు కరుణామయుడే కాదు. పాపాలు చేసేవారిపట్ల, ఇతర జీవులను హింసించే వారిపట్ల కఠినంగా వ్యవహరించడమే కాదు, శిక్షిస్తాడని అంటే "భగవం తుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ" చేస్తాడన్న అవగాహనతో పాపాలు చెయ్యడు, జీవహింస చెయ్యడు, మాంసభక్షణ చెయ్యడు. ఆనందం గా జీవిస్తాడు. |
| 9. నిర్గుణుడు (ఏ గుణములు లేనివాడు) | 9. భగవంతునికి గుణాలు వున్నాయనుకుంటాడు. ఆరాధిస్తే కోరికలు తీరుస్తాడనుకుంటాడు. పూజలు చేస్తాడు. కోరికలు కోరుతూ వుంటాడు. | 9. భగవంతుడు గుణాతీతుడన్న అవగాహనతో "చేయవల సింది చేస్తే పొందవలసింది పొందుతానని" ధ్యాన సాధన' చేయడానికే ప్రాముఖ్యం ఇస్తాడు. కోరికలు కోరడు. |
| 10. ఆత్మ స్వరూపుడు (అన్ని జీవులలో ఆత్మ రూపంలో ఉన్నవాడు) | 10. భగవంతుడు వేరే వున్నాడని భావించి ఇతరులు, ఇతర జీవులు వేరు వేరు అనుకుని ఇతరులను ద్వేషిస్తాడు, మోసగిస్తాడు, హింసిస్తాడు, అవమానిస్తాడు. | 10. అందరిలో, అన్ని జీవులలో వున్న ది ఆ భగవత్ స్వరూపమే అన్న అవగాహనతో ఎవరినీ ద్వేషించడు, మోసగించడు, అవమానించడు. హింసించడు. |

| భగవంతుడంటే | అవగాహన లేనివాడు | అవగాహన చేసుకున్నవాడు |
|---|---|---|
| 11. ఆది మధ్యాంత రహితుడు (ఆది అంతములు లేనివాడు) | 11. అవగాహన లేక విగ్రహాలను, ప్రతిమలను గుళ్ళకు, పూజా మందిరాలకు పరిమితం చేసి అక్కడ మాత్రమే ఆరాధిస్తాడు. | 11. సర్వత్రా ఆయన ఉనికే కాబట్టి అన్నిచోట్లా ధ్యానిస్తాడు. |
| 12. సర్వులకూ శక్తి ప్రదాత | 12. అవగాహన లేక ఏమి చేసినా, ఎందులో విజయం సాధించినా నేనే చేశాను, నేనే సాధించాను అని అహంతో విర్రవీగుతాడు. | 12. అంతా ఆయనే కాబట్టి గర్వం, అహం వుండదు. |
| 13. అన్నీ తానై వున్నవాడు. | 13. నాది, మాది అని, అన్నిటి మీద మమకారం పెంచుకుంటాడు. | 13. నాదీ లేదు, మాది లేదు అంతా ఆ పరబ్రహ్మం అని వేటి మీదా మమకారం పెంచుకోడు. |
| 14. నిశ్చలుడు. (చలించనివాడు) | 14. తాను వేరు భగవంతుడు వేరు అనుకోవడం వల్ల ఏది జరిగినా చలించిపోతాడు. | 14. "అహం బ్రహ్మాస్మి" అంటే తానే ఆ పరబ్రహ్మమని అవగాహన చేసుకున్న వాడు కాబట్టి ఏది జరిగినా భయపడడు, చలించడు. |
| 15. శాశ్వతమైనవాడు. (చావు పుట్టుకలు లేనివాడు) | 15. తాను వేరు అనుకోవటం వల్ల చనిపోతాననుకుని చావుకు భయపడతాడు. | 15. ఆత్మ తత్వాన్ని అవగాహన చేసుకున్న వాడు కాబట్టి తానే శాశ్వతమైన భగవంతుడు అన్న అవగాహనతో భయపడడు. |

| భగవంతుడంటే | అవగాహన లేనివాడు | అవగాహన చేసుకున్నవాడు |
| --- | --- | --- |
| 16. వర్ణించలేనివాడు. | 16. ఆయనను కీర్తించటానికి, స్తోత్రించటానికి ప్రయత్నిస్తాడు. | 16. ఆయనను ఎవరూ వర్ణించలేరు, కీర్తించలేరు కాబట్టి అవి మాని ఆయన అనుభూతి పొందటానికి ధ్యానం చేస్తాడు. |
| 17. దర్శించలేరు. | 17. ప్రత్యక్షంగా దర్శించటానికి ప్రయత్నిస్తాడు. ఆరాటపడతాడు. ఎన్ని జన్మలెత్తినా విఫలుడవుతాడు. | 17. ఆకారము లేని వానిని దర్శించలేరు కాబట్టి అనుభూతి పొందటానికి ధ్యానం చేస్తాడు. |
| 18. అతీతుడు | 18. భగవంతుడంటే తెలుసునన్నట్లుగా ప్రవర్తిస్తాడు. | 18. ఆయనను తెలుసుకోవడం సాధ్యం కాదు కాబట్టి ధ్యానసాధన చేస్తాడే తప్ప ఏమీ ఆలోచించడు. |
| 19. సర్వవ్యాపి (సర్వ జీవులలో వ్యాపించి వున్నవాడు) | 19. అవగాహన లేదు కాబట్టి ఇతరుల కాళ్లకు మ్రొక్కుతాడు. | 19. తనతో పాటు అందరూ ఆయన స్వరూపాలే కాబట్టి ఎవరి కాళ్లకూ మ్రొక్కడు. |
| 20. జగన్నాటక సూత్రధారుడు. (ఈ ప్రపంచమనే నాటకాన్ని నడిపిస్తున్నవాడు) | 20. అవగాహన లేదు కాబట్టి తాను ఈ జగత్తనే నాటకంలో ఒక పాత్ర పోషిస్తున్నానని భావించడు. కుటుంబంలో ఎవరు దూరమైనా దుఃఖిస్తాడు. చూసేదంతా నిజమనుకుంటాడు. తనకున్నవన్నీ చూసి మురిసిపోతాడు. | 20. ఇదంతా భగవంతుడు ఆడించే నాటకం. అందులో తాను తన పాత్ర పోషించటానికి మాత్రమే వచ్చాను, అని తెలుసుకుంటాడు. ఏమి జరిగినా దుఃఖించడు, దేనికి మురిసిపోడు. చేయడానికే ప్రాముఖ్యం ఇస్తాడు. ఫలితం ఆశించడు. |

# "నిజమైన దేవాలయం!"

దేవుని ఆలయానికి వెళ్తున్నామని పిల్లలకు చెపుతూంటాం. అలా దేవుని ఆలయాలంటూ ఎక్కడెక్కడకో వెళ్తాం, ఎన్నో చోట్ల తిరుగుతాం. కానీ నిజమైన దేవాలయం ఏదో తెలుసుకోలేకపోతున్నాం.

ఆలయం అంటే ఉండే ప్రదేశం. దేవాలయం అంటే దేవుడు వుండే ప్రదేశం. "నిజమైన దేవుడు వున్నదే నిజమైన దేవాలయం". అందుచేత దేవుడు ఎక్కడున్నాడో ముందు తెలుసుకోవాలి. ఆయన వున్న ఆలయానికే మనం వెళ్ళాలి. అంతే కాని దేవుడు లేని ఆలయానికి వెళ్తే ప్రయోజనమేమిటి?

నిజమైన దేవాలయం ఏదో తెలుసుకోవాలంటే ముందు దేవుడు ఎవరు? ఎలా వుంటాడు? ఎక్కడ వుంటాడో? తెలుసుకోవాలి. భూమి మీద దేవుని గుర్తించగలిగే మార్గం, ఆయన మనకు లభ్యమయ్యే అవకాశం ఒక్కటే. ఆయన అందరిలో ఆత్మ రూపంలో వున్నాడు. ఇదే విషయం భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు తెలియచేశారు. అంటే దేహంలో ఉన్న ఆత్మే దేవుడని తెలుస్తుంది. అందుచేత "ఆత్మ ఉన్న దేహమే నిజమైన దేవాలయం. అందుకే ఆదిశంకరాచార్యుల వారు "దేహమే దేవాలయం, జీవుడే దేవుడు" అన్నారు.

దేవుడు బయట లేడు. ఈ భౌతికమైన కళ్ళతో దేవుడ్ని చూడలేం. దేవునికి రూపం లేదు. అందుచేత బహిర్ముఖంగా బయట వెతకటం కాదు. తిరగటం కాదు. అంతర్ముఖంగా అంతరంలో వెతకాలి. అంటే అంతర్ము ఖులవ్వాలి.

ఇదే లలితా సహస్రంలో ఇవ్వబడిన సందేశం. "అంతర్ముఖ సమారాధ్యా ,బహిర్ముఖ న సుదుర్లభ", అంటే 'అంతరంలోనే నేను లభిస్తాను కాని బయట కాదు" అందుచేత మనం, మన దేహంలోకి ప్రవేశిస్తేనే దేవాలయంలోకి ప్రవేశించినట్టు.

మరి దేహంలోకి ప్రవేశించాలంటే ఒక్కటే మార్గం. కళ్ళు మూసుకుని "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చెయ్యడం. ధ్యానం ద్వారా దేవుని ఆలయంలోనికి ఎవరైనా ప్రవేశించవచ్చు.

"శ్వాస మీద ధ్యాస" ఉంచడం ద్వారా మనస్సును పరిపరివిధాలుగా బాహ్య ప్రపంచం మీదకు ప్రాపంచిక విషయాల మీదకు పోకుండా నిశ్చలంగా, నిర్మలంగా వుంచితే దేవుని మందిరంలో వుంటాం. దేవునితో వుంటాం. అలా వుండగా వుండగా చివరకు ఆ దేవుని దర్శనం అంటే 'ఆత్మ దర్శనం' కూడా

కలుగుతుంది. అప్పుడు మన సమస్త పాపాలు దగ్ధమై ముక్తిని పొందుతాం. జన్మ ధన్యం చేసుకుంటాం. 'జీవన్ముక్తులవుతాం'.

అందుచేత దేవాలయం ఎక్కడో లేదు. "పవిత్రమైన మన దేహమే సత్యమైన, నిజమైన, దేవాలయ మని" తెలుసుకోవాలి. దానిని పవిత్రంగా వుంచాలి. మద్యం, మాంసం, జంతువుల శవాలను వేసి అపవిత్రం చేయకూడదు. ధ్యానం చెయ్యాలి.

## పిరమిడ్ ధ్యానుల 18 ఆదర్శ సూత్రాలు

1. సరైన ధ్యానం... అంటే ఆనాపానసతి ధ్యానం... క్రమం తప్పకుండా చేయాలి; ఆనాపానసతి ధ్యానాన్ని అందరిచేతా చేయించాలి.
2. ఆత్మవిజ్ఞాన పుస్తకాలను విస్తారంగా చదవాలి... ఉదాహరణకు : స్వామీ రామా, యోగానంద పరమహంస, ఓషో, లోబ్‌సాంగ్ రాంపా, కాస్టానెడా, జేన్ రాబర్ట్స్, రిఛార్డ్ బాక్, అనీబిసెంట్, లిండా గుడ్‌మాన్, దీపక్ చోప్రా, బ్రయాన్ వైస్, సిల్వియా బ్రౌన్, బార్బరా మార్సిన్యాక్.... మొదలైన మాస్టర్ల యొక్క అద్భుత గ్రంథాలు.
3. ధ్యానంలో కలిగే అనుభవాలను తోటి ధ్యానులతో విధిగా పంచుకోవాలి.
4. వీలయినంత వరకు మౌనాన్ని పాటించాలి.
5. పౌర్ణమి రాత్రులలో ధ్యానం తప్పనిసరి... వీలయినంత సామూహికంగా!
6. అవకాశం ఉన్న చోటల్లా పిరమిడ్ శక్తిని ఇతోధికంగా వినియోగించుకోవాలి!
7. మందులనూ, డాక్టర్లనూ మర్చిపోండి! స్వీయ ధ్యాన శక్తితోనే, ఎవరిని వారే స్వస్థత పరచుకోవాలి!
8. మాంసాహారం ముట్టకండి! కోడిగ్రుడ్లు సైతం నిషిద్ధం! శాఖాహారంలోనూ పరిమితాహారమే యుక్తం.
9. ప్రకృతితో సహజీవనం నెరపుతూ వుండాలి; అడవుల్లో, వనసీమల్లో విహార యాత్రలు, ట్రెక్కింగ్‌లు అధికంగా చేస్తూండాలి.
10. ఆధ్యాత్మికతలో ప్రత్యేక వేషధారణ, నామధారణలు లేవు! నామాలు, బొట్లు తదితరాలు ససేమిరా వుండకూడదు!
11. చిన్ననాటి నుంచే పిల్లలకు ధ్యాన శిక్షణ విధిగా గరపాలి.
12. ఎవ్వరూ శిష్యులుగా వుండకూడదు.... అందరూ మాస్టర్లుగానే విరాజిల్లాలి.
13. ధ్యాన శిక్షణా కార్యక్రమాల్లో డబ్బు లావాదేవీలు పెట్టుకోకూడదు.
14. విగ్రహారాధన కాదు! ఆత్మ ఆరాధనే ముక్తికి మార్గం! జీవించి వున్న మాస్టర్లనూ పూజించకూడదు.
15. స్వంత ఆత్మశక్తితోనే... సర్వ వ్యక్తిగత సమస్యలను, ఎప్పటికప్పుడు పరిష్కరించు కుంటూ వుండాలి.
16. సాధారణ గృహస్థ జీవితాన్ని ఆనందంగా గడపాలి.
17. అన్ని గ్రామాలలోనూ, అన్ని పట్టణాలలోనూ పిరమిడ్ ధ్యాన కేంద్రాలను విధిగా నెలకొల్పాలి.
18. ధ్యానానుభవాలనూ, ఆధ్యాత్మిక ప్రగతి విశేషాలనూ లిఖితపరచి విధిగా ప్రచురించాలి.

# "భగవంతుని గుర్తించే ఒక్కానొక్క మార్గం!"

భగవంతుడు నిరాకారుడు, సర్వాంత ర్యామి, సర్వశక్తిమంతుడు, అనంతుడు, తేజో మయుడు. ఇలా భగవంతుని గూర్చి పెద్దలు, పండితులు ఎన్నో రకాలుగా వర్ణిస్తూంటారు. ఆయన ప్రతీ జీవిలోనూ ఆత్మ స్వరూపుడై ఉన్నాడని కూడా చెపుతారు. అలా ఆత్మ స్వరూపుడైన ఆ భగవంతుని దర్శించగల అవకాశం సాక్షాత్కరించు కోగల శక్తి ఒక్క మానవునికే ఉన్నాయి.

ఆత్మే భగవంతుడు కనక 'ఆత్మ దర్శనమే భగవత్ దర్శనం!'. 'ఆత్మ సాక్షాత్కారమే భగవత్ సాక్షాత్కారం!'. ఒక్క ఆత్మ ద్వారానే భగవంతుని ఉనికి మనం తెలుసుకోగలం. అంతకు మించి భగవంతుని తెలుసుకునే మార్గం మరొకటి లేదు. ఆత్మ తప్ప ఇక ఏ రకంగానూ భగవంతుడు మనకు లభ్యం కాడు.

భగవంతుడు లభించాలన్నా, దర్శించాలన్నా, పొందాలన్నా మనకు ఆత్మే శరణ్యం. ఎవరైనా సరే 'ఆత్మ దృష్టిలో వుంటేనే భగవత్ దృష్టిలో వున్నట్టు'. 'ఆత్మ భావనలో వుంటేనే భగవత్ భావనలో వున్నట్టు', 'ఆత్మను గుర్తుంచుకుంటేనే భగవంతుని గుర్తుంచుకున్నట్టు', 'ఆత్మను పొందటానికి ప్రయత్నించే వారే భగవంతుని పొందటానికి ప్రయత్నించేవారని తెలుసుకోవాలి'.

ఆత్మదృష్టిలో అంటే భగవత్ దృష్టిలో వుండాలంటే ఒక్కటే మార్గం అదే "శ్వాస మీద ధ్యాస ధ్యానం". ఎందుచేతనంటే ఆత్మ అన్నది బయట ప్రపంచంలో ఎక్కడా కనబడదు. ప్రపంచంలో ఏ మారుమూల వెతికినా ఆత్మ దొరకదు. మనకు సాధ్యం కూడా కాదు. అది సాధ్యమయ్యేదైతే మానవులు ఎప్పుడో సాధించి వుండేవారు.

ఆత్మ అంటే భగవంతుడు ప్రతీ ఒక్కరి అంతరంలోనే వున్నాడు. అందుచేత "బాహ్య దృష్టితో కాక అంతర్ దృష్టితో", "బాహ్యాన్వేషణలో కాక అంతరాన్వేషణలో", "బాహ్య చక్షువులతో కాక అంతర్ దివ్య చక్షువుతో" మాత్రమే భగవంతుని దర్శించగలం. యుగ యుగాల నుండి అలా ధ్యాన సాధన ద్వారా అంతర్ముఖులైన వారు ఎంతోమంది "భగవంతుని అంటే ఆత్మను" దర్శించారు. అలా ధ్యానం ద్వారా భగవత్ దర్శనం అంటే ఆత్మ దర్శనం ఎవరికైనా కలుగుతుంది.

భగవంతుని పొందే మార్గం ధ్యానం ఒక్కటే. ధ్యానం తప్ప వేరొక మార్గం లేదు. అందుచేత ఆత్మ మీద దృష్టి వుంచితేనే భగవంతుని మీద దృష్టి

వుంచినట్టు అంటే ధ్యానం చేస్తేనే భగవంతుని మీద దృష్టి వుంచినట్లని తెలుసుకోవాలి. ఇక ఏం చేసినా అంటే పూజ, భజన, ప్రార్థన, నామజపం లాంటివి ఎన్ని చేసినా, ఎన్ని జన్మలెత్తినా భగవంతుని పొందటం అసాధ్యం. అసలు భగవంతుని దృష్టిలో ఉన్నట్లే కాదు.

మనం ఢిల్లీ వెళ్ళాలనుకుంటే వెళ్ళలేం. ఢిల్లీ వెళ్ళాలనుకుంటే ఢిల్లీ వెళ్ళే ట్రెయిన్ ఎక్కి కూర్చోవాలి. అలా కూర్చున్నపుడే ఢిల్లీ చేరగలం. ఢిల్లీ ట్రెయిన్‌లో కూర్చోకుండా ఎప్పటికీ ఢిల్లీ చేరుకోలేం. అలాగే భగవంతుని దర్శించాలను కుంటే ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తుంటే మనం ఎప్పుడో ఒకప్పుడు భగవంతుని దర్శించగలం. అంతేకాని ధ్యానం చెయ్యకుండా ఎప్పటికీ, ఎన్ని జన్మలెత్తినా భగవంతుని దర్శించలేం.

భూమి మీద "భగవంతుని గుర్తించే ఒక్కగానొక్క మార్గం ఆత్మే" అని తెలుసు కోవాలి. అందుచేత భగవంతుడంటే ఇష్టం అనేవారు ఎప్పుడు అవకాశం దొరికితే అప్పుడు కాదు, అవకాశం కల్పించుకుని మరీ ధ్యానం చెయ్యాలి.

# "ఆత్మ దృష్టి భగవత్ దృష్టి"

భగవంతునికి రూపం లేదు కాబట్టి ఏ రూపాన్ని ఆరాధించినా భగవంతుని ఆరాధించినట్టే. అలాగే భగవంతునికి పేరు లేదు కాబట్టి ఏ పేరుతో పిలిచినా భగవంతుని పిలిచినట్టే. అందుచేత మీకు నచ్చిన నామాన్ని స్మరించండి. మీకు నచ్చిన రూపాన్ని ఆరాధించండి అని పెద్దలు చెబుతూంటారు.

అలా నిరంతరం ఏ నామాన్ని స్మరించినా, ఏ రూపం మీద దృష్టి వుంచినా వారిని ఆ భగవంతుడు కాపాడటమే కాదు. కష్టాలు లేకుండా చేస్తాడు.. చివరకు వారి జన్మ ధన్యమవుతుందని చెబుతారు. అంతేకాదు మరణ సమయంలో భగవంతుని దృష్టిలో వుంటే, వారు భగవంతుని పొందుతారని కూడా పెద్దలు చెబుతూంటారు.

గమనిస్తే మరణ సమయంలో ప్రతీ ఒక్కరూ ఏదో ఒక పేరు అంటే కుటుంబ సభ్యుల పేర్లు గాని, ఇతరుల పేర్లు కాని, లేదా ఏదో ఒక దాని దృష్టిలో వుంటారు. మరి అన్నీ భగవంతుడైనపుడు దేని మీద దృష్టి వున్నా భగవంతుని మీద దృష్టి వున్నట్లే కదా? అలాంటపుడు ప్రతీ ఒక్కరూ భగవంతుని పొందాలి కదా? భగవంతుని పొందినవారు మోక్షాన్ని పొందినట్లే కదా? మరి ప్రతీ ఒక్కరూ మోక్షాన్ని పొందుతున్నారా? అలా అంతా మోక్షాన్ని పొందితే, మోక్షం పొందటం చాలా తేలికే గదా? ఎన్ని పాపాలు చేసినా చివరకు ప్రతీ ఒక్కరికి మోక్షం వస్తున్నట్లే కదా? మరి మోక్షం అంత తేలికగా వస్తుందా? అంటే ఖచ్చితంగా రాదు.

ఎందుచేతనంటే దేని మీద దృష్టి వుంచినా భగవంతుని మీద దృష్టి వుంచినట్లు కాదు. ఏ పేరు పెట్టిపిలిచినా భగవంతుని పిలిచినట్టు కాదు, ఆరాధించినట్టు కాదు,

ఉత్తర గీతలో :-

శ్లో॥ **శిలామృద్దాయ పాత్రే మద్దైవబుద్ధిః ప్రకల్పితః!**
**అకల్పిత స్వయం జ్యోతిరాత్మానో దేవరా నకిం॥**

(ఉ॥గీ 4-27)

"తా :- శిలల చేతను, మట్టి చేతను, కొయ్య చేతను చేయబడిన విగ్రహములందు దైవము అనే బుద్ధి కలుగుట కల్పితమైనది. ఎందుకనగా స్వయం జ్యోతి స్వరూపుడైన ఆత్మ అంటే భగవంతుడు అకల్పితుడు. అనగా ఎవరిచేతనూ కల్పింపబడని

పరబ్రహ్మమని తెలియుచున్నది. కావున కల్పించబడిన దేవతలతో మనకేమి పని.

శిలలచేతను, మట్టి చేతను, కొయ్య చేతను నిర్మించబడిన కల్పిత విగ్రహములను ఆరాధింపక స్వయం జ్యోతి స్వరూపుడైన ఆత్మ రూపములో వున్న, అకల్పితుడైన పరమాత్మయే సత్యమని తెలుసుకుని ఆత్మను ఆరాధించాలని ఈ ఉత్తర గీతా శ్లోకము ద్వారా తెలుసుకోవచ్చు.

అంటే "ఆత్మ దృష్టే భగవత్ దృష్టి". "ఆత్మ భావనే భగవత్ భావన". ఇంక ఏ భావంలో వున్నా అది కల్పిత భావమే. భగవంతుని దృష్టిలో లేనట్లే. అందుచేత "భగవత్ దృష్టిలో వుండాలంటే ఆత్మ దృష్టి వుండాలి".

దానికి ఒక్కటే మార్గం అదే "ఆనాపానసతి ధ్యానం". ధ్యానం ద్వారా మనస్సును శూన్యం చేసుకుంటే ఆత్మ మీద దృష్టి వుంచినట్లే అంటే భగవంతుని దృష్టిలో వున్నట్టే. అందుచేత నిత్యం ధ్యానం చేస్తూ భగవంతుని దృష్టిలో ఉండాలి. తరించాలి.

# "ఆత్మే భగవంతుడు అని నమ్మాలి !"

కొంతమంది రకరకాల భగవత్ సంబంధమైన సాధనలు చేస్తూ, ఎన్నో పుస్తకాలు చదువుతూ, ఎంతోమంది గురువులను ఆశ్రయిస్తూ, పండితులు, వేదాంతుల ఉపన్యాసాలు వింటూ, భగవంతుడు ఆత్మ స్వరూపుడు, ఆత్మే భగవంతుడు అని తెలుసుకుంటారు.

అలా ఆత్మను ఆరాధిస్తే భగవంతుని ఆరాధించినట్లేనని తెలుసుకుంటారు. ఆత్మ దర్శనమే భగవత్ దర్శనమని, ఆత్మ సాక్షాత్కారమే భగవత్ సాక్షాత్కారమని తెలుసుకుంటారు. అంతేకాదు అంతర్యామిగా వున్న ఆత్మను పొందటానికి ఆత్మను ఆరాధించటానికి ధ్యాన సాధనే మార్గమని తెలుసుకుంటారు. ధ్యానం చేస్తూంటారు.

ఇలాంటి జిజ్ఞాస అంటే భగవంతుని పొందాలనే కాంక్ష వున్నవారు ఒక విషయం గమనించాలి. "యద్భావంతద్భవతి" అన్న భగవత్ వాక్యం ప్రకారం మనం ఏ భావంలో వుంటే అదే పొందుతాం. అలాగే ఆత్మను పొందాలంటే నిరంతరం ఆత్మ భావంలో వుండాలి. "ఆత్మే భగవంతుడని నమ్మాలి".

అంతేకాని ధ్యానం చేసినంత మాత్రాన సరిపోదు. ఆత్మే భగవంతుడు అని పూర్తిగా విశ్వసించాలి. భావించాలి. అలా మనసా, వాచా, కర్మణా నమ్మి, ఆత్మను ఆరాధించినవారే భగవంతుని ఆరాధించినవారవుతారు.

అందుచేత ఆత్మ భగవంతుడని మాటలతో చెపితే సరిపోదు. చేతలు కూడా చూపించాలి. విగ్రహం కేవలం విగ్రహమేనన్న అవగాహన వుండాలి. ఆత్మే భగవంతుడని విశ్వసించాలి. అలాంటి విశ్వాసం వున్నవారే, ఆత్మను అంటే భగవంతుని పొందగలరు.

విగ్రహం గురించి యోగి వేమన ఏమి చెప్పారంటే

**"శిలలను చూసి శివుడని భావింత్రు!**
**శిలలు శిలలే కాని, శివుడు కాదు!**
**తనదులోని శివుని తానేల తెలియడో**
**విశ్వధాభిరామ వినురవేమ!"**

అందుచేత మాటల్లో ఆత్మ భగవంతుడని చెపుతూ చేతలు విగ్రహం భగవంతుడన్నట్లుగా ప్రవర్తిస్తే, అంటే ఆరాధిస్తూ వుంటే త్రికరణ శుద్ధి లేనట్లే కదా? అలా చెయ్యడం భగవంతుని అవమానించినట్లే కదా? అలాంటి వారికి భగవత్ ప్రాప్తి ఎలా కలుగుతుంది? వారు దుఃఖం నుంచి ఎలా బయటపడతారు?

ఇదే విషయం శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో కూడా తెలియచేశారు.

శ్లో॥ **అవజానన్తిమాం మూఢామానుషీంతను మాశ్రతమ్!**
**పరంభావమజానన్తోమమ భూత మహేశ్వరమ్!!**

(భ.గీ. 9-11)

తా॥ సర్వోత్తమమైన, సర్వాత్మ స్వరూపుడు అయిన నా తత్వమును తెలియని మూఢులు నన్ను మనుష్య సంబంధమైన దేహమును మాత్రం ధరించిన వానినిగా తలచి నన్ను అవమానించుచున్నారు.

అందుచేత ఆత్మే పరమాత్మ అని మాటలు చెప్తే సరిపోదు. చేతలు ముఖ్యం. భావన ముఖ్యం అని తెలుసుకోవాలి.

ఆత్మే భగవంతుడని మనసా, వాచా, కర్మణా నమ్మాలి. మన చేతలు, మాటలు, ఆలోచనలు ఒకే రకంగా వుండాలి. అలా ఆత్మే భగవంతుడు అని నమ్మి 'ఆత్మ ఆరాధన అంటే ధ్యాన సాధన' చేస్తే మనం నమ్మినటువంటి భావనే మనలను భగవంతునిగా మారుస్తుంది. భ్రమర కీటక న్యాయంలా అంటే 'కీటకం భ్రమర ఝుంకారాన్ని వింటూ చివరకు భ్రమరంలా మారుతుంది'. అలాగే మనం కూడా భగవత్ స్వరూపులవుతాం.

# ఎవరికి కృతజ్ఞత చూపించాలి?

సహజంగా మనకు ఎవరైనా సాయం చేస్తే వారికి కృతజ్ఞతలు చెప్పుకుంటాం. అలా ఎవరి వల్ల మంచి జరిగినా, ఉపకారం పొందినా, లాభం వచ్చినా, సంతోషం కాని ఆనందం కాని కలిగినా వారికి మనం కృతజ్ఞతలు చెప్పుకోవడమే కాదు ఆ ఉపకారం చేసినందుకు వారిని జీవితాంతం గుర్తుంచుకుంటాం.

అలా ఇబ్బందులలో ఆర్థికసాయం చేసినా, కష్టాలలో ఆదుకున్నా, అనారోగ్యంగా ఉన్నపుడు సేవలందించినా, ఒక ఉద్యోగం ఇప్పించినా, పదవి రావడానికి కారణం అయినా, వివాహానికి కారణమైనా, పిల్లలు లేనప్పుడు పిల్లలు పుట్టడానికి కారణమైనా, వారికి మనం కృతజ్ఞతలు చెప్పుకుంటాం. వారిపట్ల గౌరవభావంతో ఉంటాం.

అలాగే మన సమస్యలు పరిష్కారం కానప్పుడు, ఇబ్బందులు పడుతున్నప్పుడు, అనారోగ్యం నుండి బయట పడలేనప్పుడు, కష్టాలలో ఉన్నప్పుడు మనం కొంతమంది గురువులను ఆశ్రయిస్తాం. వారిని ఆశ్రయించిన తరువాత ఆ సమస్య పరిష్కారమయితే, ఆ కష్టాల నుంచి బయట పడితే ఆ గురువును దైవ సమానంగా భావిస్తాం. ఆయనపట్ల అంతులేని కృతజ్ఞతాభావం చూపిస్తాం, ఆరాధిస్తాం. ఆయననే భగవంతుడుగా భావిస్తాం. జీవితాంతం ఆయనను పూజిస్తాం.

అలాంటి కష్టాలలో ఏ విగ్రహాన్ని పూజించినా, ఏ ఫోటోను ప్రార్థించినా మన కష్టం తీరితే ఆ విగ్రహాన్ని, ఫోటోను మర్చిపోం. నిత్యం పూజిస్తాం. జీవితాంతం కృతజ్ఞత చూపిస్తాం. ఆ విగ్రహం కోసం, ఫోటో కోసం, ఆ మతం కోసం ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధపడతాం.

మన జీవితంలో ఎవరివల్ల ఏ మాత్రం ప్రయోజనం కలిగినా వారిపట్ల కృతజ్ఞత చూపించడమే కాదు, వారిని మర్చిపోకుండా జీవితాంతం ఆరాధిస్తాం. అలా తాత్కాలికమైన చిన్న ప్రయోజనానికే అంత కృతజ్ఞత చూపిస్తున్నాం. కాని జీవితాంతం లాభం పొందుతూ, అనుక్షణం ప్రయోజనం పొందుతూ మన జీవిత సుఖాలకు, ఆనందానికి, వైభవానికి కారణమైన వారిని మనం పూర్తిగా విస్మరిస్తున్నాం. మర్చిపోయాం. కనీసం అంతలాభం పొందుతున్నామన్న అవగాహన కూడా మనకు లేదు. ఏ రకంగానూ కృతజ్ఞత చూపించడం లేదు.

మన జీవితానికి మూలమైన వారిని పట్టించుకోకపోవడం ఎంత దురదృష్టకరమో ఆలోచించాలి. ఎన్నో ప్రయోజనాలు పొంది, వారిని మర్చిపోవడం. అసలు లాభం పొందుతున్నామని కూడా తెలుసుకోక పోవడం కన్నా కృతఘ్నుత ఇంకొకటి వుండదు. మరిచి పోలేనంత లాభం, ప్రయోజనం, వైభవం పొందుతూ కూడా మర్చిపోతున్నాం. అందుచేత కనీసం ఇప్పుడైనా తెలుసుకుని, గుర్తుంచుకుని ఆరాదిద్దాం.

మన కళ్ళకు ఏదైనా లోపం వస్తే ఆ లోపాన్ని సరిచేసిన వారిపట్ల జీవితాంతం కృతజ్ఞులుగా ఉంటున్నాం. కాని ఆ కళ్ళు జీవితాంతం చూడగలిగే శక్తినిచ్చిన వారిని మర్చిపోయాం. అలాగే వినికిడిలో ఏమైనా లోపం వస్తే దానిని సరిచేసిన వారిని గుర్తుంచుకుంటున్నాం. కాని జీవితాంతం వినగలిగే శక్తి నిచ్చిన వారిని మర్చిపోయాం. అలాగే మాట్లాడే విషయంలో, జ్ఞాపకశక్తి విషయంలో వచ్చిన లోపాలు సరిచేసిన వారి పట్ల కృతజ్ఞులుగా ఉంటున్నాం కానీ జీవితాంతం ఆ శక్తినిచ్చిన వారిని మర్చిపోతున్నాం. అలాగే కాళ్ళు, చేతులకు వచ్చిన లోపాలు సరిచేసినవారి పట్ల జీవితాంతం కృతజ్ఞులుగా ఉంటున్నాం కాని జీవితాంతం నడవగల, పనిచెయ్యగల శక్తినిచ్చిన వారిని మర్చిపోతున్నాం.

మన జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, జీవితాంతం పనిచేయడానికి కారణం ఎవరు? ఆ ఇంద్రియాలతో ఇన్ని సుఖాలు, భోగాలు అనుభవించ గలుగుతున్నామంటే కారణం ఎవరు? మనం ఎన్నో మధురమైన పదార్థాలు భుజిస్తున్నాం. ఇష్టమైనవి వాసన చూస్తున్నాం. శ్రావ్యమైన సంగీతం వింటున్నాం. సుందర దృశ్యాలు చూసి ఆనందిస్తున్నాం. శారీరక సుఖాలు, వాంఛలు తీర్చుకుంటున్నాం. ఇన్ని భోగాలు, ఇన్ని వైభవాలు, సుఖాలు, ఆనందం పొందుతున్నా వీటికి కారణమైన వారిని మర్చిపోతున్నాం.

అంతేకాదు నిత్యం మన దేహంలో మనకు తెలియకుండా మన ప్రమేయం లేకుండా సుమారు 200 క్రియలు జరుగుతున్నాయి. అంటే శ్వాసక్రియ, జీర్ణక్రియ, రక్త ప్రసరణ క్రియ, విసర్జన క్రియల్లాంటివి. అవి సక్రమంగా జరుగుతున్నందువల్లే మనం ఇంత ఆరోగ్యంగా ఉండగలుగు తున్నాం, ఇంత వైభవంగా జీవించగల్గుతున్నాం. ఏ ఒక్క క్రియ సరిగ్గా జరగకపోయినా మనం రోగంతో మంచం మీద పడవలసిందే. మరి ఇన్ని క్రియలు జీవితాంతం జరగడానికి కారణమైన శక్తిని మనం విస్మరించాం. పూర్తిగా మరిచిపోయాం.

అసలు వీటన్నిటికి మూలం మనం జీవించినంతకాలం

జ్ఞానేంద్రియాలతో కర్మేంద్రియాలతో చేస్తున్న కర్మలు, అలాగే మన దేహంలో జరిగే క్రియలు అన్నీ "ఆత్మ శక్తి వల్లే జరుగుతున్నాయి. అంటే "ఆత్మ" వల్లే ఇంత వైభవంగా జీవిస్తున్నాం. కానీ అటువంటి ఆత్మను మటుకు పూర్తిగా మరచిపోయాం.

ఆలోచించండి ఆత్మే కనుక మన శరీరం నుండి ప్రక్కకు తప్పుకుంటే శరీరమే శవమవుతుంది. ఇంద్రియాలు పనిచెయ్యవు. శరీరం లో ఏ క్రియ జరగదు. శరీరం ఎందుకూ పనికిరాదు. నిమిషాలలో కుళ్ళి పోతుంది. అప్పటి వరకూ ప్రేమించిన వారు కూడా చూడటానికి భయ పడతారు. ఆఖరుకు భార్య కూడా దగ్గరకు రాదు. ఆత్మ లేకపోతే శరీరం పరిస్థితి ఏమవుతుందో మనం ఊహించుకోవచ్చు. మరి అటువంటి ఆత్మను విస్మరించడమంటే ఎంతటి కృతఘ్నుతో అర్థం చేసుకోవచ్చు.

అటువంటి ఆత్మను మర్చిపోకూడదు. ఆత్మపట్ల జీవితమంతా కృతజ్ఞత చూపించాలి. ఆరాధించాలి. కాని మనం ఆత్మను విస్మరించి విగ్రహాలను, ఇతర వ్యక్తులను ఆరాధిస్తున్నాం. అన్నిటికంటే ముఖ్యమైన ఆత్మను విస్మరించాం. కనీసం జీవితంలో ఒక్కసారైనా తలుచుకోవట్లేదు. ఆత్మ వల్ల ఇంతటి లాభాన్ని పొందుతున్నామన్న అవగాహన కూడా లేదు. ఇది చాలా శోచనీయం.

మనం కృతజ్ఞత చూపవలసింది ఆత్మ పట్ల. ఆత్మను ఎప్పుడూ మరువకూడదు. ఎందుచేతనంటే ఆత్మ అంటే ఎవరోకాదు. ఎవరైతే సమస్త జీవుల మనుగడకు, ఈ సకల చరాచర సృష్టి మనుగడకు మూలకార కుడో, యీ సృష్టికి ఆధారమై, ఈ సృష్టిని నడిపిస్తున్నాడో, ఆ భగవంతుడే. అంటే 'ఆత్మే భగవంతుడు'. ఆత్మను విస్మరించడమంటే భగవంతుని విస్మరించినట్లే. ఆత్మను మరువడమంటే భగవంతుని మరచినట్లే. ఆత్మను పట్టించుకోకపోతే నిజంగా భగవంతుని పట్టించుకోకపోవడమే.

భవద్గీతలో "అహంఆత్మాగుడాకేశా" అని కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది. అంటే నేను ఆత్మను అని తెలుసుకో అర్జునా అని చెప్పాడు. అంతే కానీ నేను విగ్రహాన్ని, ఫోటోని అని చెప్పలేదు.

మనం చిన్న లాభానికి, తాత్కాలిక ఆనందానికి కారణమైన వారిపట్ల జీవితాంతం కృతజ్ఞత చూపిస్తున్నాం, ఆరాధిస్తున్నాం. కానీ జీవితాంతం లాభం పొందుతూ ఆత్మను అంటే భగవంతుని విస్మరిస్తున్నాం.

ఎవరికైనా మనం కొంచెం సహాయం చేస్తే వారు మన పట్ల విశ్వాసం

చూపించాలని ఆశిస్తాం. మనల్ని మన సహాయాన్ని మర్చిపోకూడదనుకుంటాం. మన పట్ల కృతజ్ఞత చూపించాలనుకుంటాం. కానీ జీవితాంతం లాభం పొందుతూ ఇంత వైభవాన్ని పొందుతూ కూడా ఆత్మను విస్మరిస్తున్నామంటే ఎంత విశ్వాసం లేనివారమో తెలుసుకోవచ్చు.

మరి అటువంటి ఆత్మను గుర్తించుకోవాలన్న ఆత్మపట్ల కృతజ్ఞత చూపించాలన్నా ఒక్కటే మార్గం. అదే 'ఆనాపానసతి' ధ్యానం. ధ్యానం చేస్తేనే మనం ఆత్మ మీద దృష్టి వుంచినట్టు. ఆత్మను గుర్తుంచుకున్నట్లు. అంటే భగవంతుని గుర్తుంచుకున్నట్లు, అంటే భగవంతుని ఆరాధించినట్లు.

భగవంతుడు అందరిలో ఆత్మరూపుడై వుండి అందరికీ ఉపకారం చేస్తున్నాడు. అటువంటి భగవంతుడ్ని ధ్యానం ద్వారా ఆరాధించి కృతజ్ఞతను చూపించాలి. ఇంతకన్నా జీవితంలో మనం చేయగలిగిన గొప్ప కార్యం ఇంకొకటి లేదు.

# "భగవంతుడు నిరాకారుడు!"

భగవంతుడు ఎలా ఉంటాడు? అని అడిగితే వెంటనే భగవంతుడు నిరాకారుడు అని చెపుతాం. ఇంకా భగవంతుని గూర్చి వర్ణించమంటే ఆయన అనంత శక్తి స్వరూపుడు, సకల చరాచర సృష్టి అంతా వ్యాపించి ఉన్నవాడు. చావు పుట్టుకలు లేనివాడు, ఆది అంతములు లేనివాడు. నామ,రూప రహితుడు. గుణాతీతుడు, దయామయుడు, కరుణామయుడు. సర్వమూ తానై ఉన్నవాడు, తేజోమయుడు, వర్ణించనలవి కాని వాడు, ఊహకు అందని వాడు, దర్శించ సాధ్యం కాని వాడు, ఆ స్థితి అనుభూతి చెందవలసిందే తప్ప చూడటం కాని, వర్ణించటం కాని సాధ్యం కాదని భగవంతుని గూర్చి చెప్తాం.

కాని చాలా మందికి భగవంతుని శక్తి తెలియక ఆయనను రకరకాల రూపాలలో వూహించుకుని పూజలు, ప్రార్ధనలు చేస్తూ, పుణ్య క్షేత్రాలు దర్శిస్తూ, భగవంతుని దర్శించామని, చూశామని భావిస్తున్నారు. కాని ఇది అవివేకమే తప్ప నిజానికి భగవంతుని బాహ్య జగత్తులో చూడటం కాని, తెలుసుకోవటం కానీ ఎవరికీ సాధ్యం కాదు. ఆయనను కఠోరమైన ధ్యాన సాధనలో అనుభూతి చెందగలరే కాని, దర్శించలేరు.

భార్యను ప్రేమించగలం కాని, ప్రేమను చూపించలేం కదా? గులాబి వాసనను అనుభూతి చెందగలమే కానీ, వాసనను కంటితో చూడలేం కదా? మామిడిపండు తిని రుచిని అనుభూతి చెందగలం కాని, రుచిని కంటికి చూపించలేం. గాలి వీచినపుడు స్పర్శ ద్వారా అనుభూతి చెందగలం కాని, గాలిని చూడలేం కదా? అలాగే భగవంతుని అనుభూతి చెందగలమే కానీ దర్శించలేం. కారణం భగవంతుడు నిరాకారుడు, భౌతిక నేత్రాలతో దర్శించలేనివాడు.

కానీ భగవదనుభూతి పొందిన వారి ఆనందం వర్ణించలేనిది. వారి స్థితి వూహించలేనిది. అటువంటి వారికి లోకంలో కావలసింది ఏదీ ఉండదు. ఎందుచేతనంటే సమస్తం తానై వున్నానని తెలుసుకున్న స్థితి. అంతా నేనే, నేనే అంతా అని అవగాహన చేసుకున్న స్థితి. అలా భగవదనుభూతి పొందటం ద్వారా మనమే భగవంతుడని తెలుసుకోగలం. మనమే భగవంతుడైనపుడు మనకి భగవంతుడు ఎక్కడ కనిపిస్తాడు? భగవంతుని చూడటమంటే "అహం బ్రహ్మాస్మి" అని తెలుసుకోవడమే. చంకలో పిల్లవాడిని పెట్టుకుని ఊరంతా వెతికితే

కనబడతాడా? అందుచేత భగవంతుని చూడటమన్నది ఎవరికి సాధ్యం కాదు.

అలా 'ఆత్మానుభూతి పొందిన స్థితినే ఆత్మ అనుభవం' అంటారు. ఇంకా 'ఆత్మ లబ్ధి,' 'ఆత్మ సాక్షాత్కారం' పొందిన వాడు అంటారు. ఇంకా ఆత్మానందం పొందిన వాడు, 'స్వస్వరూప జ్ఞానం' పొందినవాడు, తానెవరో తాను తెలుసుకున్నవాడు, ఆత్మజ్ఞానం పొందినవాడు, ఇలా అనేక రకాలుగా చెపుతూంటారు. ఏదైనా ఒకటే. మనం ఈ స్థితి పొందటానికే ప్రయత్నించాలి. ఈ స్థితి పొందాలంటే సరియైన ధ్యాన పద్ధతి అంటే "ఆనాపానసతి ధ్యానం" ద్వారానే సాధ్యం.

వేదాలలో "అహం బ్రహ్మాస్మి" "అయమాత్మా బ్రహ్మ" అని చెప్పబడింది. అంటే 'నేనే బ్రహ్మను', అంటే 'నేను భగవంతుడినై వున్నాను' అని చెప్పబడింది. ఆ నేను నే ఆత్మ అన్నారు. అంటే 'నేను మేను కాదు' 'నేను ఆత్మ' అని చెప్పబడింది.

ఆత్మను ఎవరూ చూడలేరు. కంటితో కాని మైక్రోస్కోపులో కాని, చూడటం సాధ్యం కాదు. ఆత్మను అనుభూతి పొందవలసిందే. ఆ ఆత్మే భగవంతుడు. ఆకారం లేని, అనంత శక్తివంతమైన, కాంతి వంతమైన పదార్థమే ఆత్మ. అందుచేత నిరాకారమైన భగవంతుని పొందాలంటే ధ్యానం చెయ్యటం ఒక్కటే మార్గం.

భగవంతునికి రూపం లేదు. భగవంతుడు నిరాకారుడని తెలుసుకుని ధ్యానం చెయ్యాలి.

# "భగవంతుడు చైతన్య స్వరూపుడు!"

విగ్రహం అంటే శిల. శిల కూడా భగవంతుడే. కానీ శిలలోని చైతన్యాన్ని గాఢ నిద్రావస్థతో పోలుస్తారు. అందుకే శిలలు చలించవు. చరించవు. అందుచేత శిలలకు చేసే ఆరాధన నిష్ప్రయోజనమవుతుంది. మనం ఏది చేసినా తగ్గ ఫలితం పొందాలి. అంతే కానీ శ్రమ వృధా కాకూడదు.

మనం ఎన్నాళ్ళు పూజించినా, ప్రార్థించినా ఫలితం పొందలేకపోతున్నాం. నిరాశ చెంది విగ్రహాలు మారుస్తున్నాం. అలా మార్చినా అది కూడా విగ్రహమే కదా? అలాంటపుడు ఫలితంలో మార్పు ఎలా వస్తుంది?

చివరకు మతాలు కూడా మారుస్తున్నాం. అప్పుడు కూడా చేసే పనిలో అంటే ఆరాధనలో మార్పురాదు. అందుచేత జీవితంలో ఎటువంటి మార్పు కానీ, ఫలితం కానీ రావటం లేదు. జీవితంలో మార్పు లేకపోవటం వలన సరైన కర్మలు చెయ్యలేక పాపాలు చేస్తున్నాం. జీవితాన్ని ఇంకా దుఃఖమయం చేసుకుంటున్నాం.

శ్రీ మద్భాగవతంలో (29–22) భగవానుడు చెప్పిన సందేశం.

"సర్వ జీవులలోనూ, ఆత్మ రూపంలో ఈశ్వరుడిగా ఉన్న నా ఉనికిని గుర్తెరగక ఎవరు నన్ను ప్రతిమల ద్వారా పూజిస్తారో అలాంటి వారి అర్చనలు బూడిదలో పోసిన యజ్ఞ ద్రవ్యాలవలె నిష్ప్రయోజనం".

దీనిని బట్టి చైతన్యం లేని కల్పితమైన శిలను ఆరాధించడం నిష్ప్రయోజనమని మనం గ్రహించవచ్చు.

అలాగే వృక్షం కూడా భగవంతుడే కానీ వృక్షంలోని చైతన్యాన్ని స్వప్నావస్థతో పోలుస్తారు. అందుకే వృక్షాలు చలిస్తాయి కానీ, చరించవు. అందుచేత వృక్షాన్ని ఆరాధించినా ప్రయోజనం లేదు.

అలాగే జంతువులు కూడా భగవంతుడే జంతువులలోని చైతన్యాన్ని జాగ్రదావస్థ అంటే మెలకువ స్థితితో పోలుస్తారు. అందుచేత జంతువులు చరిస్తాయి చలనం వుంటుంది. ఇక్కడ చైతన్యం పూర్తి చైతన్య వంతమై ఉండదు. అందుచేత జంతువులను ఆరాధించినా ప్రయోజనం ఉండదు.

అలాగే మానవుడూ భగవంతుడే. కానీ మానవులోని చైతన్యం పూర్తి చైతన్యవంతమై ఉంటుంది. అందుచేత సత్యమైన భగవంతుని ఉనికి ఆత్మ రూపంలో

మానవునిలోనే వుంది. అందుచేత ఆత్మ దర్శనమే భగవత్ దర్శనం అంటారు. ఆత్మను పొందితే భగవంతుని పొందినట్లే.

ఆత్మ సాక్షాత్కారం పొందిన వారి అంటే భగవత్ సాక్షాత్కారం పొందిన వారి ఆనందం వర్ణించలేనిది. ఆ అనుభూతి అనుభవించవల సిందే కానీ మాటల్లో చెప్పటానికి సాధ్యం కాదు. మాటలు చాలవని, అనుభూతి చెందిన యోగులు చెపుతుంటారు.

అందుచేత ఆత్మానుభూతి చెందిన యోగులు వర్ణించలేని, వూహించలేని ఆ ఆనంద స్థితిని వదలలేక అలాగే వుండి పోతారు. దీనినే సమాధి స్థితి అని అంటారు.

అందుచేత ఆ స్థితి పొందిన వారు, ఆ ఆనందాన్ని అనుభవిస్తున్న వారు, ఆ సమాధి స్థితిలో రోజులు, నెలల తరబడి అలాగే వుండిపోతారు. అంటే భగవంతుని దర్శనం పొందిన వారు ఆ ఆనందానుభూతిని వదలి బయటకు రాలేరు.

ఇక్కడ మనం కొంచెం గమనిస్తే మనం విగ్రహాన్ని భగవంతుడని ఆరాధిస్తున్నాం కదా? మరి విగ్రహ దర్శనమవుతే భగవత్ దర్శనమయినట్లే కదా? మరి భగవత్ దర్శనమైనపుడు అక్కడ ఎక్కువ సేపు ఎందుకు వుండలేకపోతున్నాం? కారణం మనం నిజమైన భగవత్ దర్శనానుభూతి పొందలేకపోవడం వల్లే కదా?

నిజంగా విగ్రహమే భగవంతుడయితే? ఆయన దర్శనమయ్యాక, భగవంతుణ్ణి అంటే విగ్రహాన్ని వదిలి రాగలమా? వస్తున్నామంటే విగ్రహం భగవంతుడు కానట్లే కదా?

అందుచేత ఆత్మ రూపంలో వున్న చైతన్య స్వరూపుడైన భగవంతు డినే ఆరాధించాలి. అలా ఆరాధిస్తేనే మనకి సమస్త దుఃఖాలు శాశ్వతంగా నివారణవుతాయి.

మరి ఆత్మను ఆరాధించాలంటే ఒక్కటే మార్గం అదే “ఆనాపాన సతి ధ్యానం”. ధ్యానం చెయ్యడమంటేనే భగవంతుని ఆరాధించడం. అందు చేత “భగవంతుడు చైతన్య స్వరూపుడని” తెలుసుకుని ధ్యానం చేసి భగవత్ సాక్షాత్కారం పొందుదాం.

# "భగవంతుని శక్తి అపారం!"

అనంతమైన సృష్టిలోని కోటానుకోట్ల లోకాలలో కంటికి కనిపించే భౌతిక లోకాలూ ఉన్నాయి. కంటికి కనిపించని సూ= లోకాలూ ఉన్నాయి. ఒక రకంగా మన కంటితో చూడగలిగే భౌతిక లోకాలు అంటే భూమి, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు ఇవన్నీ కలిపి ఒక నీటి బొట్టు లాంటివి అంటారు. ఇంకా సృష్టిలో మనం చూడగలిగిన భౌతిక లోకాలు ఎన్ని వున్నాయంటే సముద్రమంత అంటారు.

అంటే నీటి బొట్టుకి, సముద్రానికి ఎంత తేడా వుందో తెలుసుకుంటే ఈ అనంతమైన సృష్టిలో ఎన్ని భూమండలాలు, ఎన్ని సూర్య గోళాలు, కోట్లానుకోట్ల గ్రహాలు విశ్వాలు వున్నాయో ఊహించుకోవచ్చు.

సృష్టిలో భౌతిక లోకాలే కాకుండా, కంటికి కనిపించని సూ=లోకాలుకూడా కోటానుకోట్లు ఉన్నాయి. అవి కనిపించే భౌతిక లోకాల కంటే మూడు రెట్లు వున్నాయం టారు. దీనిని బట్టి భగవంతునిచే సృష్టింపబడి, నడపబడుతున్న సృష్టి, మానవ మేధస్సుకు అందనిదని తెలుసుకోవచ్చు. అంటే భగవంతుని గూర్చి కానీ, భగవంతుని శక్తి గూర్చి కానీ మనం అర్థం చేసుకోలేమనే చెప్పాలి. అర్థం చేసుకోలేం కూడా.

ఇంత అద్భుతమైన అనంతమైన భగవంతుని సృష్టిలో అంటే కోట్ల, కోట్ల, కోట్ల, కోట్ల లోకాలలో అసలు భూమండలం ఉనికి ఎంత? అందులో ఒక ఖండం ఎంత? ఆలోచిస్తే అందులో ఒక దేశం ఎంత? అందులో ఒక రాష్ట్రం, అందులో ఒక జిల్లా అందులో ఒక మండలం దానిలో ఒక గ్రామం. ఆలోచిస్తే అందులో మన ఇల్లు, అందులో మనల్ని ఊహించుకుంటే, ఈ అనంతమైన సృష్టిలో మన ఉనికి ఎంత సూక్ష్మాతి సూ=మో ఆలోచించుకోవచ్చు.

మనం ఎన్నో అద్భుతాలను సృష్టిస్తున్నామని అనుకుంటున్నాం. అలా కార్లు, విమానాలు, రేడియోలు, టి.వి.లు, సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, అంతరిక్ష నౌకలు, రోబోట్లు ఇలా ఎన్నో మనం సృష్టించలిగాం. మరి ఇలా మనం సృష్టించినవే ఎన్నో అద్భుతాలు చేస్తుంటే, మరి అలాంటి మనల్ని సృష్టించగలిగిన భగవంతుని శక్తి ఎంతో ఊహించుకోవచ్చు.

ఆలోచించండి మనం ఎన్ని తయారు చేసినా ఏదీ శాశ్వతంగా ఉండదు. మనం గొప్పవనుకునేవన్నీ అశాశ్వతమైనవే అవుతున్నాయి. కానీ, భగవంతుని సృష్టి

శాశ్వతంగా కోట్ల సంవత్సరాల నుంచి పనిచేస్తూనే ఉంది.

భూమి తిరగటం, చంద్రుడు తిరగటం, రాత్రి, పగలు, ఋతువులు, యుగాలు, అలా కోట్ల లోకాలు పనిచేస్తున్నాయి. అంతేకాదు అసలు ఆలోచిస్తే సమస్త జీవులే కాదు. మానవ దేహమే ఒక అద్భుతమైన సృష్టి అని తెలుసుకోవచ్చు.

మనం చంద్రమండలానికి వెళ్ళగలిగాం. ఇది చెయ్యగలిగాం, అది సృష్టించగలిగామనుకుంటాం. అలాగే నాకు ఇన్ని తెలివితేటలున్నాయి, అది చేసాను. ఇది సాధించగలిగాను అని గర్వపడుతుంటాం. అంతే కాదు అది నాది, ఇది నాది అంటాం. అన్నీ నాకే తెలుసు, నేను సాధించలేనిదేదీ లేదనుకుంటాం.

కొంచెం ఆలోచించండి. ముసలితనం రాకుండా చేసుకోగలమా? యవ్వనాన్ని నిలబెట్టు కోగలమా? రోగాలు రాకుండా చేసుకోగలమా? చావును ఆపగలమా? అసలు జరిగిన సంఘటనలు మరచి పోగలమా? వర్తమానంలో జీవించగలమా? ఆకలి, దాహం లేకుండా చేసుకోగలమా? దుఃఖం లేకుండా జీవించగలమా? ఏ విషయంలోను భయపడకుండా ఉండ గలమా? ఎన్నో గొప్పవి సాధించ గలిగినపుడు ఇలాంటివి ఎందుకు సాధించలేకపోతున్నాం. ఎన్నో జయిం చామనుకున్న మనం కోపాన్ని జయించామా ? ఈర్ష్యా ద్వేషాల్ని జయిం చామా? కోరికల్ని జయించగలిగామా ? మనస్సును జయించామా?

అన్నీ చెయ్యగలమనుకుంటున్న మనం అసత్యాన్ని పలకకుండా ఎందుకు ఉండలేక పోతున్నాం? ఇతరులను, జంతువులను ఎందుకు హింసించకుండా ఉండలేకపోతున్నాం? రాగద్వేషాలు లేకుండా ఎందుకు జీవించలేకపోతున్నాం? అందరూ సమానమేనన్న భావన మనలో ఎందుకు కలగటం లేదు? ఉన్నదానితో ఎందుకు తృప్తిగా ఉండలేక పోతున్నాం? మనలో వున్న దుర్గుణాలను ఎందుకు తొలగించుకోలేక పోతున్నాం? కళ్లు మూసుకుని ధ్యానం ఎందుకు చెయ్యలేకపోతున్నాం?

ఈ చిన్న విషయాలే సాధించలేని మనం ఏదో చేశామని, సాధించామని మాకే అన్నీ తెలుసునని గర్వపడటం ఎంత అవివేకమో ఆలోచించాలి. ఇంత అల్పులైన మనం, ఊహించలేని అనంతమైన, సకల చరాచర సృష్టిని నడిపిస్తున్న భగవంతుని శక్తిని అర్థం చేసుకోగలమా?

మనం అంతటి శక్తిమంతుడైన భగవంతుని పూజా మందిరా నికో, ఆలయానికో, చర్చికో, మసీదుకో పరిమితం చేయడం చాలా అన్యాయం కాదా? అనంతమైన ఆయన శక్తి తెలుసుకోలేని మనం పూర్తిగా అజ్ఞానంలో వున్నట్లే

కదా?

అంతటి గొప్ప భగవంతుని చిన్న చిన్న పూజలతో, ప్రార్థనలతో, స్తోత్రాలతో వశం చేసుకోవచ్చుని, రెండు పళ్ళు, నాలుగు పూలతో ఆయన అనుగ్రహం పొందవచ్చుని భావించడం, అవివేకమే కదా?

కొంచెం ఆలోచిస్తే సామాన్యమైన మనమే భట్రాజు పొగడ్తలకు, చిన్న చిన్న ఆశలకు లొంగమే. మరి అంతటి శక్తివంతుడైన భగవంతుడు పొగడ్తలకు, ప్రార్థనలకు, పూజలకు, స్తోత్రాలకు ఎలా వశుడవుతాడు? అందుచేత భగవంతుని శక్తి అర్థం చేసుకోవాలి. దానికి తగ్గట్టు ప్రవర్తించాలి.

భగవంతుడెప్పుడూ ఆయన మెచ్చేట్టు ప్రవర్తించే వారికే ఆయన వశుడవుతాడు. వారినే అనుగ్రహిస్తాడు. ఆయన అనుగ్రహం కావాలనుకునే వారు ముందు సమస్తమూ ఆయనే అని తెలుసు కోవాలి. ఆయన సృష్టిని, సృష్టిలోని ఆయన రూపాలైన సాటి జీవుల్ని ప్రేమించాలి. వాటి మీద దయ, కరుణ చూపించాలి. మంచి గుణాలు కలిగి ఉండాలి. అంతే కాదు ఆయన లోకానికి మంచి చేయటం వల్ల మాత్రమే భగవంతుని అనుగ్రహం పొందగలం.

అందుచేత భగవంతుని సిద్ధాంతం అర్థం చేసుకోవాలి. పాపాలు చేయకూడదు. మనం కూడా భగవంతుని శక్తిలో భాగమే అని తెలుసుకోవాలి. మన వంతు సృష్టికర్త పాత్ర పోషించాలి. లోకాన్ని, ప్రకృతిని ప్రేమించాలి. ప్రకృతితో సహజీవనం చెయ్యాలి. అలా చేస్తే మనకి కూడా శక్తులు సమకూరుతూ ఉంటాయి. మెల్లిమెల్లిగా మనలో దివ్యత్వం చోటు చేసుకుని మనం కూడా భగవత్ స్వరూపులుగా మారతాం. అదే మానవ జీవిత లక్ష్యం.

ఇది సాధించాలన్నా భగవంతుని గూర్చి కానీ, భగవంతుని శక్తి గూర్చి కానీ తెలుసుకోవాలన్నా ధ్యానం చెయ్యవలసిందే. ధ్యానం చేస్తేనే అన్నీ తెలుసుకోగలం. అర్థం చేసుకోగలం. అందుచేత ప్రతీరోజూ ధ్యానం చేద్దాం.

# "భక్తి అంటే?"

ఏ పని చేసేటపుడు  దృష్టి భగవంతుని మీద వుంటుందో ఆ పనిని భక్తి అంటారు. ఏ పని చేసేటపుడు  దృష్టి భగవంతుని మీద వుండదో ఆ పనిని భక్తి అనరు.

సాధారణంగా పూజ చేసినా, భజన చేసినా, ప్రార్థన చేసినా, స్తోత్రాలు చదివినా, నామ జపం చేసినా భక్తి అంటాం. కారణం ఆ పని చేస్తున్నప్పుడు మన దృష్టి భగవంతుని మీద వుంటుంది కాబట్టి. టి.వి. చూస్తున్నా, ఆడుతున్నా, తింటున్నా, భక్తి అనం. కారణం యీ పనులు చేస్తున్నపుడు మన దృష్టి భగవంతుని మీద వుండదు కాబట్టి. అందుచేత భక్తికి సరైన నిర్వచనం "భగవంతుని మీద దృష్టి వుంచడం".

అలా  భగవంతుని మీద రకరకాలుగా దృష్టి వుంచి మన కోరికలు తీర్చమని వేడుకుంటాం. అంటే కష్టాలు తీరాలని, రోగాలు నయం కావాలని, దుఃఖం పోవాలని, సమస్యలు లేకుండా వుండాలని, ఇలా అనేక రకాల కోరికలతో దృష్టి భగవంతుని మీద ఉంచుతాం.

అలా భగవంతుని మీద ఉంచే దృష్టి అంతా కోరికల గురించే. అంటే భగవంతుని మీద దృష్టి పెట్టటానికి కారణం కోరికలే.  ఒక రకంగా చూస్తే బాహ్యంగా ప్రదర్శించే చర్యలు భగవంతుడి మీద; దృష్టి కోరికల మీద. అలాంటి వారి భక్తి "కోరికల భక్తి" అవుతుంది. అంతే కాని అది "భగవద్భక్తి" కాదు.

ఎవరైతే కోరికలు లేకుండా భగవంతుని మీద దృష్టి ఉంచుతారో వారిదే నిజమైన 'భక్తి' అవుతుంది. మనది 'భగవద్భక్తి' కాదు. కారణం "మనం భగవంతుని నుంచి కోరుతున్నాం. కానీ, భగవంతుని కోరటం లేదు".

మరి "నిజమైన భక్తి" ఏదంటే, సత్యమైన భగవంతుని మీద కోరిక లేకుండా దృష్టి వుంచడం. దానినే నిజమైన 'ఆరాధన' అంటారు. మరి సత్యమైన భగవంతుడు ఎవరు?  విగ్రహమా?  ఫొటోనా? రెండూ కాదు.

ఎందుచేతనంటే ఫోటో, విగ్రహం దేవుని ప్రతిరూపాలే కాని భగవంతుడు కాదు. గాంధీ గారి ఫోటో గాంధీ గారు అవ్వరు కదా?

మరి భగవంతుని మీద దృష్టి వుంచాలంటే భగవంతుడు ఎవరు? ఎక్కడ వుంటాడు? అంటే ఆయన అందరిలో ఆత్మ స్వరూపుడై వున్నాడని తెలుసుకున్నాం. అందుచేత ఆత్మ మీద దృష్టి వుంచితే సత్యమైన భగవంతుని మీద దృష్టి వుంచినట్లే.

మరి ఆత్మ ఎవరు? ఆత్మ అంటే మన స్వరూపమే. అందుచేత "ఆత్మ మీద అంటే మన స్వరూపం మీద దృష్టి వుంచితే అదే "నిజమైన భక్తి". అంటే మన "స్వరూపంతో అను సంధానమై వుండడమే  నిజమైన భక్తి".

ఆ మార్గమే "శ్వాసమీద ధ్యాస ధ్యానం"  అంటే "ధ్యానం చెయ్యడమే భక్తి". ధ్యానం ద్వారానే మన స్వరూపమైన ఆత్మతో వుండగలం. అందుకే ఉపనిషత్తులలో భక్తి అంటే "న్యస్వరూపాను సంధానం భక్తి రీత్య భిధీయతే" అని చెప్పబడింది.

అంటే ఏ కోరికా లేకుండా ఆత్మ మీద దృష్టి వుంచడమే "నిజమైన భక్తి". అంటే ఏమీ ఆశించకుండా ధ్యానం చెయ్యడమే "భక్తి". ఇదే గీతలో శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పిన "నిష్కామ కర్మ".

# "భక్తిలో రకాలు!"

భగవంతుని మీద ఇష్టం చూపించడమే భక్తి అనుకుంటాం. అలా మన ఇష్టాన్ని అనేక రకాలుగా ప్రదర్శిస్తూ మనమే భక్తులమనుకుంటాం. మనకు మించిన భక్తులు వేరెవరూ లేరని కూడా అనుకుంటాం. మనం ఏది చేస్తే అది, ఏది భావిస్తే అదే భక్తి అని అనుకుంటాం. అలాగే భగవంతుని గురించి మనకే అంతా తెలుసనుకుంటాం.

మనం ఎలా భావిస్తే భగవంతుడు అలాగే వుంటాడనుకుంటాం. మనం ఏది చేస్తే అదే భగవంతుడు మెచ్చుకుంటాడనుకుంటాం. అలా భగవంతుని విషయంలో మనకు నచ్చిన విధంగా మన ఇష్టానుసారం ఆరాధిస్తూ, పూజిస్తూ, ప్రార్థిస్తూ, భజనలు చేస్తూ, కీర్తిస్తూ అదే భగవంతుడు మెచ్చుకుంటాడు అని అనుకుంటూంటాం. అంతేకానీ అసలు మనం చేసే పని భగవంతుడు మెచ్చుతున్నాడా? లేదా? అని ఆలోచించం.

మనల్ని మనం భక్తుడని అనుకుంటే సరిపోదు. "వీడు నా భక్తుడు అని భగవంతుడు అనుకోవాలి". అలా భగవంతుడు ఎవరిని భక్తుడుగా భావిస్తాడో, వాడే నిజమైన భక్తుడు. వానికే ఆయన అనుగ్రహం లభిస్తుంది. అలాంటి వాని జీవితమే ధన్యం. వాడే చివరకు మోక్షాన్ని పొందగలడు.

ప్రస్తుతం "అందరికీ భగవంతుడున్నాడు కానీ, భగవంతునికే భక్తులు లేరు". మరి భగవంతుని దృష్టిలో భక్తులు అంటే ఎవరో? భక్తి అంటే ఏమిటో? తెలుసుకుందాం.

భక్తిలో రెండు రకాలు వున్నాయి. (1) భుక్తి కోసం భక్తి, (2) ముక్తి కోసం భక్తి. ప్రపంచంలో ఎక్కువ మంది మొదటి రకం భక్తులే.

'భుక్తి కోసం భక్తి, అంటే కోరికల కోసం భగవంతుని ఆరాధించడం. అంటే మన అవసరాలు, సుఖాలు, భోగాలు పొందడం కోసం, కోరికలు, కష్టాలు, సమస్యలు, బాధలు, ఇబ్బందులు తీరడం కోసం ఆరాధించడం. ఇలాంటి వారు తమ కోరికలు నెరవేరకపోయినా, తాము అనుకున్నది జరగకపోయినా, తాము కోరింది భగవంతుడు ఇవ్వలేదని ఆ భగవంతుని ఫోటో మార్చేసి ఇంకో ఫోటో పెడతారు. ఇంకా మతాలు కూడా మారుస్తారు. దీనిని బట్టి చూస్తే వీరి భక్తి కోరికల మీదే కానీ భగవంతుని మీద కాదని తెలుస్తుంది. అందుచేత ఇలాంటి కోరికల భక్తిని 'భుక్తి కోసం భక్తి' అంటారు.

ఇక రెండవ రకం భక్తులు అతి కొద్ది మంది మాత్రమే వుంటారు. వీరికి కోరికలు ప్రధానం కాదు. వీరి తపన, ఆవేదన ఎంతసేపూ భగవంతుని దర్శించాలని, భగవంతుని చేరుకోవాలని, ఈ దుఃఖమయ జీవితం నుంచి శాశ్వతంగా బయటపడాలనే వీరు కాంక్షిస్తారు.

వీరు ఏ కోరికలు కోరరు. వీరికి ఏ ఆశలు వుండవు. ఏ తాపత్రయం ఉండదు. ఎంతసేపూ భగవంతుని పొందాలనే వీరి తపన. అందుచేత వీరు తమ

లక్ష్యాన్ని సాధించే వరకు వారి జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా లెఖ్క చెయ్యరు. ఎన్ని బాధలైనా సంతోషంగా అనుభవిస్తారు. ధనం, సంపదలు, భోగభాగ్యాలు, శారీరక సుఖాలు, పేరు ప్రఖ్యాతులు, పదవులు అన్నింటినీ, గడ్డిపరకతో సమానంగా చూస్తారు. వీరు భగవంతుని నుంచి ఏమీ ఆశించరు, కోరరు. ఎంతసేపూ ఆ భగవంతుని దర్శనం 'అంటే ఆత్మ దర్శనం' కోసం అంటే ఆత్మ సాక్షాత్కారం కోసం అహర్నిశలు తపిస్తారు. ధ్యాన సాధన చేస్తారు.

ఇలాంటి వారి యొక్క భక్తిని పరీక్షించడం కోసం భగవంతుడు ఎన్ని కష్టాలు పెట్టినా, ఎన్ని సమస్యలు సృష్టించినా, ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా, అంటే డబ్బు, స్త్రీ, పదవి, పేరు, అధికారం, ఐశ్వర్యం లాంటివెన్ని ఆశ చూపినా, వారు చలించరు. చివరకు అన్ని పరీక్షలలో విజయం సాధించి భగవంతుని దర్శనం పొంది, అంటే ఆత్మను సాక్షాత్కరించుకుని ముక్తులవుతారు.

ఇలా ఏ కోరికా లేకుండా అంటే ప్రతిఫలాపేక్ష లేకుండా ఎవరైతే భగవంతుని ఆరాధిస్తారో, భగవంతుని మీద ఇష్టం చూపిస్తారో వారిదే నిజమైన భక్తి. వారినే భగవంతుడు భక్తుడిగా స్వీకరిస్తాడు. అనుగ్రహిస్తాడు. దీనినే ముక్తి కోసం భక్తి అంటారు. ఇదే నిజమైన భక్తి,

ఇలాంటి భక్తులను మనం పురాణాల్లో ఎంతోమందిని చూశాం. వారిలో ప్రహ్లాదుడు, ధృవుడు, మార్కండేయుడు, అంబరీషుడు, తుకారాం, అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు, పోతన లాంటి వారంతా ఇలాంటి వారే. వీరంతా కోరికలతో భగవంతుని మీద భక్తి ప్రదర్శించిన వారు కాదు. ఎందుచేతనంటే వారు భగవంతుళ్ళను మార్చలేదు. వారి లక్ష్యాన్ని సాధించటానికి ఎలాంటి కష్టాలనైనా లెఖ్క చేయకుండా, ఏమీ ఆశించకుండా ఆ భగవంతుని మీదే విశ్వాసం వుంచి తమ నిజమైన భక్తిని ప్రదర్శించారు.

అలా ఏమీ ఆశించకుండా ఆ భగవంతుని నిజ రూపమైన ఆత్మ మీద దృష్టి వుంచిన వారే నిజమైన భక్తులు. మరి అలా నిజమైన భక్తుడు కావాలంటే ఒక్కటే మార్గం అదే ధ్యానం. "ధ్యానం చెయ్యడమంటే మనస్సును శూన్యం చేసి భగవంతుని స్వరూపమైన ఆత్మ మీద దృష్టి వుంచడం". దీనినే సరియైన భక్తి అంటారు. "ముక్తి కోసం భక్తి" అంటారు. మిగిలిన వారంతా కోరికల భక్తులు కాని భగవంతుని భక్తులు కాదు.

అందుచేత 'నిజమైన భక్తులు' కావాలి. ముక్తిని పొందాలి. ధ్యానం చెయ్యాలి. "ఆశించని భక్తి వల్లే ముక్తి సాధ్యమని తెలుసుకోవాలి".

# "నిజమైన భక్తులు"

మనం ఎన్నో కోరికలతో భగవంతుని మీద దృష్టి వుంచుతాం. అంటే కోరికల గురించే భగవంతుని మీద దృష్టి వుంచుతున్నాం. అంటే వాస్తవానికి మన దృష్టి కోరికల మీదే కానీ భగవంతుని మీద కాదు.

కానీ భక్తి అంటే భగవంతుని మీద దృష్టి వుంచడం. అలాంటపుడు కోరికల మీద దృష్టి ఉంచినది భక్తి ఎలా అవుతుంది? అందుచేత కోరికలుంటే భక్తి కాదు, కోరికలు లేని భక్తే నిజమైన భక్తి. గీతలో శ్రీ కృష్ణ భగవానుడు ఈ విషయమే చెప్పారు. ఏ పని చేసినా ప్రతిఫలాపేక్ష లేకుండా చెయ్యమన్నారు. "నిష్కామ కర్మ" చెయ్యమన్నారు.

ఎవరైనా మన ఇంటికి వచ్చి ఏమైనా కోరితే వారిని యాచకుడు అంటాం. అంతేకాని కోరుకునే వాడు, అర్ధించేవాడు, అభ్యర్ధించేవాడని అనం. అంతేకాదు వారిని చాలా తక్కువగా, చులకనగా చూస్తాం.

అలాగే మనం భగవంతుడ్ని కోరుకుంటున్నా మనుకుంటున్నాం. కానీ, కోరే వారంతా యాచించేవారే. అలా భగవంతుడ్ని యాచించడం తప్పేమిటని అనుకుంటాం. కానీ "మనల్ని యాచించే మన క్రింది వారిని మనం ఎలా భావిస్తే, మన పైవాడు కూడా మనల్ని అలాగే భావిస్తాడు" అంటే మనల్ని యాచించేవారు మన దృష్టిలో ఎలా చూడబడతారో? భగవంతుని యాచించే వారు కూడా ఆయన దృష్టిలో అలాగే చూడబడతారు.

భగవంతుడు మనకు డబ్బు, సంపదలు, మేధస్సు, శక్తి అన్నీ ఇచ్చినా ఇంకా ఆయన్ను కోరుతుంటే ఆయన ఏమనుకుంటాడు? ఈ విషయం మనం ఆలోచించడం లేదు. ఎందుచేతనంటే మనం కష్టపడటానికి ఇష్టపడం. ఏ కష్టం లేకుండా అన్నీ పొందాలనుకుంటాం.

అంతేకాదు భగవంతుడు ఇచ్చిన వాటిని సరైన రీతిలో ఉపయోగించకుండా, ఇచ్చిన వాటితో తృప్తి చెందక, ఏది చెయ్యకూడదో అది చేస్తూ, ఏది కోరాలో తెలియక, ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించక, ఏ మార్గంలో నడవాలో ఆ మార్గంలో నడవక, ఇచ్చిన వాటిని దుర్వినియోగం చేస్తూ, జీవితాన్ని దుఃఖమయం చేసుకుని, చివరకు ఏమి చెయ్యాలో తెలియక, యాచకులుగా మారుతున్నాం. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితి ఇలా వుంది.

ఈ మధ్య ప్రపంచంలో భక్తి పెరిగిందను కుంటున్నారు. కానీ గమనిస్తే ప్రపంచంలో భక్తి పెరగలేదు. భక్తులు పెరగలేదు. పెరిగింది యాచకులు. గమనిస్తే భగవంతుని కోరకుండా ఆరాధించేవారు చాలా తక్కువ.

అలా యాచించే పనినే మనం భక్తి అని అనుకుంటున్నాం. కాని యాచన వేరు. భక్తి వేరు. ఎందుకంటే "భగవదారాధన నుండి కోరిక తీసివేస్తేనే భక్తి" అవుతుంది. అంతే కానీ కోరిక వుంటే అది యాచనే" అవుతుంది. ఈ పనిని పవిత్రమైనదిగా భావిస్తూ, ఎంతో గొప్పవారమని పొంగి పోతున్నాం. కానీ, మనం సర్వశక్తివంతులై వుండి, సమస్తమూ సాధించగల వారమై వుండి కూడా ఈ విషయం ఆలోచించడం లేదు.

తిండిలేనివారు, ఏమీలేనివారు కోరితే అర్థముంది కానీ అన్నీ ఉన్నవారు కోరడమే విచిత్రం. ఏమీ లేని వారు తిండి కోసం కోరతారు. కానీ అన్నీ వున్నవారు అత్యాశతో కోరుతుంటారు.

కొంచెం ఈ విషయం ఆలోచించాలి. మనం ఏదైనా ఆలయానికి వెళ్ళినపుడు బయట ముష్టివాళ్ళకు కొన్ని పైసలు వేస్తాం. అలా వేసి దానం చేశాం అని అనుకుంటూ పొంగిపోతాం. ఆ ముష్టివాళ్ళు కూడా మనం ఆలయంలో ఏదో గొప్ప పని చెయ్యటానికి వెళ్తున్నాం అని అనుకుంటారు. కానీ, వారు బయట ఏ పని చేస్తున్నారో లోపలికి వెళ్ళి మనం కూడా, అదే పని చేస్తున్నామన్న సంగతి వారికి తెలియదు. ఎందుచేతనంటే మనం కట్టుకున్న పట్టు చీరలు, సూటు, కోటు, వస్తువులు అలంకారాలు చూసి మనం గొప్పవారమని వారు అనుకుంటారు.

ఆలోచిస్తే యాచించడమన్నది విశేషమైన పనీకాదు. గొప్ప పనీ కాదు. అన్నీ వున్న మనం, అత్యాశతో చేసే పనికి భక్తి అనే పవిత్రమైన పదాన్ని జోడించి, భక్తులమని పొంగిపోతున్నాం. కానీ "ఎంత ఉన్నా సంతృప్తి చెందని వారు యాచకులుగా మారవలసిందే".

మనం ఎంతసేపూ "భగవంతుని నుంచి కోరుతున్నాం కానీ భగవంతుని కోరడం లేదు" భగవంతుని కోరేవారంటేనే భగవంతుడు ఇష్టపడతాడు. అంతే కానీ ఆయన్నుంచి అన్నీ కోరే వారిని, ఫోటోలు మార్చే వారిని ఆయన ఎలా ఇష్టపడతాడు?

భగవంతునికి "నిజమైన భక్తులుగా" కావాలంటే, కోరకుండా ఆరాధించాలి. నిష్కామంగా ఆరాధించాలి. అలా కోరికలు లేకుండా ఆరాధించాలంటే కోరికలకు మూలమైన మనస్సును జయించాలి. మనస్సును జయించాలంటే "శ్వాస మీద ధ్యాస" వుంచి ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తే కోరికలు జయించి భగవంతునికి నిజమైన భక్తులు కాగలం. అందుచేత ఆలయాలను ధ్యాన కేంద్రాలుగా మారుద్దాం. పవిత్రమైన ధ్యానం చెయ్యటానికి ఆలయాలను, మందిరాలను ఉపయోగిద్దాం. నిజమైన భక్తి కేంద్రాలుగా మారుద్దాం. మనం కూడా "నిజమైన భక్తులవుదాం.

# ఎవరు నిజమైన భక్తుడు?

మనం భగవంతుని భక్తులమని భావిస్తాం. భక్తులమనుకుంటాం కానీ, భక్తులమని చెప్పుకునే ముందు అసలు మనకి భగవంతుడంటే ఇష్టమేనా? అని ఆలోచించాలి. అంటే మన ప్రవర్తన భగవంతుడంటే ఇష్టమన్నట్టుగా వుందా? లేదా? నిజంగా మన ప్రవర్తన, ఆయనంటే ఇష్టమన్నట్టుగా వుంటేనే భగవంతుడంటే మనకి ఇష్టమున్నట్టు. కానీ మన ప్రవర్తన అందుకు భిన్నంగా వుంటే భగవంతుడు మనకి ఎలా ఇష్టుడైనట్టు? మనకి ఇష్టం లేని భగవంతుడికి మనం భక్తులెలా అవుతాం? నేను ఆయన భక్తుడు అని వూరికే అనుకుంటే సరిపోదు. చెప్పుకున్నా ప్రయోజనం లేదు.

ఎందుకంటే భగవంతుని మీద స్వార్థంతో కూడిన ఇష్టం నిజమైన ఇష్టం కాదు. "నిస్వార్థమైన, నిష్కామమైన ఇష్టమే నిజమైన ఇష్టం". అదే నిజమైన భక్తి. ఇష్టం చూపించడం అంటే కానుకలు సమర్పించడం కాదు. ప్రవర్తనలో చూపించాలి. భగవంతుని అవగాహన చేసుకుని ప్రతీ విషయంలో, ప్రతీ పనిలో, ప్రతీక్షణం, ప్రతీ మాటలో, ప్రవర్తనలో భగవంతుని మీద ఇష్టం చూపించాలి. అప్పుడు భగవంతుని మీద ఇష్టం వున్నట్టు.

చేతలు లేకుండా మాటలు వుంటే లాభం లేదు. మాటల కంటే చేతలు ముఖ్యం. మనం మాటలకు ప్రాముఖ్యం ఇస్తే, భగవంతుడు చేతలకు ప్రాముఖ్యం ఇస్తాడు. అంతే కాదు భగవంతుడు కానుకలకు ప్రాముఖ్యం ఇవ్వడు. ఎందుచేతనంటే భూమి మీద సమస్త సంపదలే కాదు సృష్టిలోని సమస్త లోకాలు ఆయనవే. ఆ సమస్త లోకాలలోని సమస్త సంపదలు ఆయనవే. వాటి ముందు మనం ఇచ్చే కానుకలు ఏ పాటివి?

మరిచేతలు, ప్రవర్తన ముఖ్యం కాబట్టి భగవంతుని పట్ల మన చేతలు ఎలా వుండాలి? మనం ఎలా ప్రవర్తించాలి? అన్నది తెలుసుకోవాలి. దానికంటే ముందు అసలు భగవంతుడంటే ఎవరో తెలుసుకోవాలి. ఆయనను అవగాహన చేసుకోవాలి.

ఈ సకల చరాచర సృష్టిని సృష్టించింది భగవంతుడే. సృష్టి ఆది నుంచీ, కల్పాల ఆది నుంచి ఏ శక్తి అయితే నిరంతరాయంగా, అవినాశ్యంగా, ప్రకాశిస్తూ వస్తుందో ఆ అతీత శక్తే భగవంతుడు. ఆయనే సృష్టికర్త. ఆయన గురించి వర్ణించాలంటే ఎవరికీ సాధ్యం కాదు.

భగవంతుడు సర్వాంతర్యామి. అంటే అన్నీ తానై ఉన్నవాడు. అంటే

సమస్త మానవులే కాదు, భూమి మీద సమస్త జీవులూ ఆయన రూపాలే. ఇది అర్థం చేసుకుని ఆయన సృష్టిని ప్రేమించాలి, గౌరవించాలి, సమభావంతో చూడాలి.

మరి అన్నీ ఆయనే అయినపుడు ఆయన కానిది లేనిది లేనపుడు సాటి మానవులను వేరే కుటుంబమని, కులమని తక్కువగా చులకనగా చూడకూడదు. వేరే మతమని ద్వేషించకూడదు. వేరే దేశమని యుద్ధాలు చేయకూడదు. మన స్వార్థం కోసం భగవత్ స్వరూపులైన ఇతర మానవులను మోసగించకూడదు. అవమానించకూడదు. బాధించకూడదు. చులకనగా చూడకూడదు. నష్టాన్ని కలిగించకూడదు. మనం ఎవరికి ఏమి చేసినా అది భగవంతునికి చేసినట్టే అవుతుంది. ఇతరులకు ఏ కష్టం కలిగించినా భగవంతునికి కష్టం కలిగించినట్టే. ఇష్టమైన భగవంతునికి కష్టం కలిగించకూడదు.

అంతే కాదు భగవత్ స్వరూపాలైన సాటి అమాయక జీవులను హింసించకూడదు? వాటి మాంసాన్ని భక్షించకూడదు? ఏ జీవిని హింసించినా భగవంతుని హింసించినట్లే గదా? మరి భగవంతుడంటే ఇష్టమైనపుడు ఆయనను ఎలా హింసించగలం? ఇష్టమైన వారిని ఎవరైనా హింసించగలరా? హింసిస్తూ వారంటే ఇష్టమని అనగలమా?

మరి మాటల్లో భగవంతుడంటే ఇష్టమని చెప్పి చేతల్లో హింసిస్తున్నాం. అలా భగవంతుని రూపాల పట్ల నిర్దయగా ప్రవర్తిస్తే భగవంతుడంటే ఇష్టం లేనట్లే కదా? తనకు ఇష్టం లేని భగవంతునికి తాను భక్తుడు ఎలా అవుతాడు? మరి నిజంగా ఇష్టముంటే భగవంతుని పట్ల అలా ప్రవర్తించం కదా? భగవంతుని పట్ల అలా ప్రవర్తించేవాడు భగవంతునికి ఇష్టుడు ఎలా అవుతాడు? భగవంతునికి ఇష్టుడు కాని వాడు భగవంతునికి భక్తుడు ఎలా అవుతాడు? అలాంటి వాడు భగవంతునికి భక్తుడూ కాదు, వాడిది భక్తి కాదు.

గీతలో "అద్వేష్టా సర్వభూతానాం" అంటే "ఏ ప్రాణిని ద్వేషించని వాడు నాకు భక్తుడు, అత్యంత ప్రియుడ"వుతాడు అని శ్రీ కృష్ణ పరమాత్మ చెప్పారు.

అందుచేత ఎవరైతే జీవహింస చెయ్యరో, సమస్త మానవులను, జీవులను తమతో సమానంగా ప్రేమిస్తారో, తమ బాధ లాంటిదే ఇతర జీవుల బాధ అని తెలుసుకుంటారో? తమలాగే అవి కూడా ఆనందంగా వుండాలని కోరుకుంటారో వారే భగవంతునికి నిజమైన భక్తులు.

సృష్టిలోని సమస్త జీవులు భగవంతుని రూపాలేనని తెలుసుకోవాలన్నా? భగవంతునికి 'నిజమైన భక్తుడు' కావాలన్నా? ఒక్కటే మార్గం అదే "ఆనాపానసతి ధ్యానం". ధ్యానం చేస్తే అన్ని సత్యాలు తెలుసుకుంటాం.

# "దేవుళ్ళంతా దారి చూపించటానికే వచ్చారు!"

దేవుడు శక్తి స్వరూపుడు, దయా మయుడు, కరుణామయుడు అందుచేత ఆయనను పూజించినా, భజనలు చేసినా, ప్రార్థించినా నమాజు చేసినా కష్టాలు తీరుస్తాడని, దుఃఖాలను తొలగిస్తాడని భావిస్తారు. ఇదే అభిప్రాయం ఎన్నో తరాల నుండి అందరిలో ఉంది. అందుచేత పూజ, ప్రార్ధన, నమాజు, భజనల ద్వారా దేవుని ప్రసన్నుడిని చేసుకుని కోరికలు నెరవేర్చుకోవచ్చునుకుంటారు. అదే చేస్తున్నారు. ఆ నమ్మకంతోనే ఉన్నారు. అంతకంటే ఆలోచించటం లేదు.

కానీ మనం ఆరాధించే దేవుళ్ళంతా మన కష్టాలు తీర్చటానికి రాలేదు, వారు మన కష్టాలను తొలగించుకునే మార్గాన్ని చూపించటానికి వచ్చారని తెలుసుకోవాలి.

మనం అశాంతితో, అంతులేని దుఃఖాలతో బాధపడుతూ వాటి నుండి బయటపడలేక, దిక్కు తోచని స్థితిలో ఉన్నప్పుడు మనల్ని ఉద్ధరించటానికి, మన దుఃఖాల్ని నివారించుకునే దారి చూపించటానికి, అవసరాన్ని బట్టి ఒక్కొక్క ప్రాంతంలో, అక్కడి పరిస్థితులను బట్టి, ఒక్కొక్క రూపంలో భగవంతుడు అవతరిస్తున్నాడు.

దారి తప్పి ఏం చెయ్యాలో తెలియని స్థితిలో ఉన్న మనల్ని సరైన మార్గంలో నడిపించటానికి వస్తున్నాడు. అంతే కాదు, మనం ఎలా జీవించాలో తాను స్వయంగా ఆచరించి చూపిస్తున్నాడు. మానవ జీవితం యొక్క గొప్పతనాన్ని చెప్తూ, మానవుడు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు అని స్వయంగా తన జీవితం ద్వారా మనకు భోధిస్తున్నాడు. తాను ఆదర్శప్రాయుడుగా నిలుస్తున్నాడు. అలా తాను చేయవలసిన కార్యం పూర్తి కాగానే తన అవతారం చాలిస్తున్నాడు. ఇలా యుగయుగాల నుంచి భగవంతుడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రూపాల్లో రావటం మనం గమనిస్తూనే ఉన్నాం.

అలా వచ్చిన దేవుళ్ళంతా తమకున్న శక్తితో ఎన్నో మహత్యాలు చూపిస్తూ, మనకు ఎన్నో బోధలు చేస్తున్నారు. కానీ మనం వారి శక్తులు చూస్తున్నామే గానీ వారి బోధలు అర్థం చేసుకోవడం లేదు. వారు శక్తివంతులు కాబట్టి వారిని ఆరాధిస్తే, కష్టాలు తీరుతాయని భావిస్తున్నాం. కానీ వారు భోధించిన విషయాలు ఆచరిస్తే ఈ జన్మలో అనుభవిస్తున్న దుఃఖాలే కాదు, శాశ్వతంగా దుఃఖం నుంచి బయటపడగలమని గ్రహించలేకపోతున్నాం. ఎంతసేపూ "వారి

పాదాలు పూజిస్తున్నాం కానీ, వారి పదాలు పట్టుకోవడం లేదు". "వారిని భజనలు, స్తోత్రాల ద్వారా ఆరాధిస్తున్నాం కానీ, ఆదర్శంగా తీసుకోవడం లేదు". "వారిని ప్రార్థిస్తున్నాం కానీ, పాపాలు తొలగించుకునే ప్రయత్నం చెయ్యడం లేదు". "శక్తి హీనులమని, అల్పులమని భావిస్తున్నాం కానీ, మనకున్న శక్తితో సాధన చేస్తే కోరుకున్నవి, సాధించగలమని తెలుసుకోలేకపోతున్నాం.

గమనిస్తే యుగయుగాల నుంచి దేవుళ్లు వచ్చి వెళ్తున్నా మన స్థితి గతులు మెరుగు పడటం లేదు. మన దుఃఖం పూర్తిగా నివారణ కావట్లేదు.

శ్రీరామచంద్రుడు వచ్చి వెళ్ళిన తరువాత, త్రేతాయుగం అంతమై, ద్వాపర యుగం వచ్చింది. అలాగే శ్రీ కృష్ణ భగవానుడు వచ్చి వెళ్ళిన తరువాత, ద్వాపర యుగం అంతమై కలియుగం వచ్చింది అలా దేవుళ్ళు వచ్చి వెళ్ళినా, మన జీవితాలు ఇంకా స్వార్థ పూరితమై ఇంకా ఇంకా దుఃఖ భూయిష్టమవుతున్నాయి. కలియుగ ప్రవేశం తరువాత బుద్ధ భగవానుడు, జీసస్ క్రైస్ట్, మహమ్మద్, గురు నానక్, మహావీరుడు, రామకృష్ణపరమహంస, రమణ మహర్షి, సత్యసాయిబాబా ఇలా ఎంతోమంది వచ్చినా దు:ఖం పెరుగుతూనే ఉంది కానీ, దుఃఖం నుండి విముక్తి పొందలేకపోతున్నాం.

దీనికి ముఖ్య కారణం ఆ దేవుళ్ళంతా బోధించేది ఒకటి. మనం చేసేది ఇంకొకటి. మనం వారు చెప్పింది ఆచరించకుండా వారిని ఆరాధించటానికే అలవాటుపడ్డాం. అందువల్ల దుఃఖం నుండి పూర్తిగా నివారణ పొందలేక శాంతిగా జీవించలేక పోతున్నాం.

ఆలోచిస్తే భూలోకంలో ఏ దేవుడూ మానవుల దుఃఖాలను తొలగించలేదు. దుఃఖాలను తట్టుకునే మార్గం, దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడే మార్గాలను మాత్రమే బోధించి వెళ్ళారు.

అందరిలాగే ప్రస్తుతం బ్రహ్మర్షి పత్రి గారు మన రోగాలు, దుఃఖం నివారించుకొనే మార్గమైన ధ్యాన సాధన బోధిస్తున్నారు. ఈ ధ్యాన సాధన ద్వారా తాత్కాలికంగానే కాదు, శాశ్వతంగా దుఃఖం నివారించుకోగలుగుతాం. ముక్తిని పొందుతాం.

# "ఎదగాలంటే క్రిందిస్థాయి వదలాలి"

మానవులంతా చూడటానికి  ఒకేలా వున్నా ఒక్కొక్కరు ఒకో జన్మలో వుంటారు. కొందరు 50 జన్మలలో వుంటే, ఇంకొందరు 100 జన్మలలో వుంటారు. అలాగే ఇంకా ఎక్కువ జన్మలలోను వున్నవారు కూడా వుంటారు. అలా ప్రాథమిక జన్మలలో వున్న వారి ఆత్మ స్థాయిని శైశవాత్మ  అంటారు. వీరు భగవంతుడు లేడంటారు, వుంటే చూపించు అని వాదిస్తూంటారు. పూజలు చేయరు.

ఇలాంటి వారిని అప్పుడే జన్మించిన చంటి పిల్లవాని దశ అనవచ్చు. అవగాహన కోసం చదువు విషయంలో ఇంకా విద్య ప్రారంభించని  వారిగా భావించవచ్చు. వీరిది 'మూలాధార చక్రస్థాయి'. ఈ స్థితిలో వీరి ప్రవర్తన అలాగే వుంటుంది. అది వారి దోషం కాదు. అది వారి జన్మస్థితి.

ది ది ది

అలా కొన్ని  జన్మలు తీసుకున్న తరువాత (అంటే దీనికి ప్రత్యేకించి ఇన్ని జన్మలు అని వుండవు.) వీరి ఆత్మస్థాయి పెరుగుతుంది. ఆ జన్మలలో కొన్ని పాఠాలు నేర్చుకుంటారు, జీవితంలో ఎన్నో కష్టసుఖాలు అనుభవిస్తారు. అందరినీ చూస్తారు. అన్నీ గమని స్తూంటారు. అనుభవాలు సంపాదిస్తారు. కొంచెం ఎదుగుతారు. ఏదో శక్తి ఇదంతా నడిపిస్తుందని భావిస్తారు. ఆ శక్తే దేవుడు అని అనుకుంటారు. అందుచేత ఈ స్థితిలో దేవుడున్నాడని అంటారు. కానీ తాను నమ్మిన వాడే దేవుడు, ఇంకెవరూ దేవుళ్ళు కారు అని అంటారు.

ఇక్కడ వీరి ఆత్మ స్థాయిని 'బాలాత్మ' అని అంటారు. దేవుడున్నాడని నమ్ముతున్నారు కాబట్టి వీరు పూజలు, భజనలు, ప్రార్థనలు చేస్తారు. ఇలాంటి వారిని ఎదిగే పిల్లవాని పాకేదశ అని అనవచ్చు. విద్య విషయానికి వస్తే ప్రాథమిక చదువులో ప్రవేశించిన వారిగా భావించవచ్చు. వీరిది స్వాధిష్టాన చక్రస్థాయి.

ది ది ది

అలా ఇంకా కొన్ని జన్మలు తీసుకున్న తరువాత ఇంకా అనుభవం సంపాదించి ఈ సృష్టినంతా ఒకే శక్తి నడిపిస్తుంది, రూపాలు వేరైనా దేవుడు ఒక్కడే అని తెలుసుకుంటారు. అందుచేత అందరు దేవుళ్ళు ఒక్కటే అంటారు.

ఇక్కడ వీరి ఆత్మస్థాయిని 'యువాత్మ' అని అంటారు. ఈ స్థితిలో వీరు దేవుని స్తోత్రాలు చేస్తూంటారు. ఎదిగే పిల్లవాని తప్పటడుగులు వేసే దశ. విద్యలో

హైస్కూలు చదువులో ఉన్న వారిగా భావించవచ్చు. వీరిది 'మణిపూరక చక్రస్థాయి'.

ద ద ద

ఇంకా, ఇంకా చాలా జన్మలు తీసుకున్న తరువాత దేవుడు ఎక్కడో లేడు నాలోనే ఉన్నాడు. ఆత్మ స్వరూపుడై ఉన్నాడు అని పుస్తకాల ద్వారా, వేదాంతుల ద్వారా, పెద్దల ద్వారా తెలుసుకుంటారు.

వీరి ఆత్మస్థాయిని 'ప్రౌఢాత్మ' అని అంటారు. ఈ స్థితిలో నామాన్ని, మంత్రాన్ని జపిస్తూంటారు. ఎదిగే పిల్లవాడు బాగా నడిచే దశ. విద్యలో జూనియర్ కాలేజీ స్థాయిలో వున్న వారిగా భావించవచ్చు. వీరిది 'అనాహత చక్రస్థాయి'.

ద ద ద

అలా ఇంకా కొన్ని జన్మలు తీసుకున్న తరువాత తనలో ఉన్న భగవంతుని అంటే ఆత్మను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు.

వీరి ఆత్మస్థాయిని 'వృద్ధాత్మ' అని అంటారు. ఈ స్థితిలో ధ్యానం ప్రారంభిస్తారు. ఎదిగే పిల్లవాడు పరుగు పెట్టే దశ. విద్యలో కాలేజీ స్థాయిలో వున్నవారిగా భావించవచ్చు. వీరిది 'విశుద్ధ చక్రస్థాయి'.

ద ద ద

ఇంకా కొన్ని జన్మల తరువాత భగవంతుడు నాలోనే ఉన్నాడు అన్న స్థితి నుంచి ఆ భగవంతుడ్ని నేనే అంటే "అహం బ్రహ్మోస్మి" అని అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. వీరి ఆత్మ స్థాయిని 'విముక్తాత్మ' అంటారు. జ్ఞానులవుతారు.

అన్ని పనులు చేయగలిగిన బాలుని దశ, విద్యలో పోస్టు గ్రాడ్యుయేట్‌కు ఎదిగిన వారిగా భావించవచ్చు. వీరిది 'ఆజ్ఞా చక్రస్థాయి'.

ద ద ద

అలా చివరి జన్మకు చేరుకుంటారు, బ్రహ్మజ్ఞానులవుతారు. సకల చరాచర సృష్టి గురించి పూర్తిగా తెలుసుకుంటారు. 'పూర్ణాత్మ' స్థాయికి చేరుకుంటారు. దివ్య దృష్టి సంపాదిస్తారు. త్రికాల జ్ఞానులవుతారు. అన్నీ తానే, అంతా తానే అని తెలుసుకుంటారు.

విద్యలో పిహెచ్‌డి సంపాదించిన వారిగా భావించవచ్చు. 'సహస్రార స్థితికి' చేరుకున్నవారు. అన్ని రకాల పనులు పూర్తి నైపుణ్యంతో చేయగల్గిన యువకుని దశ అనవచ్చు.

ద ద ద

ఇలా ప్రతీ ఒక్కరు జన్మలు పెరిగే కొద్దీ మొదట దేవుడు వున్నాడని,

తరువాత తాను నమ్మిన వాడే దేవుడని, తర్వాత దేవుళ్ళంతా ఒక్కటేనని, ఆ తర్వాత దేవుడు ఎక్కడో లేడు, తనలోనే వున్నాడంటూ, తనలో వున్న ఆత్మే భగవంతుడిని చివరకు భగవంతుడు తానే అని తెలుసుకుంటారు. అంతా ఒకటే అని కూడా తెలుసుకుంటారు.

ධ ධ ධ

అలా ఆత్మస్థాయి పెరిగే కొద్దీ అసలు పూజలు చేయనివారు, మెల్లమెల్లగా పూజలు చేస్తూ, స్తోత్రాలు చదువుతూ, తరువాత జపం చేస్తూ, చివరికి ధ్యానంలోకి వస్తారు. ధ్యానం చేస్తూ దివ్య దృష్టి సంపాదించుకుని దేవుడిగా మారతారు.

ධ ධ ධ

ఇక్కడ మనం ఆలోచించవలసింది మన ఆత్మస్థాయి పెరిగే కొద్దీ క్రింది స్థాయి వదలాలి. చంటిపిల్లవాడు నడక వచ్చినపుడు పాకటం మాని పైకి లేచి నడుస్తాడు. అంతే కాని పాకుతూ వుండడు. అలా 15 ఏళ్ళ వయస్సు వచ్చినా పాకే వాడిని అందరూ హేళన చేస్తారు.

కాలేజీకి వెళ్ళే వాడు కాలేజీ పుస్తకాలు మానేసి హైస్కూలు పుస్తకాలే చదువుతూ కూర్చోడు. అలా చదివితే కాలేజీ చదువురాదు. పైకి వెళ్ళలేడు. అలాగే తానే భగవంతుడని తెలుసుకోవాలన్నా అంటే ఆత్మానుభూతి పొందాలన్నా, ఆత్మను సాక్షాత్కరించు కోవాలన్నా ఎక్కడో దేవుడు ఉన్నాడని పూజిస్తూ, భజనలు చేస్తూ, ప్రార్థనలు చేస్తూ కూర్చుంటే, ఎన్ని వందలు జన్మలు ఎత్తినా అలాగే ఉంటారు.

అందుచేత తప్పనిసరిగా అంతర్ముఖులు కావాలి. ధ్యానం చెయ్యాలి. నిరంతరం ధ్యాన సాధన చెయ్యాలి. దివ్య దృష్టి సంపాదించాలి. జన్మ పరంపర తెలుసుకోవాలి. శరీరం వదిలాక మనం ఏ ఏ లోకాలకు వెళతామో ఇప్పుడే తెలుసుకోవాలి. సృష్టి యొక్క రహస్యాలను అధ్యయనం చేయాలి. సత్యాన్ని తెలుసుకోవాలి. పూర్ణాత్మ స్థాయికి ఎదగాలి. ఇదీ మానవ జన్మ లక్ష్యం.

ධ ධ ධ

అద్దానికి పట్టిన మురికిని తొలగిస్తే రూపం కనబడుతుంది. మావిని తొలగిస్తే శిశువు కనబడుతుంది. పొగపోతే అగ్ని కనబడుతుంది. అలాగే ధ్యానం ద్వారా మనస్సు నిర్మలం చేసుకుంటే ఆత్మ సాక్షాత్కారమవుతుంది. మనమే భగవంతుడని తెలుసుకుంటాం.

దీనికి జీవహింస మానాలి. మాంసభక్షణ చేయకూడదు. అహంకారం

తొలగించుకోవాలి. అప్పుడే మనస్సు నిర్మలమవుతుంది. అప్పుడే మనలో ఉన్న ఆత్మను దర్శించుకోగలం. వయస్సు పెరిగే కొద్దీ గుణాలు మారకపోతే మనం 'బాల్య స్థితిలో ఉన్నట్టే'. అలాగే 'బాలుడైనా మంచి గుణాలు కలిగి వుంటే వృద్ధుడే' అందుకే "వయోవృద్ధులు కాకూడదు జ్ఞానవృద్ధులు కావాలి" అంటారు.

వయస్సు పెరిగినా ఏమీ తెలియనివాడు ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తే అజ్ఞాని అంటారు. బుద్ధుని మాటల్లో చెప్పాలంటే బాలుడు అని అంటారు. అందుచేత ఎంత వయస్సు పైబడినా ధ్యానం చేయకుండా పూజలు, భజనలు, ప్రార్థనలు, పారాయణలు చేస్తూ కూర్చుంటే బాల్యస్థితిలో ఉన్నట్టే. ప్రాథమిక పాఠశాల చదువులో అతని జీవితమంతా వున్నట్టే. పరిగెత్తే పిల్లవాడు పాకుతూ ఉంటే ఎలా వుంటుందో అలా ఉన్నట్టే.

ଘ ଘ ଘ

మోక్షం పొందటానికి ఆరు మెట్లు ఎక్కవలసి వస్తే మొదట మనం ఒక కాలు మొదటి మెట్టు మీద వేస్తాం తరువాత రెండవ కాలు రెండవ మెట్టు మీద వేస్తాం. ఆ తరువాత మొదట మెట్టు మీద ఉన్న కాలు తీసి మూడవ మెట్టు మీద వేస్తాం. అలా కాకుండా మొదటి మెట్టు మీద కాలు అలాగే వుంచితే జీవితాంతం మొదటి మెట్టు మీదే వుండిపోతాం. మోక్షం పొందం. తరువాత పేజీ చదవాలంటే వెనక పేజీ తిప్పాలి కదా? విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళాలంటే విజయవాడ వదలాలి కదా?

అందుచేత ఇక్కడ గ్రహించవలసింది మనం మూడవ మెట్టు మీద కాలు వేయడానికే మొదట మెట్టు మీద కాలు తీస్తున్నాం. కానీ పూర్తిగా మొదటి మెట్టు నుండి వెనుకకు వేయడం లేదు. అంటే భగవంతుని పొందటానికి పూజలు బదులు ఇంకా అత్యున్నతమైన సాధనలో ప్రవేశిస్తున్నాం. అంతేకాని భగవంతుని వదలిపెట్టడం లేదు.

పూజలు, భజనలు, ప్రార్థనలు, స్తోత్రాలు చేస్తూ మన కాలాన్ని, మానవ జన్మను వృధా చేయకుండా, విలువైన సమయాన్ని ధ్యానానికి ఉపయోగించాలి. ధ్యాన సాధన చేసి భగవదనుభూతి పొందాలి. ఆత్మ సాక్షాత్కారం ద్వారా శాశ్వతంగా దుఃఖాన్ని నివారించుకోవాలి. ఇదే ఆఖరు జన్మ చేసుకోవాలి. దేవుళ్ళుగా మారాలి. ఇదే బ్రహ్మర్షి పత్రిగారు ఇచ్చే సందేశం. అందుచేత ఎదగాలంటే క్రింది స్థాయి వదలాలని తెలుసుకోవాలి.

# "లోకులు మెచ్చేది భగవంతుడు మెచ్చడు!"

మనం ఏం చేసినా, ఇతరులు ఏమనుకుంటారోననే చేస్తాం. అంతే కాని భగవంతుడు ఏమనుకుంటాడోనని ఆలోచించం. అలా లోకులు మెచ్చే పనులే చేస్తాం. కాని భగవంతుడు మెచ్చే పనులు చెయ్యం.

కష్టాలు వచ్చినపుడు, సమస్యలు వచ్చినపుడు లేదా ఏదైనా భగవంతుని ఫోటో కాని, విగ్రహం కాని చూసినపుడు మాత్రమే, మనకు భగవంతుడు గుర్తుకొస్తాడు. ఇతర సమయాల్లో భగవంతుని ధ్యాసే వుండదు. ఆ కాస్త సమయంలో కూడా మన సమస్యలు, బాధలు, కోరికలు చెప్పుకోవడానికే సరిపోతుంది కానీ, భగవంతుని గురించి ఆలోచించం.

ఎంతసేపూ ఆయన నుంచి అన్నీ కోరుకుంటాం, కానీ మన నుంచి భగవంతుడు ఏమి ఆశిస్తాడు? మనం ఎలా వుండాలని భగవంతుడు కోరుకుంటాడు? అని ఆలోచించం. ఎంత సేపూ భగవంతుడు మనల్ని ఆనందింప చెయ్యాలని ఆశిస్తాం, కానీ మనం ఏం చేస్తే భగవంతుని ఆనందింప చెయ్యగలమో ఆలోచించం? మనం ఎలా ప్రవర్తిస్తే భగవంతునికి ఆనందం కలుగుతుందో ఆలోచించం. మనకు ఎలాంటి గుణాలు వుంటే భగవంతుడు మెచ్చుకుంటాడో ఆలోచించం.

మనం ఎంతసేపూ లోకం గురించి, లోకుల గురించి అన్నీ చేస్తున్నాం కాని భగవంతుని గురించి ఏమీ చేయటం లేదు. ఎంతసేపూ లోకులు మెచ్చే రూపాన్ని అలంకరించుకుంటున్నాం, కానీ భగవంతుడు మెచ్చే మంచి గుణాలను అలంకరించుకోవటం లేదు. ఎంతసేపూ మడి ఆచారమంటూ దేహశుద్ధి, బాహ్య శుద్ధికి ప్రాముఖ్యం ఇస్తున్నాం కానీ అంతర్‌శుద్ధికి, భావ శుద్ధికి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. తలలు బోడి చేస్తున్నాం కానీ తలపులు బోడి చేసుకోవడం లేదు.

లోకులు ఆస్తి, అంతస్తు చూస్తారు. పదవులు, ఉద్యోగం, హోదా, పేరు, ప్రఖ్యాతులు చూస్తారు. అందుచేత మనం వీటికే ప్రాముఖ్యం ఇస్తున్నాం. వాటి వెనుకే పరుగెడుతున్నాం. మన సమయాన్ని, జీవితాన్ని వాటి కోసమే వెచ్చిస్తున్నాం. వాటిని సంపాదిస్తూ లోకుల మెప్పు కోసం ప్రయత్నిస్తున్నాం. కానీ భగవంతుడు మెచ్చే మంచి ప్రవర్తన, మంచి మాటలు, మంచి గుణాలు సంపాదించుకోవటానికి ప్రయత్నించడం లేదు.

అంతేకాదు సృష్టిలోని భగవంతుని రూపాలైన సమస్త ప్రాణుల పట్ల,

జీవుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపడం లేదు. అందరినీ సమ భావంతో చూడటం లేదు. అన్నీ ఆయన రూపాలేనని భావించడం లేదు.

ఇంకా కుటుంబాభిమానం, కులాభిమానం చూపిస్తున్నాం. మత విద్వేషంతో ప్రవర్తిస్తున్నాం. ప్రాంత, దేశీయదురభిమానంతో ద్వేషించుకుంటున్నాం. మరి భగవంతుడెలా మెచ్చుకుంటాడు? భగవంతుడు మెచ్చు కోవాలంటే ఆయన మెచ్చుకునే సర్వసమానత్వాన్ని పాటించాలి. ఎందుచేతనంటే "సమత్వమే దైవత్వం" కాబట్టి. అందుచేత భగవంతుడు మెచ్చే సమత్వానికి ప్రాముఖ్యం ఇవ్వాలి.

మనం లోకులకు గొప్పగా కనబడేటట్లు పూజలు, భజనలు, ప్రార్థనలు, నమాజులు చేస్తున్నాం. కానుకలు సమర్పిస్తున్నాం. కానీ భగవంతుడు మెచ్చే అహింసా ధర్మాన్ని ఆచరించడం లేదు. లోకుల మెప్పుకోసం జీవులను హింసించి విందు భోజనాలు పెడుతున్నాం. కానీ, భగవంతుని రూపాలైన జీవులను హింసించడం ద్వారా భగవంతుని ఆగ్రహానికి గురవుతున్నామని భావించడం లేదు.

అందుచేత లోకులు మెచ్చేది భగవంతుడు మెచ్చడని తెలుసుకోవాలి. మన జీవితం ధన్యం కావాలంటే లోకులు మెచ్చడం కాదు, భగవంతుడు మెచ్చాలి. అందుచేత భగవంతుడు మెచ్చేదే మనం చెయ్యాలి. అలా చేసినపుడే భగవంతుని అనుగ్రహం మనకు కలుగుతుంది. అందుచేత భగవంతుడు మెచ్చేది మన గుణాలు, మన మంచి ప్రవర్తన మాత్రమేనని గుర్తుంచుకోవాలి.

మరి మంచి గుణాలు ఎలా వస్తాయి? మంచి గుణాలు రావాలంటే ఏం చెయ్యాలి? అసలు గుణాలు దేనికి సంబంధించినవి?

గుణాలు మనస్సుకు సంబంధించినవి. 'మంచి మనస్సు' ఉంటే మంచి గుణాలు కలిగి మంచి పనులు చేస్తాం. 'చెడు మనస్సు' ఉంటే చెడు గుణాలు కలిగి చెడు పనులు చేస్తాం.

చెడు మనస్సు, మంచి మనస్సుగా మారాలంటే "ఆనాపానసతి ధ్యానం" చెయ్యాలి. ధ్యానం చేస్తే మనస్సు శుద్ధి చేసుకోవచ్చు. మంచి మనస్సుగా మార్చుకోవచ్చు. మంచి మనస్సు వుంటే భగవంతుడు మెచ్చే పనులు చేస్తాం. భగవంతుని అనుగ్రహం పొందుతాం. ధన్యులవుతాం. అందుచేత ధ్యానం చేద్దాం.

# "పూజకంటే గుణం ముఖ్యం!"

ఒక వ్యక్తి ప్రతీరోజూ భగవంతుని పటానికి శ్రద్ధగా పూజ చేస్తాడు. కానీ భగవంతుడు మెచ్చే పనులు చేయడు. అంటే అసత్యాలు పలుకుతాడు. అందరినీ హింసిస్తాడు. జీవహింస చేస్తాడు. మాంసభక్షణ చేస్తాడు. స్వార్థంతో అందరినీ మోసగిస్తాడు. ఇలా భగవంతునికి నచ్చని పనులు చేస్తూంటాడు.

ఇంకొక వ్యక్తి భగవంతుని పటానికి పూజ చేయడు. కానీ భగవంతుడు మెచ్చే పనులు అంటే అందరినీ ప్రేమిస్తాడు, సత్యమే పలుకుతాడు. ధర్మాన్ని పాటిస్తాడు, జీవహింస చేయడు. ఇలా అన్నీ భగవంతుడు మెచ్చే పనులే చేస్తాడు.

వీరిద్దరిలో భగవంతుడు ఎవరిని అనుగ్రహిస్తాడు? కొంచెం ఆలోచిస్తే రెండవ వ్యక్తినే, అంటే భగవంతుడు మెచ్చేటట్లుగా మంచి పనులు చేసే వ్యక్తినే అంటే మంచి గుణాలు కలిగిన వ్యక్తినే ఆయన అనుగ్రహిస్తాడని చెపుతాం. అంటే భగవంతుడు పూజకంటే, గుణాలకే ప్రాముఖ్యం ఇస్తాడని తెలుస్తుంది. కాని మనం పూజకే ప్రాముఖ్యం ఇస్తున్నాం. భగవంతుడు మెచ్చే గుణాలకు ప్రాముఖ్యం ఇవ్వట్లేదు. మంచి పనులు చెయ్యట్లేదు.

మనం పూజ చేస్తూ భగవంతుని దగ్గర మంచి (+) మార్కులు సంపాదిస్తున్నామని అనుకుంటున్నాం. కానీ పూజ చేసినందుకు మనకి (+) మార్కులు వస్తున్నాయో లేదో తెలీదు కాని, చెడు పనులు చేసినందుకు అన్నీ (–) మార్కులు మాత్రం వస్తాయి. అలాగే భగవంతుని పూజ చేయకపోయినా మనకు (–) మార్కులు రావు. పైగా భగవంతుడు మెచ్చే పనులు చేయడం వల్ల తప్పకుండా (+) మార్కులు సంపాదిస్తాం.

మనం ఎన్ని పూజలు చేసినా, ప్రార్థనలు చేసినా, భజనలు చేసినా, నమాజు చేసినా కష్టాలు, బాధలు తీరట్లేదు. సమస్యలతో నలుగుతూ, రోగాలతో బాధపడుతున్నాం. కారణం పూజలు చేస్తాం, తరువాత అన్నీ మామూలే, మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాం. అసూయ, ద్వేషాలతో అందరికన్నా, అన్నింటిలో ఉన్నతంగా వుండాలనే స్వార్థంతో, నేను, నా కుటుంబం బాగుంటే చాలని అందరిని అనేక రకాలుగా మోసగిస్తూ, బాధిస్తూ, అవమానిస్తూ, చేయకూడని పనులు చేస్తున్నాం.

ఇంకా కనబడేదంతా శాశ్వతమనుకుని, చూసిందల్లా మన స్వంతం

కావాలనే స్వార్థ చింతనతో, లోభంతో వ్యవహరిస్తున్నాం. ఇలాంటి పనులు చేస్తూ, భగవంతుని పూజ చేస్తున్నాంకదా మనకేం ఫరవాలేదని భావిస్తున్నాం.

ఇంకా పూజలు, ప్రార్థనలు, నమాజు చేస్తే చాలు భగవంతుడు అన్నీ క్షమిస్తాడని. భావిస్తున్నాం. పూజకే ప్రాముఖ్యం ఇస్తున్నాం. కానీ, భగవంతుడు దేనికి ప్రాముఖ్యం ఇస్తాడో తెలుసుకోలేకపోతున్నాం.

ఒక వ్యక్తి పూజ చేస్తుంటాడు. ఇంతలో ఎవరో వచ్చి దాహంగా వుంది. మంచినీళ్ళు ఇమ్మని అడుగుతాడు. అప్పుడు ఆ వ్యక్తి నేను పూజలో వున్నాను వెళ్ళు అంటాడు. ఇక్కడ మనం ఆలోచిస్తే మనం చేసే పూజ కన్నా భగవత్ స్వరూపుడైన, అంటే ఆత్మస్వరూపుడైన ఆ జీవుడికి మంచినీళ్ళు ఇచ్చి దాహం తీర్చినట్లైయితేనే భగవంతుడు మెచ్చుకుంటాడు. అనుగ్రహిస్తాడని భావించలేకపోతున్నాం. పూజ చేస్తున్నాను కదా అని సంతృప్తి చెందుతున్నాం.

పొరుగువారిని ప్రేమించాలి. ఎందుకంటే అంతా భగవత్ స్వరూపులే కనుక. కాని మనం మన భార్య, పిల్లలను మాత్రమే ప్రేమిస్తాం. మన పిల్లవాడు ఏడిస్తే ఎత్తుకుంటాం. పక్కింటి పిల్లవాడు ఏడ్చినా పట్టించుకోం. ఇది భగవంతుని దృష్టిలో ప్రేమ కాదు.

మన ఇంట్లో ఎవరైనా చనిపోతే నెలల తరబడి దుఃఖపడతాం. కానీ ఒక రైలు ఏక్సిడెంట్‌లో వందలమంది చనిపోయారని తెలిసినా దుఃఖం రాదు.

ఒకాయన పొరుగువారి సేవ గురించి గంటలు గంటలు ఉపన్యాసం ఇచ్చి, ఉపన్యాసం అయిన తరువాత వెళుతుంటే నడిచే దారిలో రాయి కనబడుతుంది. అయినా పట్టించుకోడు. ఇంకొక వ్యక్తి ఉపన్యాసం ఇవ్వకపోయినా ఆ రాయి నడిచే వారికి గుచ్చుకుంటుందని తీసి ప్రక్కన వేస్తాడు. ఇక్కడ సేవ గురించి ఉపన్యాసం చెప్పిన వాని కంటే రాయి తీసిన వానినే భగవంతుడు అనుగ్రహిస్తాడని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉంటాయి. అందుచేత భగవంతుడు పూజలకన్నా, ప్రార్థనల కన్నా, భజనల కన్నా, నమాజు కన్నా గుణాలకే ప్రాధాన్యం ఇస్తాడని గుర్తుంచుకోవాలి. మరి భగవంతుడు మెచ్చే గుణాలు కలిగి ఉండాలంటే ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తే మనస్సు శుద్ధమవుతుంది. మంచి గుణాలతో మంచి పనులు చేస్తాం. భగవంతుని అనుగ్రహం పొందుతాం.

# "రూపం కాదు గుణం సరిచేసుకోవాలి!"

బయటకు వెళ్ళేటప్పుడు అంటే సినిమాకి గాని, ఫంక్షన్‌కి గాని, పార్టీకి గాని వెళ్ళేటపఋడు ఎవరైనా రూపాన్ని అద్దంలో చూసుకుని సరిచేసుకుంటారు. కారణం ఉన్నంతలో ఇతరులకు బాగా, అందంగా కనబడాలని, తమని ఇతరులు తక్కువగా భావించకూడదని.

ఎంతసేపూ ఇంతవరకే ఆలోచిస్తాం. కానీ సరిచేసుకోవలసింది రూపం కాదు గుణాలు. ప్రతీరోజూ రూపాన్ని ఎలా సరి చేసుకుంటామో గుణాలు కూడా అలా సరిచేసుకోవాలి.

రూపం ఇతరులు మెచ్చుకుంటారు. కానీ గుణాలు భగవంతుడు మెచ్చుకుంటాడు. ఇతరులు మెచ్చుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏదీ లేదు. కానీ భగవంతుడు మెచ్చుకునే గుణాలు కలిగి వుంటే జీవితమే ధన్యమౌతుంది. అందుచేత ఏ పనైనా "ఇతరులు ఏమనుకుంటారోనని కాదు, భగవంతుడు ఏమనుకుంటాడోనని చెయ్యాలి".

నిజజీవితంలో అవగాహన లేక మనం రూపానికే ప్రాముఖ్యం ఇస్తున్నాం కానీ, గుణాలకు ప్రాముఖ్యం ఇవ్వట్లేదు. రూపం చూసుకోవ డానికి అద్దం ఉంది. అందులో మన లోటు పాట్లు కనిపిస్తాయి. కాని గుణాలు చూసుకోవడానికి అద్దాలు, దర్పణాలు లేవు కదా? మరి వాటిని ఎలా చూసుకుంటాం? ఎలా సరిచేసుకుంటాం? అని అనిపించవచ్చు. కానీ మన గుణాలు ప్రతిబింబించే దర్పణాలు కూడా ఉన్నాయి.

అవి ఏమిటంటే మన ఇంట్లో అలంకరించుకునే, మహాత్ముల, యోగుల, దేవుళ్ళ ఫోటోలు. ఎందుచేతనంటే వారి ఫోటోలు చూసిన వెంటనే, వారి జీవితంలో వారు అనుసరించిన మార్గాలు, వారి బోధలు, వారి మాటలు, వారి పనులు, వారి గుణాలు మనం గుర్తు తెచ్చుకోవాలి. వాటిని బట్టి మన గుణాలు సరి చేసుకోవాలి. అలా అవి మన గుణాలు ప్రతిబింబించే దర్పణంలా ఉపకరిస్తాయి.

వారి ఫోటో చూసినపుడల్లా మన గుణాలలోని లోపాలు తెలుసుకోవాలి. వాటిని సరి చేసుకుని ప్రవర్తన మార్చుకోవాలి. మన ఇంటిలో, మన గదిలో వారి ఫోటోలు వుంచుకోవటానికి కారణం ఇదే. అలా వారి బోధలు అంటే సత్యాన్ని పలకటం, ధర్మాన్ని ఆచరించడం, అన్ని ప్రాణుల మీద ప్రేమ, కరుణ చూపించడం లాంటివి ఎన్నో మనం తెలుసుకోవచ్చు. అంతే కాదు, నిరాడంబరంగా జీవించడం,

అందరికి ఉపకారం చెయ్యడం, శాంతం, దయ కలిగి ఉండటం, ఇలా ఎన్నో ఆదర్శప్రాయమైన గుణాలు వారి నుండి నేర్చుకోవచ్చు. అలా వారి ఫోటోలు చూడగానే వారి గుణాలకు మన గుణాలకు ఉన్న తేడా తెలియడం వల్ల, ఆ ఫోటోలు మనకు దర్పణంలా ఉపకరిస్తాయి.

ఉదాహరణకు గౌతమబుద్ధుని ఫోటో చూడగానే ఆయన జీవితంలో గుర్తుకు వచ్చే కొన్ని సంఘటనలు చూద్దాం.

ఆయన ఎదుట మధురమైన పదార్థాలు ఉంచితే వెంటనే ఆయన తన కడుపు వంక చూసేవాడట. ఆయనకు ఆకలి అనిపిస్తే తీసుకునే వాడు. లేకపోతే ముట్టుకునే వాడు కాదట.

అదే మనమైతే కడుపువంక చూడం. పదార్థాల వంకే చూస్తాం. ఆకలి లేకపోయినా పదార్థాలు బాగున్నాయంటే కడుపు నిండా ఆరగించేస్తాం. బుద్ధుని ఫోటో చూడగానే మనం తెలుసుకోవలసింది ఆయన ఆహారానికి, రుచికి ప్రాముఖ్యం ఇవ్వరు. ఆకలికి, ధ్యానానికి ఉపకరించే ఆహారానికే ప్రాముఖ్యం ఇస్తారని తెలుస్తుంది.

ఒకసారి గౌతమబుద్ధుడు బిక్షాటనకు వెళ్ళినపుడు ఒక ఇంటి యజమాని ఆయనను నీకు పనిలేదా? ప్రతీరోజూ  వస్తున్నావని నానా రకాలుగా తిట్టసాగాడు. అప్పుడు బుద్ధుడు ఆ యజమానిని అలా తిట్టనిచ్చి, తిట్టనిచ్చి అన్నీ అయిన తరువాత ఆ యజమానిని ఈ విధంగా అడిగాడు. బాబు నువ్వు వేసే బిక్ష  నేను స్వీకరించకపోతే అది ఎవరికి చెందుతుంది? అని అడిగాడు. అప్పుడు ఆ ఇంటి యజమాని నువ్వు తీసుకోకపోతే నాకే చెందుతుంది, అని సమాధానమిచ్చాడు. అప్పుడు బుద్ధుడు అయితే ఇప్పటి వరకు నువ్వు తిట్టిన తిట్లు నేను స్వీకరించలేదు. మరి అవి ఎవరికి చెందుతాయి? అని అడిగాడు. ఆ పెద్ద మనిషి ఆ మాటలు అర్థం చేసుకుని వెంటనే బుద్ధుని కాళ్ళమీద పడ్డాడు.

దీన్ని బట్టి మనల్ని ఎవరైనా తిట్టినప్పుడు తిరిగి సమాధానం చెప్పకపోయినా, వాటి గురించి ఆలోచించక పోయినా అది తిట్టిన వారికే చెందుతుందని మనం తెలుసుకోవచ్చు. అలా దేవుళ్ళ ఫోటోలు చూడగానే వారి జీవితంలోని విషయలు ఒక సందేశంలా మన జీవితాన్ని, మన గుణాలను సరిచేసుకునే దర్పణంలా ఉపయోగపడతాయని  తెలుసుకోవాలి.

అలాగే షిరిడి సాయిబాబా, యోగి వేమన,  రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి లాంటి యోగుల ఫోటోలు చూసినపుడు వారంతా శరీరానికి, శారీరక సుఖాలకు, భోగభాగ్యాలకు, పేరు ప్రఖ్యాతులకు, ప్రాముఖ్యం ఇవ్వలేదని

తెలుస్తుంది.

కాని మనం వారంతా ఏ భోగభాగ్యాలకు, సిరి సంపదలకు, శారీరక సౌఖ్యాలకు, పేరు ప్రఖ్యాతులకు, పదవులకు ప్రాముఖ్యం ఇవ్వలేదో వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నాం. వారు వేటికి ప్రాముఖ్యం ఇచ్చారో వాటికి అసలు ప్రాముఖ్యమే ఇవ్వడం లేదు. ఇవి వారి ఫోటోలు చూసినపుడు మనం గ్రహించవచ్చు.

వారంతా శక్తిమంతులు, వారు చేయలేనిది ఏదీ లేదు వారికి తెలియంది ఏదీ లేదు అని వారిని ఆరాధిస్తున్నాం. అంతే కానీ వారు ఆచరించి చూపింది, వారు బోధించింది, మనం ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. వారంతా ఏ భోగభాగ్యాలను, శారీరక సుఖాలను, పనికి రావని పూర్తిగా త్యజించారో అవే మాకు ఇవ్వమని వారిని పూజిస్తూ వేడుకుంటున్నాం.

అందుచేత మనం 'లోకులు మెచ్చే రూపం కాదు భగవంతుడు మెచ్చే గుణాలు సరిచేసుకోవాలి'. భగవంతుని ఫోటో పెట్టామంటే అర్థం అదే. ఫోటోలు మన గుణాలలోని లోపాలు తెలియజేసే దర్పణాలని తెలుసుకోవాలి.

మనం దేవుళ్ళను ఆరాధించగలుగుతున్నాం కానీ వారు చెప్పింది ఆచరించ లేకపోతున్నాం. వారు చెప్పింది ఆచరించాలంటే ధ్యానం శ్రద్ధగా చెయ్యాలి. అలా చేస్తే మెల్లిమెల్లిగా మన గుణాలు మారి, మంచి ప్రవర్తన అలవడుతుంది. మంచి పనులు చేయడం వల్ల భగవంతుని అనుగ్రహం కూడా పొందగలుగుతాం.

దేవుని ఫోటోలు నమస్కరించుకోవడానికి, కష్టాలు, కోరికలు చెప్పుకోవడానికి కాదు. అవి మన గుణాలు ప్రతిబింబించే దర్పణాలని తెలుసుకోవాలి. ధ్యానం చేస్తే ఇంకా ఎన్నో సత్యాలు తెలుస్తాయి.

# "అంతర్ శుద్ధే ముఖ్యం!"

మనం ఆలయాలకు, చర్చిలకు, మసీదులకు వెళ్ళేటపుడు శుభ్రంగా స్నానం చేసి మంచి బట్టలు కట్టుకుని అలంకరించుకుని వెళ్తూ శుచి, శుభ్రత పాటిస్తున్నాం. కానీ ఒక విషయం మాత్రం గ్రహించడం లేదు.

భగవంతుడు కోరుకునేది బాహ్యామైన శుచి, శుభ్రత కాదు. ఆయన కోరుకునేది మన ప్రవర్తనలో శుచి, మన గుణాలు శుభ్రంగా వుండాలనే. అంతే కాని గుడికి వెళ్ళి కొబ్బరికాయ సమర్పించినంత మాత్రాన, చర్చికి వెళ్ళి ప్రార్థించినంత మాత్రాన, మసీదుకు వెళ్ళి నమాజు చేసినంత మాత్రాన, సాయిబాబా ఆలయానికి వెళ్ళి భజన చేసినంత మాత్రాన ప్రయోజనం లేదు.

భగవంతుడు చెప్పక పోయినా శరీరాన్ని శుభ్రంగా ఉంచుకుంటున్నాం. కాని అంతరాత్మ రూపంలో భగవంతుడు చెప్పినా మన మాటల్లో, చేతల్లో శుచి పాటించలేకపోతున్నాం.

భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు మనం ఎలా ఉండాలో? ఏం చెయ్యాలో? ఎలా ప్రవర్తించాలో? జీవితమంటే ఏమిటో? చక్కగా బోధించారు. అలాగే జీసస్ బైబిలులో ఎన్నో విషయాలు మనకు ఆదేశంగా ఇచ్చారు. అదే విధంగా ఖుర్ ఆన్‌లో మనం ఎలా ప్రవర్తించాలో తెలుపబడింది.

కాని మనం ఇవేమీ పట్టించుకోకుండా వారు చెప్పినవి ఆచరించకుండా శుచిగా, శుభ్రంగా తయారై వారిని పూజిస్తూ, ప్రార్థిస్తూ, నమాజు చేస్తూ కాలక్షేపం చేస్తున్నాం. అంతే కానీ, మనస్సు నిర్మలం చేసుకోవట్లేదు, గుణాలు మార్చుకోవట్లేదు. మనలోని స్వార్థాన్ని, రాక్షసత్వాన్ని, దుర్మార్గాన్ని, కాఠిన్యాన్ని, లోభాన్ని, అహంకారాన్ని వదలట్లేదు. కానీ వీటన్నింటినీ వదిలితేనే భగవంతునికి దగ్గరవుతాం. అందుచేత భగవంతుని దగ్గరకు మనలోని దుర్గుణాలను, దుష్ట భావాలను వదిలి వెళ్ళాలి, చెప్పులను, మాసిన వస్త్రాలను కాదు.

ఇదే సందర్భంలో బ్రహ్మర్షి పత్రి గారితో జరిగిన అనుభవం తెలుసుకుందాం. ఒక గ్రామంలో ఒకతను పత్రి గారిని చూసి చెప్పులు వదలి ఆయనను సమీపిస్తుండగా, వెంటనే పత్రిగారు అతనిని చెప్పులు ఎందుకు వదిలావు? అని అడిగారు. దానికి అతడు గురువు గారి దగ్గరకు వచ్చేటప్పుడు చెప్పులు వదలాలి కదండి? అన్నాడు. అప్పుడు ఆయన కోపంగా గురువు దగ్గరకు వచ్చేటపుడు

వదలవలసింది చెప్పులు కాదు, నీలోని దుర్గుణాలు, నీలోని స్వార్థ గుణాలు, నీలోని రాక్షస గుణాలు. అంతే కాని చెప్పులు కాదు. ఆ చెప్పులు ఏం పాపం చేశాయి? అవి ఇంకా నీకు సేవ చేస్తున్నాయి. నిన్ను మోస్తున్నాయి. నీ కాళ్ళను కాపాడుతున్నాయి. వెంటనే చెపఞ్పులు వేసుకో అని అతనికి చెప్పారు.

దీనిని బట్టి మనం సద్గురువు దగ్గరకు గాని, భగవంతుని దగ్గరకు గాని వెళ్ళేటప్పుడు వదలవలసింది మనలోని చెడ్డ గుణాలనే కానీ, మాసిన బట్టలు కాదు, అంటే భగవంతుడు ప్రాముఖ్యం ఇచ్చేది అంతర్ శుద్ధికే గాని బాహ్య శుద్ధికి కాదు. ఆయన ఆశించేది మంచి గుణాలతో మన వల్ల లోకానికి జరిగే ఉపకారమే.

నిజమైన భక్తుడు బాహ్యమైన ఆడంబరాలు ప్రదర్శించక పోయినా అంతరాత్మ రూపంలో భగవంతుడు ఇచ్చిన ఆదేశాలను, ధర్మాలను తూ.చ. తప్పకుండా పాటిస్తాడు. అటువంటి వాడినే భగవంతుడు నిజమైన భక్తుడిగా భావిస్తాడు. అంతే కాని  ఆయన ఆదేశాలను ధిక్కరించి బాహ్యమైన చర్యలతో ఆయన మెప్పు సంపాదించాలని ప్రయత్నిస్తున్నది ఏదీ భక్తి కానే కాదు.

"అంతర్ శుద్ధి" అంటే "మనశ్శుద్ధి". దానికి ఒక్కటే మార్గం అదే "శ్వాస మీద ధ్యాస ధ్యానం". ధ్యానం ద్వారా మనస్సు శుద్ధమవుతుంది. పవిత్రమవుతుంది. తద్వారా మంచి పనులు చేస్తాం. అంతరాత్మను వినగలుగుతాం. భగవంతుని మెప్పుపొందుతాం.

# "భావనే భగవంతుడు చూస్తాడు!"

మనకు ఇవ్వబడిన వాటిలో కొంత సమాజానికి ఉపయోగించాలని మన శక్తి మేర రకరకాలుగా ఇతరులకు సహాయం చేస్తాం. సేవలు చేస్తాం. అలా చేస్తూ చాలా తృప్తి పడతాం, గొప్పగా చెప్పుకుంటాం.

కానీ సృష్టి సిద్ధాంతం, అంటే భగవంతుని సిద్ధాంతం ప్రకారం మనం ఏం చేసినా, ఎంత చేసినా, చేసిన పని కంటే ఆ పని చేసినందుకు మన భావం ఏమిటి? అన్న దానికే ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది. అంటే మనం ఏ ఉద్దేశ్యంతో చేశాం? ఆ పని చెయ్యటానికి మన భావమేమిటి? అన్నదే చూడబడుతుంది.

భావాన్ని బట్టే చేసిన పనికి ఫలితం ఉంటుంది. అందుచేత మనం ఎంత గొప్ప పని చేసినా, ఎంత మంచి పని చేసినా, మంచి భావంతో చెయ్యాలి. అందులో ఎటువంటి స్వార్థం, కల్మషం ఉండకూడదు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకూడదు. ఆ సాయం పొందిన వారి నుండి ఎటువంటి కృతజ్ఞతా భావం ఆశించకూడదు. పూర్తిగా లోక కళ్యాణ భావంతో అది మన ధర్మంగా భావించి చెయ్యాలి. మనకు ఇవ్వబడిన అదృష్టంగా భావించి చెయ్యాలి. అప్పుడే చేసిన పని వల్ల, సేవ వల్ల మనకి ఫలితం చేకూరేది.

పూజలు, ప్రార్ధనలు, భజనలు, స్తోత్రాలు, పారాయణలు, నోములు, వ్రతాలు చేస్తూంటాం. అవన్నీ చేయడానికి కారణం కోరికలు. అంటే కోరికలు నెరవేరాలనే భావంతోనే చేస్తున్నాం. అంతే కానీ ఏ కోరికా లేకుండా భగవంతుని కోసం ఆరాధించడం లేదు. అంటే చేతలు భగవంతుని ఆరాధిస్తున్నట్టుగా కనిపిస్తున్నప్పటికీ, భావం ప్రధానం కావడం వల్ల, భావం కోరికలు కాబట్టి ఫలితం రాదు.

కొంతమంది మేము ఏమీ కోరం, మాకు ఏ కోరికా లేదు. మేము నిష్కామంగానే పూజిస్తున్నాం. ఆరాధిస్తున్నాం అంటారు. నిష్కామం అంటే ఏమీ కోరకపోవడం అనుకుంటారు. కోరడం అన్నది కర్మ. కోరకపోవడం పైకి చూడటానికి ఏ కర్మా చేయనట్టుగానే కనబడుతుంది. ఇక్కడ ఏ కర్మా చెయ్యకపోయినా భావమే లెక్కించ బడుతుంది. అంటే పూజ చెయ్యటానికి, భజన చెయ్యటానికి, స్తోత్రాలు చదవటానికి భావమేమిటి? అన్నదే చూడబడుతుంది. జీవితంలో తనకు, తన కుటుంబానికి మంచి జరగాలనే వారి భావం. కోరితే ఫలితం వుండదని కోరకుండా చేస్తుంటారు. కానీ ఇక్కడ కోరకపోయినా మంచి జరగాలనే భావం వల్ల అది కామ్య కర్మే అవుతుంది. కాని 'నిష్కామ కర్మ కాదు' ఫలితం రాదు.

మనల్ని ఎవరైనా పొగిడితే వీడు నన్ను పొగడడానికి వీడి ఉద్దేశ్యం ఏమిటి? అని ఆలోచిస్తాం. అలాగే భగవంతుడు మన ఉద్దేశం ఏమిటని చూడడా?

చాలా మంది ఆలయాలు కట్టిస్తారు. కళ్యాణ మండపాలు, సత్రాలు నిర్మిస్తారు. కొంతమంది చందాలు ఇస్తారు. కానీ వాటి మీద పెద్ద పెద్ద అక్షరాలతో తమ పేర్లు వ్రాయించుకుంటారు. అంటే అవి కట్టించింది పేరు కోసమే కదా? నిజంగా లోకకళ్యాణం కోసమయితే పేర్లు ఎందుకు? ఇక్కడ ఫలితం కంటే పేరే ఆశిస్తున్నందువల్ల ఫలితం పొందలేరు.

ఇంకా అన్నదానాలు, వస్త్రదానాలు చేస్తూంటాం, మెడికల్ క్యాంపులు పెడుతూంటాం. ఆర్థికసాయం చేస్తూంటాం. అలా ఎన్నో రకాల సేవలు చేస్తూ పేరు ప్రఖ్యాతులు ఆశిస్తాం. పేపర్లో పడాలనుకుంటాం. వార్తలలోకి ఎక్కాలనుకుంటాం. అంతే కాకుండా సాయం పొందిన వారి నుండి కృతజ్ఞతాభావం కూడా ఆశిస్తాం. అలా సాయం చేసినా భావం వేరే ఉండటం వల్ల ఫలితం పొందలేకపోతున్నాం.

ఇంకా మన దగ్గర పని చేసే వారికి, క్రింది వారికి మిగిలిపోయా యని, పాడై పోయాయని, వాసన వస్తున్నాయని, డాగు పడ్డాయని, పళ్ళు, తినుబండారాలు, చినిగిపోయిన వస్త్రాలు ఇస్తాం. అలా ఇస్తూ వారికి చాలా ఉపకారం చేస్తున్నామని పొంగి పోతాం. కానీ అవి పాడై పోయాయి, మిగిలి పోయాయి, చిరిగిపోయాయి, పనికి రావు అన్న భావంతో ఇవ్వడం వల్ల ఫలితం రాదు. ఎందుచేతనంటే మనం ఏ భావంతో ఆ పనిచేశామన్న దానికి మాత్రమే ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది.

అందుచేత ఏ పని చేసినా, ఏ సేవ చేసినా, ఏ పుణ్యకర్మ చేసినా, సత్కర్మలు చేసినా, భావం సరైనది, శుద్ధమైనది కాకపోతే ఆ పని ఎంత గొప్పదైనా ఫలితం మాత్రం శూన్యం. అందుకే “భావశుద్ధే జ్ఞాన శిద్ధి” అన్నారు.

అందుచేత ‘భగవంతుడు భావమే చూస్తాడని తెలుసుకోవాలి’. భావాన్ని బట్టి ఫలితం ఉంటుంది. పనిని బట్టి కాదు. అందుచేత భావం శుద్ధంగా వుండాలి. మనం దేహాన్ని శుద్ధి చేస్తున్నాం. బట్టలు శుద్ధి చేస్తున్నాం, ఇంటిని శుద్ధి చేస్తున్నాం. కానీ భావాల్ని అంటే మనస్సు శుద్ధి చేసుకోవట్లేదు.

మనస్సు శుద్ధి చెయ్యాలంటే ఒక్కటే మార్గం అదే “ఆనాపానసతి ధ్యానం” మనశ్శుద్ధితో అంటే భావ శుద్ధితో చేసే పని వ్యర్థం కాదు. అందుచేత భగవంతుడు చూసే భావాన్ని ధ్యానంతో శుద్ధి చేసుకోవాలి.

## "ప్రార్థన అంటే భగవంతుణ్ణి మార్చడం కాదు మనం మారడం!"

మనం రకరకాల కోరికలతో భగవంతుని ప్రార్థిస్తాం. అలా ప్రార్థనతో భగవంతుని ప్రసన్నుణ్ణి చేసుకోవడం ద్వారా మన కష్టాలు, దుఃఖం, రోగాలు, సమస్యలు పోగొట్టుకోవచ్చని భావిస్తాం.

ఇంకా భగవంతుడు దయామయుడు, కరుణామయుడు కాబట్టి మన ప్రార్థనలకు ఆయన పరవశుడై మన కష్టాలు, కోరికలు తీరుస్తాడను కుంటాం. కానీ ఆయన నిశ్చలంగా మన ప్రార్థనలను ఆలకిస్తూ నెమ్మది, నెమ్మదిగా మన తపఞ్పులు, మనం తెలుసుకునేటట్టు చేస్తాడు. అలా మెల్లిగా మనకి పశ్చాత్తాపం కలిగేటట్టు చేస్తాడు. చేసిన తప్పులు మరల చేయకుండా మనం మారేటట్టు చేస్తాడు. మన గుణాలు మనమే మార్చుకునేటట్టు చేస్తాడు. జరిగే సంఘటనలన్నీ మనం పాఠాలు నేర్చుకోవడానికే అని మనం తెలుసుకునేటట్టు చేస్తాడు; మనలో మార్పు తీసుకువస్తాడు. మెల్లగా మనలను మంచి వాళ్ళుగా మారుస్తాడు. చివరకు మనలను భగవంతుళ్ళుగా మారుస్తాడు. అంతవరకూ ఆయన సాక్షీభూతంగా అలా గమనిస్తూనే వుంటాడు.

మనం భగవంతుని దగ్గరకు ఆయన రక్షణ కోసం వెళ్తాం. అలా ఆయన సన్నిధిలో మెల్లగా మన తప్పులను తెలుసుకుంటాం. ఇక తప్పులు చేయమని మాట ఇస్తాం. అలా భగవంతుని దగ్గరకు వెళ్ళిన ప్రతీసారి, మనలో మనం, మన తపఞ్పులను విశ్లేషించుకుని వాటిని ఆయన దగ్గర అంగీకరించి, చేసినందుకు ఆయనను క్షమాపణ కోరుకుని, పశ్చాత్తాపపడి మరల ఆ తప్పులు చేయమని, మంచిగా వుంటామని ఆయనకు వాగ్దానం చేస్తాం.

ఆ రకంగా మనం భగవంతుడి సాయం కోరుతూ, ఆయన కృప పొందాలని ఆయన దగ్గరకు వెళ్ళి, ఆయనను ప్రార్థిస్తూ మెల్లిగా మన తపఞ్పులను తెలుసుకుంటాం, సరి చేసుకుంటాం. అలా మనకి మనం మారి, మెల్లిగా మన జీవితాన్ని మనమే సరిచేసుకుని దుఃఖాల నుండి నివారణ పొందుతాం. మన స్థితిని బట్టి ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. లేదా కొన్ని జన్మలు పట్టవచ్చు. కానీ జరుగుతున్నది మాత్రం ఇదే. పూజ ద్వారా, ప్రార్థన ద్వారా, నమాజు ద్వారా మనం 'భగవంతుని మార్చటం లేదు. మనకి మనమే మారుతున్నాం'.

దీన్ని బట్టి పూజించడమన్నా, ప్రార్థించడ మన్నా, నమాజు చేయడమన్నా మన గుణాలు మార్చుకుని మనం మారి, మన జీవితాన్ని ఆనందమయం చేసుకోవటమే. అంటే మనం మారడమే తప్ప భగవంతుడు మారి మనలను అనుగ్రహించడం మాత్రం కాదు. ధ్యానం చేస్తే ఇది మనకు బాగా అర్థం అవుతుంది.

# "భగవంతుడు విత్తనాలనే ఇస్తాడు ఫలాలను ఇవ్వడు!"

"ఏది విత్తుతే, అదే కోస్తాం" అని జీసస్ క్రైస్ట్ అన్నారు. అంటే వరి విత్తనం వేస్తే వరి పంట కోస్తాం. మామిడి విత్తనం వేస్తే మామిడిపళ్ళు కోస్తాం. అంతే కాని వేప విత్తనం వేసి మామిడి పళ్ళు కోయలేం. గడ్డి విత్తనం వేసి వరి పంట కోయలేం.

అలాగే జీవితంలో ఏ కర్మలు చేస్తే ఆ కర్మ ఫలాలే అనుభవిస్తాం. పుణ్యకర్మలు చేస్తే భోగం అనుభవిస్తాం. పాపకర్మలు చేస్తే దుఃఖం అనుభవిస్తాం. అందుచేత గతంలో చేసిన కర్మ ఫలాలే ప్రస్తుతం అనుభవిస్తున్నాం. అలాగే ప్రస్తుతం చేసే కర్మ ఫలాలు భవిష్యత్‌లో అనుభవిస్తాం. కష్టాలు, రోగాలు, బాధలు అనుభవిస్తున్నా మంటే గతంలో మనం విత్తిన చెడు కర్మల ఫలితమేనని తెలుసుకోవాలి.

భగవంతుడు కష్టాలు లేని మంచి జీవితాన్ని ఇస్తాడని పూజలు, ప్రార్థనలు, నమాజులు చేస్తున్నాం. కానీ భగవంతుడు జీవితాన్ని ఆనందమయం చేసుకునే దారి చూపిస్తాడు. కానీ కోరినవి ఇవ్వడు. ఆ దారి వెంట నడిచి మనకు మనమే జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి. మన దుఃఖాలు, రోగాలు పోగొట్టుకోవాలి.

మనం ఆరాధించే దేవుళ్ళంతా మనకు భగవద్గీత, బైబిల్, ఖురాన్‌ల ద్వారా మనం తప్పులు చేయకుండా జీవితం ధన్యం చేసుకునే మార్గం బోధించారు. అంటే మంచి జీవిత ఫలాలు పొందే మంచి విత్తనాలు ఇచ్చారు.

భగవాన్ సత్యసాయిబాబా వారు మధురఫలాలు ఇచ్చే విత్తనాలు అంటే లోకాన్ని ప్రేమించడం, పొరుగువారికి సేవ చేయడం. సాటి జీవుల పట్ల దయ, కరుణ చూపడం. సత్యాన్ని పలకడం, ధర్మాన్ని ఆచరించడం, జీవ హింస మానడం లాంటి విత్తనాలు ఇచ్చారు. వాటిని నాటితే అంటే ఆచరిస్తే జీవితంలో మనం కోరుకునే సుఖం, సంతోషం, ఆరోగ్యం, శాంతి లాంటి ఫలాలను పొందవచ్చు.

అలాంటి విత్తనాలు సారవంతమైన నేలలో నాటితే అంటే నిస్వార్థంగా ప్రతిఫలం ఆశించకుండా జీవితంలో ఆచరిస్తే తప్పకుండా మంచి ఫలితాలు కోరకుండానే పొందుతాం. అలాగే బాబా వారు ఇచ్చిన విత్తనాలు అంటే మంచి పనులు స్వార్థంతో, స్వలాభం కోసం అంటే ప్రతిఫలాపేక్షతో చేస్తే సారం లేని భూమిలో వేసిన విత్తనాలు ఏ రకంగా మొలకెత్తవో అదే మాదిరిగా జీవితంలో ఫలితాలు పొందలేం.

బాబా వారు ఫలాలే ఇచ్చేవారైతే రోగాలతో వచ్చిన వారికి ఉచిత వైద్య సేవలు ఎందుకు చేయిస్తారు? వారి మహిమచే వారి రోగాలు నయం చేసి పంపేవారు కదా? అంటే భగవంతుడు ఎప్పుడూ ఫలాలు ఇవ్వడు. విత్తనాలనే ఇస్తాడని తెలుసుకోవాలి.

అలాగే కృష్ణుడు, బుద్ధుడు, జీసస్, మహ్మద్, గురునానక్, రామకృష్ణ పరమహంస, వీరబ్రహ్మేంద్ర స్వామి, యోగివేమన, రమణమహర్షి వీరంతా కూడా మనకు ఎన్నో మంచి విత్తనాలను ఇచ్చారు. మనం వాటిని సారవంతమైన నేలలో అంటే నిస్వార్థంగా అంటే ప్రతిఫలాపేక్ష లేకుండా జీవితంలో ఆచరిస్తే తప్పకుండా మంచి ఫలితాలు పొందుతాం.

మనం వారు ఇచ్చిన విత్తనాలు కాకుండా వేరే మన ఇష్టం వచ్చిన విత్తనాలు నాటుతున్నాం. అంటే వారు చెప్పిన మంచి పనులు చేయకుండా చెడు పనులు చేస్తున్నాం. వాటివల్ల చెడు ఫలాలు అంటే దుఃఖం, రోగం, బాధలు అనుభవిస్తున్నాం.

భగవంతుడు ఫలాలు ఇస్తాడని ఆశపడకూడదు. వారిని పూజిస్తూ, భజనలు చేస్తూ, ప్రార్థనలు చేస్తూ, నమాజు చేస్తూ జీవితాన్ని వ్యర్థం చేసుకోకూడదు..

బ్రహ్మర్షి పత్రీగారు మనకు "ధ్యానమనే దివ్యమైన కల్పవృక్ష విత్తనాన్ని" ఇచ్చారు. కల్పవృక్షం మన దగ్గర వుంటే మనం ఏది కోరుకుంటే అది పొందవచ్చు. అంటే ధ్యానం చేస్తే మనం కోరుకునే అన్ని రకాల లాభాలు అంటే ఆరోగ్యం, ఆనందం, శాంతి, సౌభాగ్యం అన్నీ పొందవచ్చు. మనకున్న తాత్కాలిక సమస్యల నుండి బయటపడటమే కాకుండా జన్మజన్మల కర్మలు రహితం చేసుకుని ప్రతీ ఒక్కరూ కోరుకునే ముక్తి, మోక్షం పొందవచ్చు. జీవన్ముక్తులమవ్వచ్చు.

# "ప్రేమ" అన్నది సహజ గుణం కావాలి!

**శ్లో॥ ఆత్మే పయ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున!**
**సుఖం వాయదివా దుఃఖం నయోగీ పరమోమతంః (భ.గీ. 6-32)**

తా:- ఓ అర్జునా। ఎవడు సమస్త భూతములు యొక్క సుఖ దుఃఖములు తన సుఖ దుఃఖములుగా చూచునో అట్టివాడు అందరిలో నాకు ఎక్కువ ప్రీతి పాత్రుడు.

ఈ శ్లోకం ద్వారా శ్రీ కృష్ణ భగవానుని సందేశం ఏమిటంటే ఏ మానవుడైనా తాను సుఖంగా వుండాలని ఎలా కోరుకుంటాడో అలాగే భగవంతునిచే సృష్టింపబడిన ప్రతీ జీవి, ప్రతీ మానవుడు అలాగే కోరుకుంటాడని గ్రహించాలి. అలాగే తనకు కష్టం, దుఃఖం కలిగినపుడు ఎలా బాధపడతాడో ఈ సృష్టిలోని ప్రతీ జీవి యొక్క బాధ తనలాంటిదేనని గ్రహించాలి. అలా ఎవరయితే గ్రహిస్తారో వారు భగవంతునికి అత్యంత ప్రీతి పాత్రులవుతారు.

జీసస్ ఈ విధంగా తెలియ చేశారు. "నిన్ను నువ్వు ప్రేమించుకునే విధంగానే పొరుగు వారిని ప్రేమించు"

సత్యసాయిబాబా వారి ముఖ్యమైన సందేశం "అందరినీ ప్రేమించమనే"

పై వాటిని బట్టి మనం భగవంతునికి ఇష్టుడు కావాలన్నా, భగవంతుని అనుగ్రహం పొందాలన్నా సమస్త జీవులను మనలాగే ప్రేమించాలి.

మనకు భగవంతుడంటే భక్తి, గౌరవం, భయం వుంటే ఆయన చెప్పినట్లు చెయ్యాలి. ఆయనను పూజిస్తే సరిపోదు. ప్రార్థిస్తే సరిపోదు. నమాజు చేస్తే సరిపోదు.

ఎలా ప్రేమించాలంటే మనల్ని మనం ప్రేమించుకున్నట్లు. అంతేకానీ భార్యను, పుత్రుడిని, సోదరుని, తల్లిదండ్రులను ప్రేమించినట్లు కూడా కాదు.

ఈ ప్రేమ గురించి దేవుళ్ళు అంత గట్టిగా ఎందుకు బోధించారు? అని ఆలోచిస్తే 'ప్రేమే భగవంతుడు' అని తెలుస్తుంది. అందుచేత మనకు జీవితంలో ఉండవలసిన మొట్టమొదటి గుణం ప్రేమ. ప్రేమ మానవుని సహజ గుణం కావాలి. ప్రేమ లేకపోతే మానవుడే కాదు.

జీవితంలో సంపాదించుకోవలసింది ప్రేమ. ప్రేమే మనకు అందమైన ఆభరణం. ప్రేమే మన వద్ద వుండే శక్తివంతమైన ఆయుధం. ప్రేమే మన జీవితానికి పరిపూర్ణత నిచ్చేది. ఎందుచేతనంటే ఒక స్త్రీ తన అలంకారాలతో, మేకప్‌లతో ఆకర్షణీయంగా తయారై భర్తను ఆకర్షించ గలదు. కానీ ఈ ఆకర్షణ తాత్కాలికం. భౌతికాకర్షణతో దగ్గరయిన భర్త వాటిలో ఏది లోపించినా

దూరమవుతాడు.

కాని అందం లేకపోయినా, అలంకారాలు లేకపోయినా భర్తకు కావలసిన ప్రేమను అందించగలిగిన స్త్రీ, భర్త ప్రేమను శాశ్వతంగా పొందగలదు. ఇదే విధంగా భర్త భార్యను ప్రేమించాలి. అలాగే ఇతర కుటుంబ సభ్యుల నుంచి కూడా ప్రేమను పొందవచ్చు. వీరే కాదు బంధువులు, స్నేహితుల నుంచి కూడా. అందుచేత విలువైన ఆభరణాల కంటే, వజ్ర వైఢూర్యాలకంటే, అందం కంటే 'ప్రేమే' విలువైన ఆభరణం అని తెలుసుకోవాలి.

అలాగే బలంతో కాని, ఆయుధాలతో కాని, జయించలేనిది 'ప్రేమతో' జయించవచ్చు. ఏవైనా పనులు సాధించాలనుకుంటే 'ప్రేమతో' తేలికగా సాధించవచ్చు. ఘర్షణతో, విరోధంతో, దౌర్జన్యంతో పరిష్కారం కానివి 'ప్రేమతో' సాధించినవి ఎన్నో ఉన్నాయి. అందుచేత 'ప్రేమకు' మించిన ఆయుధం లేదు అని గట్టిగా చెప్పవచ్చు.

అలాగే మనకు ఎన్ని వున్నా, అంటే అందం, బలం, డబ్బు, హోదా ఇలా ఎన్ని వున్నా ప్రేమ అనే గుణం లేకపోతే జీవితం పరిపూర్ణమవ్వదు. సమాజం లో సరైన గౌరవం లభించదు. ఎవరూ పట్టించుకోరు. "కూరలో అన్ని రకాలు వేసి మధురంగా తయారు చేసినా, పైకి ఘుమఘుమలాడినా ఉప్పు లేకపోతే ఆ కూర, రుచి లేనిదే అవుతుంది" అలాగే 'ప్రేమ' అనే గుణం లేకపోతే జీవితానికి విలువ లేదు.

మనం 'ప్రేమ' అనే గుణాన్ని సంపాదించు కోవటానికి ప్రయత్నిం చాలి. అది సహజ సిద్ధంగా వుండాలి. అది అంతరం నుంచి ఉప్పొంగుతూ వుండాలి. వరదలా ప్రవహించాలి. అంతే కాని ప్రేమగా వుండాలని ప్రయత్నిస్తే ప్రయోజనం లేదు. మేకప్ చేసుకున్న అందం కొంత సేపు ఉన్నట్టే ప్రేమగా ఉండాలని ప్రయత్నిస్తే అది తాత్కాలికమే అవుతుంది. కాని సహజ సిద్ధమైన 'ప్రేమ' అన్ని సందర్భాలలో, అన్ని సమయాలలో, అందరి విషయాలలో కూడా పరిమళాలు వెదజల్లుతుంది.

ప్రేమ సహజ గుణం కావాలంటే ఒక్కటే మార్గం "ఆనాపానసతి ధ్యానం". చెయ్యడం ధ్యానం చేస్తే ప్రేమ మూర్తులవుతాం. అసలు ధ్యానానికి పరాకాష్ట ప్రేమ. అంటే మనలో ధ్యానం స్థితమైంది అని అనటానికి గుర్తు మనలో ప్రేమ ఉప్పొంగటమే. అన్నింటిని ప్రేమించ గలగటమే. కుటుంబ సభ్యులనే కాదు ఇరుగు, పొరుగు వారినే కాదు, సమస్త జీవులను, ప్రాణులను సమానంగా చూడగలగటమే. ఎవరి పట్ల బేధ భావం లేకుండా వుండటమే.

ఇతరులకు ఏది జరిగినా, వారికి ఏమి సంభవించినా, కష్టాలలో వున్నా చలించేవాడే నిజమైన ప్రేమమూర్తి. అందుచేత ధ్యానం చేసి 'ప్రేమ' అనే గుణాన్ని స్వంతం చేసుకుందాం.

## "మనం చేసే అన్ని పుణ్యకర్మలు ఒకటే ఫలితాలు ఇవ్వవు!"

సాధారణంగా మనం పూజలు, ప్రార్థనలు, పారాయణలు, కీర్తనలు, భజనలు, తీర్థయాత్రలు, పుణ్య స్నానాలు, నోములు, వ్రతాలు, స్తోత్రాలు, జపాలు లాంటి ఎన్నో రకాల పుణ్య కర్మలు చేస్తున్నాం.

కాని దేని వల్ల ఎంత ఫలితం వస్తుందో మనకు అవగాహన లేదు. కానీ అందరూ చేస్తున్నారని, ఆచారంగా వస్తుందని, చేయగలిగిందని, ఇలా మనకి ఇష్టమైనవి, మనకి తోచినవి చేస్తున్నాం. అన్నీ భగవంతుని కార్యక్రమాలే అని చేస్తున్నాం.

కానీ అన్నీ ఒకే విధమైన ఫలితం ఇవ్వవు. ఈ విషయం మనం తెలుసుకుంటే ఎక్కువ ఫలితం వచ్చే కర్మలనే ఆచరిస్తాం. తక్కువ సమయంలో, తక్కువ శ్రమతో మనం కోరుకున్న ఫలితాలు పొందగలుగుతాం.

**ఉత్తర గీతలో :-**

**శ్లో॥ పూజాకోటి సమం స్తోత్రం, స్తోత్రకోటి సమోజపం!**
**జపకోటి సమం ధ్యానం, ధ్యానకోటిసమోలయః (ఉ॥గీ॥4-52)**

పై శ్లోకంలోని అర్థాన్ని కొంచెం విశ్లేషించు కుందాం. కోటి పూజలు (అంటే మనం చేసే పూజలు, ప్రార్థనలు, భజనలు, కీర్తనలు, నోములు, వ్రతాలు మొ॥) ఒక స్తోత్రానికి (అంటే లలితా సహస్ర నామం, విష్ణు సహస్ర నామం మొ॥) సమానమని. అలాగే కోటి స్తోత్రాలు ఒక జపానికి సమానమని (జపంలో 3 రకాలు ఉన్నాయి. (1) వాచక జపం, (2) ఉపాన్సు జపం, (3) మానసిక జపం. ఈ మానసిక జపాన్నే ధ్యానమనుకుంటున్నారు) అలాంటి కోటి జపాలు ఒక ధ్యానానికి సమానమని సాక్షాత్తూ కృష్ణభగవానుడు పై శ్లోకం ద్వారా మనకు తెలియచేశారు.

అంటే ఒక గంట ధ్యానం చేయటం ద్వారా కోటి గంటలు అంటే ఒక జన్మంతా మానసిక జపం చేస్తే వచ్చే ఫలితం పొందవచ్చని తెలియచేశారు. అంటే అన్నింటికంటే ధ్యానం అత్యంత శక్తివంతమైనదని శ్రీ కృష్ణుని సందేశం. దీన్ని బట్టి ధ్యానం యొక్క గొప్పతనం మనకు అర్థమవుతుంది.

శ్రీ కృష్ణుల వారు ఇచ్చిన సందేశాన్ని బట్టి పూజ కంటే స్తోత్రం శక్తివంతమైనది. స్తోత్రం కంటే జపం శక్తివంతమైందని, జపం కంటే ధ్యానం

శక్తివంత మైనదని తెలుస్తుంది. కారణం పూజ శరీరంతో చేసేది. స్తోత్రం నోటితో చేసేది, జపం అన్నది మనసుతో చేసేది. కానీ ధ్యానం మనసు లేకుండా అంటే ఆలోచలు లేకుండా చేసే సాధన.

శరీరంతో చేసే సాధన కంటే నోటితో చేసే సాధన శక్తివంతమైనది. నోటితో చేసే సాధన కంటే మనస్సుతో చేసే సాధన శక్తివంతమైనది. మనసుతో చేసే సాధన కంటే మనసు లేకుండా (ఆలోచనలు లేకుండా) వుండే స్థితే అంటే ధ్యానం అత్యంత శక్తివంత మైనదని తెలుస్తుంది.

మనం చేసే చిన్న చిన్న పూజలు, స్తోత్రాలు, జపాల వల్ల జన్మ, జన్మల నుండి పేరుకు పోయిన సంచిత కర్మలు తొలగించుకోలేం. ఒక్క ధ్యాన సాధన ద్వారానే కర్మలు దగ్ధం చేసుకోగలం. అంటే కర్మల నుండి విముక్తులవ్వగలం. ముక్తి పొందగలం. అంటే అనారోగ్యం నుండి ముక్తి, అశాంతి నుండి ముక్తి, భయం నుండి ముక్తి, సమస్యల నుండి ముక్తి, దుఃఖం నుండి ముక్తి చివరకు శాశ్వత ముక్తి అంటే మోక్షం కూడా పొందగలం.

ఒక విషయం ఆలోచిద్దాం మనకు 1 కోటి రూపాయలు అప్పు ఉన్నప్పుడు ఒక చిన్న కిళ్ళీ షాపు లాంటి వ్యాపారం, లాండ్రీ వ్యాపారం, కూరగాయల వ్యాపారం లేక ఫుట్‌పాత్ వ్యాపారం చేస్తే మన అప్పు తీరదు కదా. వడ్డీ పెరిగి పెరిగి పూర్తిగా మునిగిపోతాం. కానీ దానికి తగ్గ వ్యాపారం చేస్తేనే కోటి రూపాయల అప్పు తీర్చగలం. అలాగే మనం అనేక జన్మలలో చేసినటువంటి సంచిత కర్మలనే పెద్ద కొండ దగ్ధం కావాలంటే సామాన్యమైన పూజలు, స్తోత్రాలు, జపాలు వల్ల సాధ్యం కాదు. సరికదా కర్మలు ఇంకా పెరుగుతాయి. జన్మ వృధా అవుతుందే తప్ప మనం కోరుకున్న ఫలితాలు, లాభాలు పొందలేం.

శక్తివంతమైన ధ్యానం చేస్తే జ్ఞానులై, జన్మ రాహిత్యం పొంది ఇంకా ఎన్నో ఉన్నత లోకాలలో శాశ్వత సౌఖ్యం పొందగలం.

ఈ భూలోకమనేది ఒక పాఠశాల వంటిది. ఒక వ్యక్తి 5వ తరగతిలోనే ఎన్నో సంవత్సరాలు వున్నట్టు. మనం ఈ భూలోకంలోనే ఎన్నో వందల జన్మలు తీసుకుని దుఃఖపడుతూ జీవిస్తే ప్రయోజనం లేదు. కొంచెం మన బుద్ధి ఉపయోగించి ధ్యాన సాధన చేసి ఎలిమెంటరీ పాఠశాల వంటి ఈ భూలోకాన్ని వదలి సృష్టిలో వున్న హైస్కూలు లాంటి లోకాలకు, కాలేజీ లాంటి లోకాలకు, యూనివర్శిటీ లాంటి లోకాలకు వెళ్ళటానికి ప్రయత్నించాలి. ఇదే మానవ జన్మ యొక్క లక్ష్యమని తెలుసుకోవాలి. ఇదే పత్రిగారు ఇచ్చే సందేశం కూడా.

# "భగవంతుని మెప్పు పొందాలి!"

భగవంతుడు ఏమనుకుంటున్నాడో మనకు తెలియదు కాని మనం ఏమనుకుంటున్నామో భగవంతునికి తెలుసు. భగవంతుడు పూజా మందిరం లో, గుడిలో, చర్చిలో లేక మసీదులోనే వున్నాడనుకుని ఆయనను అక్కడకే పరిమితం చేసి అక్కడ మాత్రమే పవిత్రంగా ఉంటున్నాం. కానీ భగవంతుడు మనలో అంతర్లీనంగా ఆత్మరూపంలో ఉంటూ మన దుష్ట, స్వార్థపూరిత ఆలోచనలు, మన అసత్యపు మాటలు, పాపపు పనులు గమనిస్తున్నాడు. ఆయనకు ఏమీ తెలియదని, మనమే తెలివైన వారమని అనుకుంటాం.

భగవంతుడు అంతర్లీనంగా ఉండటమే కాదు, ప్రతీ సందర్భంలో, ప్రతీ విషయంలో మనల్ని హెచ్చరిస్తూనే ఉంటాడు. కానీ మనం అది భగవంతుని హెచ్చరిక అని తెలుసుకోకుండా వాటిని పట్టించుకోకుండా ఎన్నో తప్పులు, పాపాలు చేస్తూ, చివరకు వాటికి తగ్గ శిక్షలు అనుభవిస్తున్నాం. దుఃఖపడుతున్నాం.

భగవంతుడంటే నిజంగా భక్తి, భయం వుంటే అంతరాత్మ రూపంలో ఆయన ఇచ్చే సలహాలు పాటించి ఆయనను మెప్పించాలి. అంతే కానీ ఆయనను పూజలు, ప్రార్థనలు, నమాజులు, భజనలు, మొక్కులు, అల్పమైన కానుకల ద్వారా మెప్పించలేమని తెలుసుకోవాలి.

మన ఆలోచనా విధానం ఎలా వుందంటే భగవంతుడు గుడిలో, మందిరంలో, చర్చిలో, మసీదులో మాత్రమే వుంటాడు, మనకి తోచినపుడు, మనం వెళ్ళినపుడు మన కోసం ఎదురుచూస్తూ మనం ఇచ్చే కానుకల కోసం ఆశపడుతూ, మనం కోరగానే మన కానుకలు తీసుకుని మన పాపాలు, తప్పులు, మోసాలు, దుర్మార్గాలు తన శక్తిచేత శుద్ధి చేసి అంటే క్షమించి ఇంక ఫరవాలేదు నువ్వు ఎక్కువ పాపాలు దుర్మార్గాలు చేసి, ఇంకా ఎక్కువ కానుకలు తెచ్చి నా మెప్పు పొందుతూ వుండు, నేను ఇక్కడ నీ కోసం, నీ కానుకల కోసం ఎదురుచూస్తూ వుంటాను అన్నట్లుగా ప్రవర్తిస్తున్నామంటే భగవంతుని గూర్చి మన ఆలోచనా స్థాయి ఎలా వుందో? మనం భగవంతుని శక్తి ఎంత తక్కువగా అంచనా వేస్తున్నామో? తెలుసుకోవాలి.

ఇంకా మన ఆలోచనా విధానం ఎలా వుందంటే భగవంతుడు కరుణామయుడు, దయామయుడు. ఆయన మన తప్పులను పాపాలను క్షమించడానికే వున్నాడు, అందుచేత మన జీవితంలో మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించి, పాపాలు చేసి, పూజతోనో, ప్రార్థనతోనో, నమాజుతోనో మన పాపాలను తొలగించుకోవచ్చు అని భావిస్తున్నాం. అంతే కానీ భగవంతుడు మంచివారి పట్ల

ఎంత దయగా ఉంటాడో, దుర్మార్గుల పట్ల, పాపాలు చేసే వారి పట్ల, అంత కఠినంగా వ్యవహరిస్తాడని తెలుసుకోలేక పోతున్నాం.

భగవంతుడు "దుష్టశిక్షణా చేస్తాడు, శిష్ట రక్షణా చేస్తాడు". అందుచేత భగవంతుని గురించి తెలుసుకోలేక, భగవంతుని శక్తి అర్థం చేసుకోలేక పాపాలు చేస్తూ జీవితంలో బాధలు, దుఃఖాలు, కష్టాలు, సమస్యలు, రోగాలు కొని తెచ్చుకుంటున్నాం. ఇవన్నీ మనం చేసిన పాపాలకు ఫలితాలేనని తెలుసుకోలేక ,వేరే వేరే కారణాలు చెప్పుకుంటున్నాం.

అందుచేత మన ఆలోచనలు శుద్ధి చేసుకోవాలి. మాటలు శుద్ధి చేసుకోవాలి, పనులు శుద్ధి చేసుకోవాలి. గుళ్ళలో వున్నప్పుడు, చర్చిలో వున్నప్పుడు, మసీదులో వున్నప్పుడు ఎలా ప్రవర్తిస్తామో ప్రతీక్షణం అన్నిచోట్లా అలాగే ప్రవర్తించాలి. అంతరాత్మ హెచ్చరికలను పాటించాలి.

భగవంతుని కృపకు పాత్రులు కావాలంటే భగవంతుని శక్తి తక్కువగా అంచనా వేయకూడదు. సామాన్యమైన చర్యలతో భగవంతుని వశం చేసు కోలేమని గుర్తించాలి. మంచి పనులు చెయ్యాలి. మంచి గుణాలు కలిగి వుండాలి, లోక కళ్యాణానికి పాటు పడాలి, స్వార్థాన్ని వదలాలి. మనం చేసే ప్రతీ మంచి పని, ప్రతీ చెడ్డ పని గమనించబడుతుందని మరచిపోకూడదు. మనం చేసే ప్రతీ పనికి ఫలితం వచ్చి తీరుతుంది. ప్రత్యేకించి ప్రార్థించనక్కరలేదు, పూజించి కోరనక్కరలేదు.

మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, మనం అంతరాత్మ సూచన ప్రకారం నడుచుకుంటే అంటే సాక్షాత్తూ భగవంతుడు చెప్పిన ప్రకారం నడుచుకుంటే, ప్రత్యేకించి భగవంతుని పూజించ నక్కరలేదు. ప్రార్థించ నక్కరలేదు. నమాజు చెయ్యనక్కరలేదు. ఎందుచేతనంటే మనం సాక్షాత్తు భగవంతుని ఆదేశం ప్రకారమే నడుచుకుంటున్నాం కాబట్టి. భగవంతుని ఆదేశం కాదని భగవంతుని విగ్రహం పూజించడం అర్థం లేని పని అవుతుంది.

ఒక షాపు యజమాని తన గుమస్తాకు తన షాపు అప్పగించి వూరు వెళ్ళి ఒక నెల తరువాత తిరిగి వచ్చాడు. ఈ నెల రోజులలో ఆ గుమస్తా యజమాని చెప్పినవేమీ చేయడు. షాపులో సరుకంతా అమ్మి డబ్బు కాజేస్తాడు. యజమానికి చాలా నష్టం వస్తుంది. కానీ ఆ గుమస్తా మాత్రం ఇంటిదగ్గర ప్రతీరోజు ఆ యజమాని ఫోటో పెట్టి పూజిస్తాడు. హారతి ఇస్తాడు. ఎంతో భక్తి ఉన్నట్టుగా ప్రవర్తిస్తాడు.

కాస్త ఆలోచించండి ఇప్పుడు ఆ యజమాని తనకు నష్టం కలుగజేసి, తాను చెప్పిన దానికి భిన్నంగా ప్రవర్తించినందుకు గుమస్తాను శిక్షిస్తాడా? లేక తనకు నష్టం కలిగినా తనను పూజిస్తున్నాడని అతనిని క్షమిస్తాడా? అలా చేస్తే ఇలా ఎన్నిసార్లు క్షమించగలడు? గుమస్తా తనను పూజిస్తున్నాడని చెప్పి ఎంత

వరకు నష్టం భరించగలడు? ఖచ్చితంగా నిలదీస్తాడు కదా?

నేనంటే అంత భక్తి, గౌరవం ఉన్నపజ్పుడు నేను చెప్పినట్టు ఎందుకు చెయ్యలేదు? నేను చెప్పినట్టు చెయ్యకుండా నేనంటే భక్తి అంటే సరిపోతుందా? నేను చెప్పినట్టు చెయ్యకుండా నాకు నష్టం కలిగించి నన్ను పూజిస్తున్నానంటే నేను నమ్ముతానా? నాకు కావలసింది నేను చెప్పినట్టు చెయ్యడమే. నాకు నష్టం కలిగించకుండా వుండటమే. అంతే కానీ, నాకు నష్టం కలిగించి నా పూజ చేస్తున్నానంటే, అది అంతా ఉత్త నాటకమే అని తప్పకుండా గుమస్తాను శిక్షిస్తాడు. పని నుంచి తొలగిస్తాడు.

మరి సామాన్య మానవుడైన యజమానే తన పూజకు, పొగడ్తలకు ప్రాముఖ్యం ఇవ్వనపుడు, అనంతశక్తిస్వరూపుడు, సకల చరాచర సృష్టికర్త అయిన ఆ పరమాత్మ, అంతరాత్మ రూపంలో తాను చెప్పింది పాటించకుండా, తనకు చేసే పూజలకు, భజనలకు, ప్రార్థనలకు, నమాజులకు ప్రాముఖ్యం ఎలా ఇస్తాడు? మన తప్పులను ఎలా క్షమిస్తాడు?

ఆయన సృష్టిని మన స్వార్థం కోసం మన ఆనందం కోసం, చిన్నాభిన్నం చేస్తూంటే, స్వేచ్ఛగా, ఆనందంగా జీవించవలసిన సాటి ప్రాణులను సంహరించి, హింసిస్తూంటే, అసత్యాలు పలుకుతూ, అధర్మంగా నడుచుకుంటూ అందరినీ మోస గిస్తుంటే, భగవంతుడు చూస్తూ ఊరుకుంటాడా? తప్పకుండా శిక్షించే తీరతాడు.

అంతే కానీ మనం చేసే పూజలకు, ప్రార్థనలకూ వశుడు కాడని గ్రహించాలి. భగవంతుని శక్తి తెలుసుకోవాలి. భగవంతుడు సర్వాంతర్యామి అని గుర్తుంచుకోవాలి. అందుచేత పూజ కంటే అంతరాత్మ రూపంలో భగవంతుడు చెప్పే విధంగా నడుచుకోవటానికే ప్రాముఖ్యం ఇవ్వాలి. అదే మనం భగవంతునికి ఇచ్చే నిజమైన గౌరవం. ఆయన పట్ల మనం చూపించే నిజమైన భక్తి. అప్పుడే ఆయన శక్తిని మనం అర్థం చేసుకున్నట్టు. అప్పుడే ఆయన మెప్పు పొందుతాం.

ఆత్మ రూపంలో భగవంతుడు చెప్పినట్లు నడుచుకునే శక్తి రావాలంటే ధ్యానం చెయ్యాలి. ప్రస్తుతం మనం మనస్సుకే ప్రాముఖ్యం ఇస్తున్నాం. ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. ధ్యానం బాగా చేస్తే మనస్సు ప్రాముఖ్యం తగ్గి ఆత్మ ప్రాముఖ్యం పెరుగుతుంది. అపుడు భగవంతుడు చెప్పిన ప్రకారం నడచుకుం టాం. భగవంతుని మెప్పు పొందుతాం. జీవితాన్ని ధన్యం చేసుకుంటాం.

## "భక్తితో ముక్తిని పొందినవారితో పోల్చుకోకూడదు!"

ధ్యానం గురించి విన్నవారు అవగాహన లేక, ధ్యానం చేస్తే భక్తికి, భగవంతునికి దూరమై పోతున్నామేమోనని భయపడతారు. భగవంతుని వదిలేస్తున్నామేమోనని అనుకుంటారు. అందుచేత మాకు ధ్యానం అవసరం లేదు. మేము ఏదో ఒక భక్తి మార్గంలో వున్నాం. మళ్ళీ వేరే మార్గమెందుకు అంటారు. ఇంకా భక్తప్రహ్లాదుడు, ధృవుడు, మార్కండే యుడు, భక్తపోతన, త్యాగయ్య, అన్నమయ్య, భక్తతుకారాం. ఇలా ఎంతో మందిని ఉదాహరణగా పేర్కొంటూ వారంతా భక్తి మార్గంలో తరించగా లేంది మేము తరించలేమా? కొత్త మార్గాలు మాకెందుకు? అంటారు.

అలా ప్రహ్లాదుడు మొదలగు వారితో పోల్చుకుంటూంటారు. వారితో తాము సమానమైనట్టు భావిస్తారు. కానీ వారి భక్తికి, వీరి భక్తికి సంబంధమే లేదని, అసలు వారితో పోల్చుకోవటానికి కూడా సరిపోమని భావించరు.

భక్తి మార్గంలో తరించిన వారంతా ప్రాపంచిక సుఖాల్ని, సమస్త భోగాల్ని, సంసార సుఖాల మీద మమకారాన్ని వదలి ఆ భగవంతుని పొందాలనే ఒకే లక్ష్యంతో, అదే తపనతో జీవించారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు వచ్చినా తమ లక్ష్య సాధనను వారు వదలలేదు. వారి ప్రయత్నాన్ని మానలేదు.

కానీ అటువంటి వారితో పోల్చుకుని భక్తి మార్గంలో వున్నామనుకుంటారు. కానీ గమనిస్తే వారికి మనకు అసలు పోలికే వుండదు. వారితో పోల్చుకోవడానికి సరిపోం కూడా. మనం భగవంతుడంటే ఇష్టమంటాం. కానీ ఆ భగవంతుని మీద దృష్టి వుంచం. ఎంతసేపూ మిగతా వాటి మీద అంటే సంపాదన మీద, సంసారం మీద, సమస్యల మీద, టి.వి.ల మీద, కార్ల మీద, భోగాల మీద, సుఖాల మీద, పదవుల మీద, తిండి మీద, ఇలా అన్నిటి మీదా దృష్టి వుంచుతున్నాం. వాటిని పొందటానికే ప్రయత్నిస్తాం. కానీ భగవంతుని మీద దృష్టి వుంచం. ఆయనను పొందటానికి ప్రయత్నించం.

ఆలోచించండి మన దృష్టి భగవంతుని మీద లేనపుడు, భగవంతుని దృష్టి మనమీద ఎలా వుంటుంది?

పైగా భగవంతుడంటే ఇష్టమంటాం. భక్తులనుకుంటాం. ఆలోచిస్తే మన

ఇష్టం, భగవంతుని మీద కంటే కోరికల మీదే ఎక్కువ వుంటుంది. మన ఇష్టమంతా భగవంతుడు కోరికలు తీరుస్తాడనే. కష్టాల నుంచి బయట పడేస్తాడనే. అంతేకానీ నిజమైన ఇష్టం కాదు.

ఎందుచేతనంటే కోరికలు తీరక పోతే ఆ భగవంతుని మార్చే స్తున్నాం. భగవంతుళ్ళను మార్చేవారు భగవంతుని భక్తులెలా అవుతారు? అది భక్తి ఎలా అవుతుంది?

పైగా ప్రహ్లాదుడితో పోల్చుకుంటాం. ప్రహ్లాదుడి తో పోల్చుకోవటానికి ప్రహ్లాదుడి భక్తికి మన భక్తికి అసలు సంబంధం ఉందా? ప్రహ్లాదుడు కష్టాలు వచ్చినా భగవంతుని పొందాలనే తపన, లక్ష్యం మార లేదు. ఎన్నిసార్లు చంపటానికి ప్రయత్నించినా చావటానికి సిద్ధపడ్డాడు కానీ చలించలేదు. భగవంతుణ్ణి మార్చలేదు.

కానీ నేను భక్తుడ్ని అనే మనం చిన్న కష్టం వచ్చినా భగవంతుడ్ని మార్చేస్తాం. అసలు కష్టాలు లేక పోతే భగవంతుడే గుర్తుండడు. పైగా భగవంతుడంటే ఇష్టమంటాం. కానీ ఇష్టమైన భగవంతుడి మీద దృష్టి వుంచం. భగవంతుని మీద దృష్టి వుంచటానికి టైమ్ లేదంటాం. పైగా భక్తుడినంటాం. అంటే మాటలు చెబుతాం. చేతలు వుండవు. మరి ప్రహ్లాదుడితో ఎలా పోల్చుకుంటాం? వారు మనం ఒకటి ఎలా అవుతాం?

అందుచేత వారితో పోల్చుకునే ముందు అసలు భగవంతుడంటే ఎవరు? ఎలా వుంటాడు? ఆయన భక్తుడు కావాలంటే ఏం చెయ్యాలి? అసలు భక్తి అంటే ఏమిటి? పూజ చేసి కోరికలు కోరడమే భక్తా? లేక ఏం చెయ్యాలో తెలుసుకోవాలి.

ఉపనిషత్తులలో భక్తి అంటే "స్వస్వరూపాను సంధానం భక్తిరీత్యభిధీయతే" అని చెప్పబడింది.

అంటే ఎవరయితే 'తన స్వరూపంతో' అంటే "ఆత్మతో అనుసంధానమై వుంటారో దానినే భక్తి" అంటారు. అంటే ఆత్మ మీద దృష్టి వుంచడమే భక్తి అవుతుంది. దాని మార్గమే ధ్యానం . అంటే ధ్యానం చేసిన వారే భక్తులు. ధ్యానం చెయ్యడమే భక్తి అని తెలుసుకోవాలి. మనం పోల్చుకునే వారంతా నిత్యం భగవంతుని మీద అంటే ఆత్మ మీద దృష్టి వుంచిన వారే అంటే ధ్యానం చేసిన వారే. అందుచేత ముక్తిని పొందిన వారి భక్తితో మనల్ని పోల్చుకోకూడదు.

# భగవంతుని మీద ఇష్టం పెంచుకోనేముందు?

భగవంతుడంటే ఇష్టమా? అని అడిగితే వెంటనే అందరి కంటే భగవంతుడంటేనే ఇష్టమంటాం.

భగవంతుడంటే అంత ఇష్టపడటానికి కారణమేమిటి? ఎవ్వరి మీద లేని ఇష్టం భగవంతుని మీద ఎందుకు వుంది? ఆలోచిస్తే భగవంతుడంటే ఇష్టపడటానికి ముఖ్య కారణం భగవంతుడు మన కోరికలు తీరుస్తాడని. ఆయన తప్ప మన కోరికలు తీర్చేవారు, మన సమస్యలు, బాధలు పోగొట్టేవారు ఎవరూ లేరనే.

భగవంతుడంటే ఇష్టమంటాం. కానీ ఇష్టమైన భగవంతుని గూర్చి తెలుసుకోవటానికి మాత్రం ప్రయత్నించం.

కానీ మనం ఎవరి మీదనైనా, దేని మీదనైనా ఇష్టం పెంచుకునేముందు ఆ వ్యక్తి వల్ల కాని, ఆ వస్తువు వల్ల కాని, లాభం కలుగుతుందా? మన అవసరాలు తీరుతాయా? అని చూస్తాం. తీరుతాయంటేనే వారి మీద ఇష్టం పెంచుకుంటాం. వారిని పొందటానికి ప్రయత్నిస్తాం.

అలాగే ఒక వస్తువు సమకూర్చు కునేటపుడు ఎన్నో ఆలోచిస్తాం. ఎంతో ఆరా తీస్తాం, ఎన్నో తెలుసుకుంటాం. ఆ వస్తువు ఎవరు తయారు చేసారు? దాని క్వాలిటీ ఎంత? అది కొంటే మనకు బాగా ఉపయోగపడుతుందా? మనం వెచ్చించిన విలువకు సరిపోతుందా? అని ఎన్నో రకాలుగా ఆలోచించి కాని ఆ వస్తువు మీద ఇష్టం పెంచుకోం. దానిని సంపాదించుకోం. మనం అలా అన్నిటి గురించి తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాం. కానీ అంతగా ఇష్టపడే భగవంతుని గూర్చి మాత్రం తెలుసుకోవటానికి ప్రయత్నించం.

అసలు భగవంతుడంటే ఎవరు? ఆయన ఎక్కడ వుంటాడు? ఎలా వుంటాడు? ఆయన శక్తి ఎంత? ఆయన ప్రవర్తన ఎలాంటిది? ఆయన భూమి మీద కొంతమందికి మాత్రమే పరిమితమా? తనను ఆరాధించే వారిని మాత్రమే అనుగ్రహిస్తాడా? లేక అందరినీ అనుగ్రహిస్తాడా? ఆయన ఆలయాల్లో, ప్రార్థనా మందిరాల్లో మాత్రమే ఉంటాడా? మన కోరికలు విన్నవించుకోవాలంటే ఆయనకు మధ్యవర్తులు అవసరమా? అసలు ఆయన కోరికలు తీర్చేవాడా? ఆయన పాపాలు, తప్పులు క్షమించటానికి మాత్రమే వున్నాడా? ఆయనకు ఇంకే పనిలేదా? ఆయన ఎంతసేపూ అందరి పట్ల ప్రేమ, దయ, కరుణ మాత్రమే కలిగి వుంటాడా?

పాపాలు చేసే వారి పట్ల ఆయన ప్రవర్తన ఎలా వుంటుంది? ఆయన శిష్టరక్షణే కాని దుష్ట శిక్షణ చెయ్యడా? ఇలా ఆయన గూర్చి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

ఆయన మన ఒక్కరికే భగవంతుడా? సృష్టిలో సమస్త జీవులకూ ఆయన భగవంతుడా? అసలు ఆయన భూమి మీదకు వస్తే ఆయన ప్రవర్తన ఎలా వుంటుంది? అసలు ఆయన మన ముందుకు వస్తే ఆయనను గుర్తించగలమా? ఆయనంటే ఇష్టమంటాం, ఎన్నో తెలివితేటలు ఉన్నాయనుకుంటాం, మరి ఇన్ని వుండి కూడా ఆయన మన ముందుకు వస్తే గుర్తించలేనపుడు మనం ఆయన భక్తులమెలా అవుతాం?

ఆయన సర్వత్రా ఉంటాడా? కొన్ని ప్రదేశాలలోనే వుంటాడా? అసలు ఆయనకు రూపం వుందా? పేరు వుందా? ఆయన మన నుంచి ఏం ఆశిస్తాడు? మన ప్రవర్తన ఎలా వుండాలనుకుంటాడు? మన గుణాలు ఎలా వుండాలి? మనం ఏం చేస్తే ఆయన ఆనందిస్తాడు? ఆయన్ను సంతోష పెట్టాలంటే ఏం చెయ్యాలి? అసలు మన ప్రవర్తన ఎలా వుండాలి? అన్నవి ఆలోచించాలి. ఇవన్నీ ఆలోచిస్తేనే ఆయనకు నచ్చేటట్టు ప్రవర్తించగలం. ఆయన అనుగ్రహం పొందగలం. జీవితాన్ని ధన్యం చేసుకోగలం. అందుచేత భగవంతుని మీద ఇష్టం పెంచుకునే ముందు ఆయన గురించి తెలుసుకోవాలి. అవగాహన పెంచుకోవాలి.

భగవంతుని శక్తి తెలియాలన్నా, ఆయన గురించి అవగాహన చేసుకోవాలన్నా ధ్యానం చెయ్యాలి. ధ్యానం చేస్తే నిరాకారుడైన భగవంతుని గూర్చి తెలుసుకోవడమే కాదు. ఆయనను సాక్షాత్కరించుకోగలం.

# భగవంతుని శక్తి తగ్గించకూడదు!

సాధారణంగా భగవంతుని గూర్చి అడిగితే ఈ విధంగా చెపుతాం. భగవంతుడు నిరాకారుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు ఆయన అన్నిటా, అంతటా వున్నాడు అణువణువు వ్యాపించి వున్నాడంటూ భక్త ప్రహ్లాదుడు చెప్పిన "అందుగలడిందు లేడను సందేహంబు వలదు, ఎందెందు వెదకినా అందందే గలడు" అని కూడా చెపుతాం.

భగవంతుడు సర్వాంతర్యామి అంటూ కూడా మనం గుడిలోనూ, చర్చిలోనూ, మసీదులో మాత్రమే పవిత్రంగా ఉంటున్నాం. కానీ బయట ఆ పవిత్రత, ఆ వినయం, ఏ మాత్రం కనపడవు. మన ప్రవర్తన పూర్తిగా మారిపోతుంది. భగవంతుడు గుళ్ళోనే ఉంటాడు విగ్రహమే భగవంతుడు అన్నట్టుగా ఉంటుంది. మిగిలిన చోట్ల భగవంతుడు లేడన్నట్లుగా ఉంటుంది.

కానీ అడిగితే మాత్రం ఆయన సర్వాంతర్యామి ఆయన గుడిలోనే కాదు అన్నిచోట్లా వుంటాడు. అన్నిచోట్లా చూడగలడు అని చెపుతాం. మరి ఇవన్నీ చెబుతున్నాం అంటే భగవంతుని గురించి తెలిసినట్లే కదా? మరి తెలిసి కూడా తెలియని వారిలా అజ్ఞానంతో ఎందుకు ప్రవర్తిస్తున్నాం? మన ప్రవర్తన ఆలయం, చర్చి, మసీదు వరకే పరిమితం చేస్తున్నామంటే భగవంతుని శక్తిని పరిమితం చేయడం కాదా? ఆయన శక్తిని తగ్గించి ఆ రకంగా ప్రవర్తించడం అన్యాయం కాదా?

విగ్రహం భగవంతుడైతే ఆయన ఎదురుగా వున్నప్పుడు మన కోరికలు పైకి చెప్పకుండా మనసులోనే ఎందుకు చెప్పుకుంటున్నాం? అని అడిగితే భగవంతుడు సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు, మనసులో చెప్పుకున్నా తెలుసుకోగల శక్తి వుందని చెపుతాం. మరి మనసులో అనుకున్నా తెలుసుకోగల శక్తి ఉన్నప్పుడు గుళ్ళోను, చర్చిలోనే కాకుండా ఎక్కడ అనుకున్నా తెలుసుకోగలడు కదా? అటువంటప్పుడు గుళ్ళోను, చర్చిలోను అనుకుంటేనే తెలుస్తుందన్నట్టుగా ప్రవర్తిస్తూ ఆయన శక్తిని గుడికి, చర్చికి పరిమితం చెయ్యడం అన్యాయం కాదా?

ప్రపంచంలో ఎవరు ఏ మారుమూల ప్రాంతంలో మనసులో అనుకున్నా భగవంతునికి తెలుసుకోగల శక్తి వుందని, ఆయన శక్తి అపారమని చెపుతాం.

కానీ ఆయనకు వినపడదన్నట్లుగా మైకులు పెట్టి భజనలు చేస్తూ, ప్రార్థనలు చేస్తూ గట్టిగా అరుస్తాం. మరి మైకు పెట్టి గట్టిగా అరుస్తూ భగవంతునికి తెలియ దన్నట్టుగా ప్రవర్తించడం ఆయన శక్తిని తగ్గించడం కాదా? ఆయన శక్తికి తగ్గట్టుగా ప్రవర్తించకపోవడం అన్యాయం కాదా?

భగవంతునికి మనసులో అనుకున్నది కూడా తెలుసుకోగల శక్తి ఉన్నప్పుడు, మన కష్టాలు ఆయనకు తెలియవా? అటువంటప్పుడు ఆయనకు మన కష్టాల గురించి ప్రత్యేకించి చెప్పాలా? అలా చెప్పుకుంటున్నామంటే ఆయన శక్తిని శంకించినట్టు కాదా? అలా శంకించడం అన్యాయం కాదా?

భగవంతుని కోరనవసరం లేదు. "చెయ్య వలసింది చేస్తే పొందవలసింది పొందుతామని" తెలుసుకుని ప్రవర్తించడం, చెయ్యడానికి ప్రాముఖ్యం ఇవ్వడమే భగవంతుని శక్తిని అర్థం చేసుకోవడం.

భగవంతునికి మనసులో అనుకున్నవి తెలుసుకోగల శక్తి వున్నప్పుడు మనలో వున్న చెడు భావాలు, దుష్ట ఆలోచనలు తెలుసుకోలేడా? మరి మన భావాలు, ఆలోచనలు పవిత్రంగా ఎందుకు ఉంచుకోవడం లేదు? మన మనసులోని కోరికలతో పాటు మన స్వార్థ పూరిత ఆలోచనలు, మోసపూరిత ఆలోచనలు, దుర్మార్గపు ఆలోచనలు కూడా తెలుస్తాయి కదా? మరి అలాంటి ఆలోచనలు లేకుండా మనస్సును ఎందుకు శుద్ధంగా ఉంచుకోవడం లేదు? అలా ప్రవర్తించడం భగవంతుని శక్తిని శంకించడం కాదా? ఆయన శక్తిని తగ్గించడం కాదా? ఇది అన్యాయం కాదా?

ఆలయానికో, చర్చికో వెళ్ళి మన పాపాలు తొలగించమని భగవంతుని ప్రార్థిస్తాం. భగవంతుడు ఆలయంలోనే ఉంటే బయట మనం చేసే పాపాలు ఆయనకు తెలియవు కదా? భగవంతుడు బైట లేనపుడు మనం చేసే పాపాలు ఎవరు రికార్డు చేస్తారు? మరి రికార్డులో లేని పాపాలను తొలగించమని ప్రార్థించడం దేనికి? రికార్డు కాని పాపాలు గురించి బెంగ ఎందుకు? ప్రార్థన ఎందుకు?

అసలు మనం చేసేవన్నీ మంచి పనులే కదా? పాపాలు చెయ్య లేదు కదా? పాపాలు క్షమించమని ప్రార్థించడం దేనికి? మరి అంత గట్టిగా ప్రార్థిస్తున్నామంటే పాపాలు చేసినట్టే కదా? పాపాలు చేస్తున్నామని తెలిసినట్టే కదా? మరి తెలిసి పాపాలు ఎందుకు చేస్తున్నట్టు? అసలు పాపాలు చెయ్యకపోతే

తొలగించమని ప్రార్థించనవసరం లేదు కదా? భగవంతుడు పాపాలు తొలగించకపోతే జీవితంలో కష్టాలు వస్తాయని తెలుసు కనుకనే తొలగించమని ప్రార్థిస్తున్నాం మరి కనీసం ప్రార్థించిన తరువాత నుంచైనా పాపాలు చెయ్యకుండా వుంటామా? జీవితాన్ని సరిదిద్దుకుంటామా? సరైన విధంగా జీవిస్తామా? అందుచేత భగవంతుని శక్తిని గుర్తించాలి? ఆయన శక్తిని తగ్గిస్తే నష్టపోయేది మనమేనని తెలుసుకోవాలి.

ఎక్కడ కోరుకున్నా భగవంతునికి తెలుసుకోగల శక్తి వున్నప్పుడు మన కోరికలు తెలియ పర్చటానికి మధ్య వర్తులు అవసరమా? మన కష్టాలు తొలగించమని మన తరపున ఇంకొకరు ప్రార్థించాలా? మన ప్రార్థన భగవంతుడు స్వీకరించడా? మన కోరికలు విన్నవించుకోవటానికి ఆయన ఎవరినైనా నియమించుకున్నాడా? అలా మధ్యవర్తి లేకపోతే మనం కోరుకునే కోరికలు, చెప్పుకునే కష్టాలు వినడా? అనుగ్రహించడా?

భగవంతునికి అంతా ఒక్కటే కదా? అందరం ఆయన బిడ్డలమే కదా? ఆయన బిడ్డల పట్ల ఆయనకు వివక్ష ఉంటుందా? అలా వుంటే ఆయన భగవంతుడెలా అవుతాడు? మరి భగవంతుని ప్రార్థించడానికి, కోరికలు, కష్టాలు చెప్పుకోవటానికి మధ్యవర్తులను ఎందుకు ఆశ్రయిస్తున్నాం? అలా ఆశ్రయిస్తున్నామంటే భగవంతుని శక్తిని శంకించినట్టు కాదా? తగ్గించినట్టు కాదా? అలా తగ్గించడం అన్యాయం కాదా?

అలా ప్రతీ విషయంలో భగవంతుడు జశక్తిమంతుడు, ఆయన శక్తి అపారమంటూనే ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం లేదు. ఆయనను విగ్రహంగానో, ఫోటోగానో చేసి ఆయనను గుడికి, చర్చికి, మసీదుకు, పూజా మందిరానికి పరిమితం చేస్తున్నాం. భగవంతుడు అక్కడ మాత్రమే వున్నట్టుగా విగ్రహమే భగవంతుడన్నట్టుగా ప్రవర్తిస్తున్నాం. మరి భగవంతుడు సర్వాంతర్యామి అయినప్పుడు, ఆయన శక్తి అపారమైనపుడు మన ప్రవర్తన, చేతలు అక్కడికే పరిమితం చేయకూడదు. అన్నిచోట్లా అదే భావంతో ఉండాలి. అదే విధంగా ప్రవర్తించాలి. అలా ప్రవర్తిస్తేనే మనం భగవంతుని శక్తి గుర్తించినట్లు. భగవంతుని అర్థం చేసుకున్నట్లు. భగవంతుని గౌరవించినట్లు.

భగవంతుడు ఈ అఖండమైన సృష్టికి మూల కారకుడు. సకల చరాచర

సృష్టిని నడిపిస్తున్నవాడు. ఒక్క భూమే కాదు కోటానుకోట్ల లోకాలను నడిపిస్తున్నవాడు. సృష్టిలో కోటానుకోట్ల లోకాలే కాదు, మనం ఇప్పటికీ తెలుసుకోలేని ఎన్నో రహస్యాలు వున్నాయి. అసలు మనం గొప్పగా భావించే భూమి భగవంతుని సృష్టిలో పరమాణువు కన్నా చిన్నది. అలాంటి భూమి మనకు అఖండమైనది. అలాంటి భూమి మీద మన ఉనికి ఎంతో ఊహించుకోవచ్చు.

భగవంతునికి పుట్టుకా లేదు. చావులేదు. ఈ సృష్టి ఎప్పుడు జరిగిందో, ఎలా జరిగిందో మన ఊహకు అందనిది. భగవంతుని సృష్టికి ఆది లేదు, అంతం లేదు. ఇది తెలుసుకోగల శక్తి కూడా మనకు లేదు. కోటానుకోట్ల సంవత్సరాల నుంచి నడుస్తున్న, ఇంకా నడవబోతున్న సృష్టిలో మన జీవితం ఎంత? మనం ఎంత? ఇంతటి అల్పాతి అల్పమైన మనం అంతటి గొప్పవాడైన, మన ఊహకు అందని భగవంతుని ఆయన శక్తిని ఆలయానికి, చర్చికి పరిమితం చేసి ప్రవర్తిస్తున్నామంటే అన్యాయం కాదా? అది ఎంత అజ్ఞానం? ఎంత మూర్ఖత?

నిజంగా భగవంతుని శక్తి గుర్తించ గలిగితే దానికి తగ్గట్టుగా ప్రవర్తిస్తాం. భగవంతుడు గొప్పవాడు అంటూ ఆయన గొప్పతనానికి తగ్గట్టుగా ప్రవర్తించకపోవడం ఆయన శక్తిని తగ్గించినట్లే అవుతుంది.

అలా కోటానుకోట్ల లోకాలను, కోటానుకోట్ల జీవులను సృష్టించి మన వూహకు అందని విధంగా సృష్టిని నడిపిస్తున్న ఆ భగవంతుని ఒక కొబ్బరికాయ లేకపోతే రెండు అరటిపళ్ళు, ఇంకా అత్యల్పమైన కానుకలతో, పొగడ్తలతో వశం చేసుకోవచ్చుని భావించడం, అలా ప్రవర్తించడం, ఆయన శక్తిని తగ్గించడమే కాని, శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం కాదు.

సమస్త లోకాలు, వాటిలోని సమస్త సంపదలు ఆయనవైనపుడు అందులో మనం సమర్పించే అల్పాతి అల్పమైన కానుకలు ఆయనకెంత? మనం సమర్పించే అల్పమైన కానుకలు భగవంతుడు ఆశిస్తాడన్నట్లుగా చెయ్యటం ఆయన శక్తిని తగ్గించడమే కాని శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం కాదు.

సృష్టి అంతా ఆయనే అయినపుడు, సృష్టిలోని సమస్తమూ ఆయనే అయినపుడు అన్నిటిని వేరు వేరుగా ఎందుకు చూస్తున్నాం? అన్నీ ఆయనే అయినపుడు అందరినీ ఎందుకు ద్వేషిస్తున్నాం? మోసగిస్తున్నాం? బాధిస్తున్నాం? అవమానిస్తున్నాం?

అన్నీ ఆయనే అయినపుడు ఎవరిని ద్వేషించినా భగవంతుని ద్వేషించినట్టు కాదా? ఎవరిని హింసించినా, ఏ జీవిని హింసించినా భగవంతుని హింసించినట్టు కాదా? మాంస భక్షణ చేస్తూ ఎన్ని జీవులను హింసిస్తున్నాం? మరి ఈ పనులు ఎందుకు చేస్తున్నాం? అలా చేస్తే భగవంతుని హింసించినట్టే కదా? ఆయనను హింసించి, ఆయన అనుగ్రహం ఎలా పొందగలం?

భగవంతుని గూర్చి, భగవంతుని శక్తి గూర్చి పూర్తిగా అర్థం చేసుకుంటే ఆయన సృష్టిని, ఆయన సృష్టిలోని సమస్తాన్ని ప్రేమిస్తాం, మనలాగే చూసుకుంటాం, గౌరవిస్తాం. సమస్త జీవులు ఆయన రూపాలన్నట్టుగా ప్రవర్తించి, అన్నిటినీ ప్రేమించినపుడే భగవంతుని శక్తిని అర్థం చేసుకున్నట్టు. అప్పుడే మనం భగవంతునికి ఇష్టులవుతాం. చివరకు మనం కూడా దేవుళ్ళవుతాం.

అలా భగవంతుని గూర్చి పూర్తిగా అర్థం చేసుకోవాలన్నా "అహం బ్రహ్మాస్మి" అంటే మనం కూడా అంతటి గొప్ప భగవంతుడే అని తెలుసుకోవాలన్నా, ఈ సమస్త దుఃఖాల నుండి శాశ్వతంగా విముక్తి పొందాలన్నా ఒక్కటే మార్గం అదే "ఆనాపానసతి ధ్యానం". ఈ ధ్యానం చెయ్యడం ద్వారా భగవంతుని శక్తి పూర్తిగా అర్థం చేసుకుని ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించి జీవితాన్ని ధన్యం చేసుకుంటాం. అందుచేత 'భగవంతుని శక్తి తగ్గించకూడదని' తెలుసుకోవాలి. ధ్యానం చెయ్యాలి.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం)- రూ.100/- | | 22) త్రివిధాలు | - రూ.60/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం)- రూ.130/- | | 23) ధ్యానం (పత్రీజీ) | - రూ.50/- |
| 3) జీవిత సత్యాలు | - రూ.100/- | 24) ధ్యానం వల్లనే జ్ఞానం | - రూ.60/- |
| 4) భగవంతుడంటే | - రూ.130/- | 25) అతీంద్రియ శక్తులు | - రూ.60/- |
| 5) సత్యమార్గం | - రూ.130/- | 26) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - రూ.60/- |
| 6) ఆత్మ శాస్త్రం | - రూ.100/- | 27) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - రూ.60/- |
| 7) ధ్యాన శాస్త్రం | - రూ.100/- | 28) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - రూ.50/- |
| 8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - రూ.100/- | 29) మౌన ధ్యానం | - రూ.40/- |
| 9) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - రూ.100/- | 30) ఈ జీవితం ఎందుకు? | - రూ.50/- |
| 10) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - రూ.130/- | 31) నిర్వాణ మార్గం | - రూ.50/- |
| 11) ధ్యాన శక్తి | - రూ.100/- | 32) షిరిడీ సాయి సందేశాలు | - రూ.40/- |
| 12) తెలుసుకోండి | - రూ.120/- | 33) భాగవత సన్నివేశాల అంతరార్థం | - రూ.40/- |
| 13) జీవిత సూక్ష్మాలు | - రూ.120/- | 34) భూతదయే దైవత్వం | - రూ.40/- |
| 14) గీతాసందేశం | - రూ.100/- | 35) ఆలోచించండి | - రూ.60/- |
| 15) కర్మ సిద్ధాంతం | - రూ.80/- | 36) సంకల్పమంటే? | - రూ.50/- |
| 16) బ్రహ్మాజ్ఞానం | - రూ.60/- | 37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) | - రూ.30/- |
| 17) ఆత్మజ్ఞానం ఎందుకు? | - రూ.70/- | 38)మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - రూ.20/- |
| 18) ధ్యానమంటే ? | - రూ.50/- | 39) శాకాహారమే మానవాహారం | - రూ.15/- |
| 19) జ్ఞాన జ్యోతి | - రూ.70/- | 40) అహింస మరియు శాఖాహారం | - రూ.15/- |
| 20) జ్ఞాన కుసుమాలు | - రూ.70/- | | |
| 21) దుఃఖ నివారణామార్గం- | రూ.60/- | | |

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**
తటవర్తి వారి వీధి, భీమవరం-534 201. (ప॥గో॥జిల్లా.)
ఫోన్ : 9490171853, సెల్ : 9440309812

అందరూ భగవంతుడంటే ఇష్టమంటారు కానీ ఇష్టమైన ఆ భగవంతుని గురించి తెలుసుకోవటానికి ప్రయత్నించరు.

భగవంతుని గురించి తెలుసుకుంటే, ఆయన శక్తిని అవగాహన చేసుకుంటే, ఆయన తత్వాన్ని అర్థం చేసుకుంటే ఆయన్ను ఎలా ఆరాధించాలో తెలుస్తుంది. దుఃఖాల నుండి తాత్కాలికంగానే కాదు శాశ్వతంగా బయటపడవచ్చు. ముక్తి పొందవచ్చు.

భగవంతుని ఆరాధించే మార్గమే బ్రహ్మర్షి పత్రీజీ బోధించే "శ్వాస మీద ధ్యాస ధ్యానం". అందుచేత "ధ్యానమే నిజమైన భక్తి". దీనినే ఉపనిషత్తులలో "స్వస్వరూపానుసంధానం భక్తి రీత్య భిధీయతే" అన్నారు.

భగవంతుని గురించి పూర్తిగా తెలుసుకోలేకపోయినా, కొద్దిగానైనా అవగాహన చేసుకోవటానికి చేసిన నా యీ చిన్న ప్రయత్నమే "భగవంతుడంటే?". పాఠకులు సహృదయంతో స్వీకరించి, నిరాకార, నిర్గుణ భగవంతుని ఆత్మ తత్వాన్ని అర్థం చేసుకుని, 'ధ్యానం' ద్వారా నిజమైన ఆరాధన చేసి, తరిస్తారని ఆశిస్తూ...



మీ...

తటవర్తి వీరరాఘవరావు

రూ.130/-